thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

విజేతలకు ఢిల్లీలో ఘన స్వాగతం



11

# చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 125| జగిత్యాల | గురువారం 06 ఆగస్టు, 2026 ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్| పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

## జార్ఖండ్ నిరుద్యోగులకు సీజేపీ మద్దతు



జార్ఖండ్‌లో ఉద్యోగ నియామక పరీక్షల్లో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ ఆందోళన చేస్తున్న నిరుద్యోగ అభ్యర్థులకు సీజేపీ మద్దతు ప్రకటించింది. అవసరమైతే రాంచీకి వెళ్లి విద్యార్థుల ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొంటామని సీజేపీ చీఫ్ అభిజిత్ దీప్కే వెల్లడించారు.

4

## ఎట్టకేలకు దిగివచ్చిన మెటా



- ప్రధాని మోడీకి జుకర్ బర్గ్ క్షమాపణలు
- కంటెంట్‌ల బూస్ట్‌కు డబ్బులు తీసుకున్నట్లు అంగీకారం

4

## హర్మూజ్ తెరవకుంటే..

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇరాన్‌కు మరోసారి తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. హర్మూజ్ జలసంధిని సాధ్యమైనంత త్వరగా తెరవాలని, లేదంటే తీవ్రమైన దాడులు ఎదుర్కోవాల్సి ఉంటుందని వార్నింగ్ ఇచ్చారు. ఇరాన్‌తో తమ చర్చలు సానుకూలంగా సాగుతున్నా.. వాటిని ఆ దేశం బహిరంగంగా ఖండించడం ఆశ్చర్యకరంగా ఉందన్నారు.



4

## తుమ్మిడిహెట్టికి అనుమతులు ఇప్పించండి

తెలంగాణ-మహారాష్ట్ర మధ్య సమావేశం ఏర్పాటు చేయండి

జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు సీఎం రేవంత్ రెడ్డి వినతి



- చర్చల పక్రియ ప్రారంభిస్తామని కేంద్ర మంత్రి పాటిల్ హామీ
- అటవీ పర్యావరణ అనుమతులపై భూపేంద్రయాదవ్‌తో చర్చ
- ప్రధాని మోడీని తిడితే కేసు పెట్టామని వెల్లడి
- బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎందుకు పెట్టలేదని ప్రశ్న

ప్రాణహిత నదిపై తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణ ఎత్తు పెంపునకు మహారాష్ట్ర ప్రభుత్వం నుంచి అవసరమైన అనుమతులు ఇప్పించి, రెండు రాష్ట్రాల మధ్య చర్చలకు వేదిక ఏర్పాటు చేయాలని కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌కు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డితో కలసి బుధవారం కేంద్ర మంత్రిని ఆయన కార్యాలయంలో కలిశారు. ప్రాజెక్టు ఎత్తును 148 మీటర్ల నుంచి 150-152 మీటర్లకు పెంచినా ముంపు ప్రభావం ఎక్కువగా ఉండదని, 50 శాతం ముంపు నదీగర్భంలోనే ఉంటుందని సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ సెంటర్ అధ్యయనం తెలిపిందని వివరించారు. ఎత్తు పెంచడం వల్ల గ్రావిటీ ద్వారా నీటిని తరలించవచ్చని, తద్వారా విద్యుత్ భారం తగ్గుతుందని పేర్కొంటూ, మహారాష్ట్రతో తక్షణమే సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్.. మొదట సీడబ్ల్యూసీ ఆధ్వర్యంలో అధికారుల స్థాయి చర్చలు, ఆ తర్వాత నీటిపారుదల శాఖ మంత్రుల భేటీ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

వివరాలు 2వ పేజీలో..

- న్యూఢిల్లీ, ఆగస్టు 5



## 22ఏ భూముల పేరిట అర్హులకు అన్యాయం జరగదు

- కొత్తగా ఒక్క సెంటు భూమినీ నిషేధిత జాబితాలో చేర్చలేదు
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- ప్రభుత్వ భూములను కాపాడుతూనే భూహక్కుదారులకు న్యాయం చేయాలి
- 22ఏ దరఖాస్తులు, ఫిర్యాదులను గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్లకు ఆదేశం

3

## తెలంగాణ ప్రాజెక్టుల అనుమతులు రద్దు చేసే కుట్ర

- గోదావరి రివర్ బోర్డు ఎజెండాలో ఏపీకి అనుకూల నిర్ణయాలు
- 18న జరిగే భేటీ ఉన్నా ఎందుకు నోరు మెదపడం లేదు
- కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన మాజీమంత్రి హరీష్ రావు

3



## హరీష్ రావు తప్పుడు ప్రచారం మానుకోవాలి

- తెలంగాణ నీటి హక్కుల విషయంలో రాజీ లేదు
- కాళేశ్వరం ముడుపుల లెక్కలు తేల్చాలి
- మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి డిమాండ్

.. వివరాలు 3లో



## హైదరాబాద్‌తో పాటు 18 జిల్లాలకు ఎల్లో అలర్ట్

- క్యుములోనింబస్ మేఘాల ప్రభావంతో మరో మూడు రోజులు వర్షాలు
- కామారెడ్డి, మేడ్చల్, మెదక్, సంగారెడ్డికి ఆరెంజ్ హెచ్చరిక

2



## ఉప్పొంగుతున్న కృష్ణమ్మ

- జూరాల ప్రాజెక్టుకు భారీగా వరద నీరు..
- తీర ప్రాంత ప్రజలకు అధికారుల హెచ్చరికలు
- సరిహద్దు కృష్ణ బ్రిడ్జి వద్ద ఆహ్లాదకర దృశ్యాలు



2

ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న ఎడతెరిపి లేని భారీ వర్షాల కారణంగా కృష్ణానది ఉప్పొంగి ప్రవహిస్తోంది. కర్ణాటక పరివాహక ప్రాంతాల నుంచి భారీగా ప్రవాహం రావడంతో కృష్ణా, భీమా నదుల్లో వరద ఉధృతి గణనీయంగా పెరిగింది. గుర్జాపూర్ బ్యారేజీ తో పాటు యాదగిరి జిల్లా భీమా నదిపై ఉన్న గుగ్గల్ బ్యారేజీలకు వరద నీరు పోటెత్తింది.

## డిసెంబర్‌లో గ్లోబల్ సమ్మిట్

- భారీ పెట్టుబడుల ఆకర్షణకు వేదిక కావాలి
- సమన్వయంతో విస్తృత ఏర్పాట్లు చేయాలి
- అధికారులకు సీఎస్ సంజయ్ ఆదేశం

డిసెంబర్‌లో నిర్వహించనున్న 'తెలంగాణ రైజింగ్-2026' గ్లోబల్ సమ్మిట్ విజయవంతం అయ్యేలా అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేసి విస్తృత ఏర్పాట్లు చేపట్టాలని సీఎస్ సంజయ్ జాజు ఆదేశించారు.

2





## డయల్ 112 సేవలు ప్రారంభం

- పోలీస్,ఫైర్, అంబులెన్స్‌కు ఇక ఒక్కటే నంబర్
- సేవలను ప్రారంభించిన డీజీపీ సీవీ ఆనంద్

3

## హైడ్రా కమిషనర్ సంతకం ఫోర్జరీ

- నో అబ్జెక్షన్ ఫైర్ సర్వీస్ పత్రాలు ఇంటర్ బోర్డుకు సమర్పణ
- 8 ఇంటర్ కాలేజీలపై చర్యలకు ఆదేశం

2






# హైడ్రా కమిషనర్ రంగనాథ్ సంతకం ఫోర్జరీ

**నో అబ్జెక్షన్ ఫైర్ సర్వీస్ పత్రాలు ఇంటర్ బోర్డుకు సమర్పణ**

**8 ఇంటర్ కాలేజీలపై చర్యలకు ఆదేశం**

**హైదరాబాద్, ఆగస్ట్ 5:** హైడ్రా కమిషనర్ రంగనాథ్ సంతకాన్ని ఫోర్జరీ చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. దాదాపు ఎనిమిది ప్రైవేటు కాలేజీలు.. రంగనాథ్ సంతకాన్ని ఫోర్జరీ చేశాయి. హైడ్రా పేరును దుర్వినియోగం చేస్తూ నకిలీ ఫ్లై÷ర్ ఎన్వోసీలను సృష్టించిన కళాశాలలు.. వాటిని ఇంటర్మీడియట్ బోర్డుకు సమర్పించాయి. ఈ విషయం గుర్తించిన అధికారులు దీనిపై విచారణ చేపట్టగా.. హైడ్రా కమిషనర్ రంగనాథ్ సంతకం ఫోర్జరీ చేసినట్లు నిర్ధారించారు. దీంతో నకిలీ పత్రాలు సమర్పించిన ఎనిమిది ప్రైవేట్ కళాశాలల గుర్తింపును రద్దు చేయాలని సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు. అలాగే ఈ ఘటనపై లేక్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. ఫోర్జరీ, నకిలీ పత్రాల సృష్టి తదితర కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. హైడ్రా పేరుతో నకిలీ ఫైర్ నో అ÷-జబెక్షన్ సర్టిఫికెట్లు సృష్టించి ఇంటర్మీడియట్ బోర్డుకు సమర్పించిన వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఈ కేసులో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సంతకాన్ని ఫోర్జరీ చేసినట్లు గుర్తించిన అధికారులు 8 ప్రైవేటు జూనియర్ కాలేజీలపై కేసు నమోదు చేశారు. ఈ పత్రాల ఆధారంగా గుర్తింపు పొందేందుకు ప్రయత్నించినట్లు వెల్లడైంది. ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులు ఫిర్యాదు చేయడంతో లేక్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. దర్యాప్తులో తెల్లాపూర్, చిక్కడపల్లి, ఎస్ఆర్ నగర్, మెహిదీపట్నం, బర్కత్‌పురా ప్రాంతంలోని 8 ప్రైవేటు కాలేజీ యాజమాన్యాలు ఈ ఫోర్జరీకి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. ఆయా కాలేజీ గుర్తింపును రద్దు చేయాలని ఇంటర్మీడియట్ బోర్డుకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఇదిలా ఉండగా.. ఇదే తరహాలో సమర్పించిన మరో 60 ప్రైవేటు కాలేజీ ఫైర్ ఎన్ఓసీలను కూడా అధికారులు స్క్రూటినీ చేస్తున్నారు. వాటి ప్రామాణికతపై విచారణ కొనసాగుతోందని, దర్యాప్తులో మరిన్ని అక్రమాలకు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

# ఉప్పొంగుతున్న కృష్ణమ్మ

**జూరాల ప్రాజెక్టుకు భారీగా వరద నీరు..**

**తీర ప్రాంత ప్రజలకు అధికారుల హెచ్చరికలు**



**నారాయణపేట, ఆగస్ట్ 5:** ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న ఎడతెరిపి భారీ వర్షాల కారణంగా కృష్ణానది ఉప్పొంగి ప్రవహిస్తోంది. కర్ణాటకలోని రాయచూర్ జిల్లా కృష్ణ నదిపై నిర్మించిన గుర్జాపూర్, యాదగిరి జిల్లా గూడూరు భీమా నదిపై ఉన్న గుగ్గల్ బ్యారేజీకి వరద నీరు పోటెత్తడంతో ఈ బ్యారేజీ 40 గేట్లను ఎత్తి దిగువకు నీటి విడుదల చేస్తున్నారు. ఎగువ నుంచి భారీగా వస్తున్న వరద జలాలు తెలంగాణలోని జోగులాంబ గద్వాల జిల్లా జూరాల ప్రాజెక్టు కు చేరుతుండటంతో నది పరివాహక ప్రాంతం జలకళను సంతరించుకుంది. నది పూర్తిగా నీటితో నిండిపోవడంతో తెలంగాణ-కర్ణాటక సరిహద్దులోని కృష్ణ బ్రిడ్జి కింద ప్రవహిస్తున్న వరద ప్రవాహం ఆహ్లాదకర దృశ్యాన్ని తలపిస్తోంది. ఈ దృశ్యాన్ని చూసేందుకు స్థానికులతో పాటు ప్రయాణికులు కూడా బ్రిడ్జి వద్దకు చేరుకుని ఫొటోలు, వీడియోలు తీసుకుంటున్నారు. కృష్ణానదిలో ప్రవాహం రోజురోజుకు వరద ప్రవాహం పెరుగుతుండడంతో జూరాల ప్రాజెక్టు అధికారులు ఎప్పటి కప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. నది పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. ఇదిలా ఉండగా, వరద ఉధృతి కారణంగా నదిలో స్నానాలు చేయకుండా, చేపల వేటకు వెళ్లకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

# హైదరాబాద్‌తో పాటు 18 జిల్లాలకు ఎల్లో అలర్ట్

**హైదరాబాద్, ఆగస్టు 5:** రాష్ట్రవ్యాప్తంగా క్యుములోనింబస్ మేఘాల ప్రభావంతో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. రానున్న మూడు రోజుల పాటు పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌తో పాటు 18 జిల్లాలకు ఎల్లో అలర్ట్, నాలుగు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. కామారెడ్డి, మేడ్చల్--మల్కాజిగిరి, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది. హైదరాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ఖమ్మం, కుమురం భీం ఆసిఫాబాద్, మహబూబాబాద్, మంచిర్యాల, ములుగు, నల్లగొండ, నారాయణపేట, నిర్మల్, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, రంగారెడ్డి, సిద్దిపేట, సూర్యాపేట, వికారాబాద్, వరంగల్, యాదాద్రి భువనగిరి జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఈ ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ తెలిపింది. గడిచిన 24 గంటల్లో రాష్ట్రంలోని నాలుగు మండలాల్లో 11.56 నుంచి 20.44 సెంటీమీటర్ల మధ్య భారీ వర్షపాతం నమోదైంది. మరో 40 మండలాల్లో 6.45 నుంచి 11.55 సెంటీమీటర్ల మధ్య, 281 మండలాల్లో 1.56 నుంచి 6.44 సెంటీమీటర్ల మధ్య వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. రాష్ట్రంలో అత్యధికంగా కామారెడ్డి జిల్లా పిట్లం మండలంలో 14.11 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు వాతావరణ కేంద్రం పేర్కొంది. ప్రజలు వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు.

# తుమ్మిడిహెట్టికి అనుమతులు ఇప్పించండి

- తెలంగాణ-మహారాష్ట్ర మధ్య సమావేశం ఏర్పాటు చేయండి
- జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు సీఎం రేవంత్ రెడ్డి వినతి
- చర్చల పక్రియ ప్రారంభిస్తామని కేంద్ర మంత్రి పాటిల్
- అటవీ పర్యావరణ అనుమతులుపై భూపేంద్రయాదవ్‌తో చర్చ
- ప్రధాని మోడీని తిడితే కేసు పెట్టామని వెల్లడి
- బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎందుకు పెట్టలేదని ప్రశ్న



**న్యూఢిల్లీ, ఆగస్టు 5:** ప్రాణహిత నదిపై ప్రతిపాదిత తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తు పెంపునకు మహారాష్ట్ర నుంచి అనుమతులు ఇప్పించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కేంద్ర జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌ను కోరారు. ఈ అంశంపై తెలంగాణ, మహారాష్ట్రల మధ్య త్వరితగతిన సమావేశం ఏర్పాటు చేసి చర్చలు ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. బుధవారం న్యూఢిల్లీలో జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌ను సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కలిసి తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ప్రాధాన్యతను వివరించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి తాను రాసిన లేఖ, దానిపై ప్రధానమంత్రి కార్యాలయం స్పందించి జల్‌శక్తి శాఖకు పంపిన లేఖను కూడా కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. గతంలో 148 మీటర్ల ఎత్తుతో బ్యారేజీ నిర్మాణానికి రెండు రాష్ట్రాల మధ్య ఒప్పందం కుదిరిందని, అయితే 150 నుంచి 152 మీటర్ల ఎత్తుతో నిర్మిస్తే గ్రావిటీ ద్వారా నీటి సరఫరా సాధ్యమవుతుందని సీఎం వివరించారు. పుణెలోని సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ సెంటర్ అధ్యయనం ప్రకారం 148 మీటర్లు, 152 మీటర్ల ఎత్తుల్లో ముంపు ప్రభావంలో పెద్దగా తేడా లేదని, ముంపులో అధిక భాగం నదీగర్భంలోనే ఉంటుందని తెలిపారు. బ్యారేజీ ఎత్తు పెరిగితే ఎత్తిపోతల అవసరం తగ్గి విద్యుత్ వ్యయం కూడా ఆదా అవుతుందని, ముఖ్యంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సాగునీటి సౌకర్యం కల్పించేందుకు ఈ ప్రాజెక్టు ఎంతో కీలకమని సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రికి వివరించారు. ఈ అంశంపై స్పందించిన జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్, ప్రధానమంత్రి కార్యాలయం నుంచి వచ్చిన లేఖ తమకు అందిందని తెలిపారు. తొలుత కేంద్ర జల సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ, మహారాష్ట్ర అధికారులతో సమావేశం నిర్వహించి చర్చల ప్రక్రియ ప్రారంభిస్తామని, అనంతరం రెండు రాష్ట్రాల నీటిపారుదల శాఖ మంత్రులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

**పర్యావరణ అనుమతులపై భూపేందర్‌తో భేటీ**

కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్‌తో కూడా సీఎం రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. పాలమూరు-రంగారెడ్డి, సీతారామ సాగర్, ఎస్ఆర్‌వీఎస్ డిండి, గౌరవెల్లి ప్రాజెక్టులకు పర్యావరణ, అటవీ అనుమతులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని రహదారులు, అభివృద్ధి ప్రాజెక్టులకు సంబంధించిన పెండింగ్ అనుమతుల అంశాన్ని కూడా కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

**కిషన్ రెడ్డి వ్యాఖ్యలకు సీఎం కౌంటర్**

ఢిల్లీ పర్యటన సందర్భంగా మీడియాతో మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి, ప్రధాని నరేంద్ర మోదీపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన వారిపై తమ ప్రభుత్వం కేసు నమోదు చేసిందని చెప్పారు. ప్రధాని దూషణలపై బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎన్ని కేసులు నమోదు చేశారో చెప్పాలని ప్రశ్నించారు. డీఎస్పీ బదిలీపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చేసిన విమర్శలను తిప్పికొడుతూ, అధికారుల బదిలీలు ప్రభుత్వం పరిధిలోని పరిపాలనా అంశమని స్పష్టం చేశారు. బీజేపీ నేతలూ ప్రత్యర్థులపై తీవ్ర వ్యాఖ్యలు చేస్తున్నారని, కాక్రోచ్ జనతా పార్టీ, విద్యార్థులపై కూడా అవమానకర వ్యాఖ్యలు చేశారని విమర్శించారు.

# డిసెంబర్‌లో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్

- భారీ పెట్టుబడుల ఆకర్షణకు సమ్మిట్ వేదిక కావాలి
- సమన్వయంతో విస్తృత ఏర్పాట్లు చేయాలి
- అధికారులకు సీఎస్ సంజయ్ జాజు ఆదేశం



**హైదరాబాద్, ఆగస్టు 5:** డిసెంబర్‌లో నిర్వహించనున్న 'తెలంగాణ రైజింగ్-2026' గ్లోబల్ సమ్మిట్ విజయవంతం అయ్యేలా అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేసి విస్తృత ఏర్పాట్లు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు బుధవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రైజింగ్--2047 లక్ష్య సాధనలో భాగంగా రాష్ట్రానికి భారీ పెట్టుబడులను ఆకర్షించేందుకు జాతీయ, అంతర్జాతీయ సంస్థల భాగస్వామ్యం కీలకమని సంజయ్ జాజు పేర్కొన్నారు. రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తి (జీఎస్‌డీపీ) వృద్ధికి ఈ గ్లోబల్ సమ్మిట్ ప్రధాన వేదికగా నిలవాలని, అందుకు అన్ని శాఖలు సమగ్ర కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. తెలంగాణను పారిశ్రామికాభివృద్ధి, పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు, నైపుణ్యాభివృద్ధి, ఆవిష్కరణలు, ఉపాధి కల్పన, సంక్షేమం వంటి అన్ని రంగాల్లో దేశంలోనే అగ్రగామిగా నిలపాలనే లక్ష్యంతో ప్రభుత్వం 'తెలంగాణ రైజింగ్' కార్యక్రమాన్ని అమలు చేస్తోందని ఆయన తెలిపారు. గ్లోబల్ సమ్మిట్ నిర్వహణకు భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ భవన సముదాయాలను వినియోగించుకోవాలని సూచించారు. సమ్మిట్‌కు అవసరమైన రహదారులు, విద్యుత్, తాగునీటి సరఫరా, ఇతర మౌలిక వసతులను సకాలంలో పూర్తి చేయాలని సంబంధిత శాఖలకు ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రానికి కొత్త పెట్టుబడులను ఆకర్షించడం, పారిశ్రామిక వృద్ధిని మరింత వేగవంతం చేయడం, యువతకు నైపుణ్యాభివృద్ధి అవకాశాలను విస్తరించడం, ఉపాధి కల్పనను పెంచడం, డిజిటల్ సేవలను మరింత సమర్థవంతంగా అందించడం వంటి అంశాలపై సమావేశంలో అధికారులు విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు, ఎక్స్‌అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, టీజీఐఐసీ ఎండీ శశాంక, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓ అజిత్ రెడ్డి, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి, ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి తదితరులు పాల్గొన్నారు.

# 22ఏ భూముల పేరిట అర్హులకు అన్యాయం జరగదు

- కొత్తగా ఒక్క సెంటు భూమినీ నిషేధిత జాబితాలో చేర్చలేదు
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- ప్రభుత్వ భూములను కాపాడుతూనే భూహక్కుదారులకు న్యాయం చేయాలి
- 22ఏ దరఖాస్తులు, ఫిర్యాదులను గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్లకు ఆదేశం



**హైదరాబాద్, ఆగస్ట్ 5:** రాష్ట్రంలో 22ఏ నిషేధిత జాబితాలో ఉన్న భూముల విషయంలో ఏ పేదవాడికీ, ఏ నిజమైన భూహక్కుదారుడికీ అన్యాయం జరగకుండా చూడటమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార / పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. అర్హులైన వారి హక్కులను కాపాడటం, అదే సమయంలో ప్రభుత్వ భూములను రక్షించడం అనే రెండు లక్ష్యాలతో ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలో అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్దేశపూర్వకంగా ఒక్క సెంటు భూమిని కూడా 22ఏ నిషేధిత జాబితాలో చేర్చలేదని మంత్రి స్పష్టం చేశారు. ప్రజలను ఇబ్బందులకు గురిచేయాలనే ఉద్దేశం ఈ ప్రభుత్వానికి ఎన్నడూ లేదని, వివాదాలు లేని ప్రైవేట్ భూములను నిషేధిత జాబితాలో చేర్చిందన్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని పేర్కొన్నారు. బుధవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలోని తన కార్యాలయంలో క్యూర్ పరిధిలోని 22ఏ నిషేధిత భూములకు సంబంధించి వివిధ మాధ్యమాల్లో వచ్చిన కథనాలు, ప్రజల ఫిర్యాదులు, హైకోర్టు ఆదేశాలు, ప్రభుత్వ విధానాలపై మంత్రి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి శేషాద్రి, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్, స్టాంప్స్/రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు, హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు, మేడ్చల్ మల్కాజిగిరి అదనపు కలెక్టర్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ, ఈ సమావేశం క్యూర్ పరిధి జిల్లాలకు సంబంధించినదైనా, ఇందులో ఇచ్చిన ఆదేశాలు రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు, స్టాంప్స్/రిజిస్ట్రేషన్ అధికారులు తప్పనిసరిగా అమలు చేయాలని స్పష్టం చేశారు. 22ఏ అంశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారి ఆలోచనలు, సూచనలు అనుగుణంగా ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాన్ని అధికారులు పూర్తిగా అర్థం చేసుకుని అదే స్ఫూర్తితో పనిచేయాలని ఆదేశించారు. అర్హులైన వ్యక్తికి న్యాయం చేయడం ప్రభుత్వ బాధ్యత. అదే సమయంలో ప్రభుత్వ భూములు కాపాడటం కూడా అంతే ముఖ్యమైన బాధ్యత అని అన్నారు. నిషేధిత జాబితాలో ఉన్న భూములను సమగ్రంగా పరిశీలించి, చట్టబద్ధంగా, నిబంధనల మేరకు అర్హత ఉన్న భూములను గుర్తిస్తూ, ప్రజలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి కేసును వాస్తవాలు, రికార్డులు, చట్టపరమైన అంశాల ఆధారంగా పరిశీలించి నిర్ణయాలు తీసుకోవాలని ఆదేశించారు. 22ఏకు సంబంధించిన దరఖాస్తులు, ఫిర్యాదులు ఏ స్థాయిలో వచ్చినా పెండింగ్‌లో ఉంచకుండా నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించాలని మంత్రి స్పష్టం చేశారు. తహసీల్దార్, ఆర్డీవో, సబ్ కలెక్టర్, జిల్లా కలెక్టర్ స్థాయిలో వచ్చే ప్రతి దరఖాస్తును సమగ్రంగా పరిశీలించి అర్హులైన వారికి న్యాయం చేయాలని సూచించారు. ÷-రజావాణిలో ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులను కూడా ప్రత్యేక దృష్టి సారించి, వెంటనే విచారణ పూర్తి చేసి విధిగా పరిష్కరించాలని ఆదేశించారు. 22ఏ భూములకు సంబంధించిన వివాదాల పరిష్కారానికి హైకోర్టు నిర్దేశిరచిన 45 రోజుల గడువులోనే అన్ని పక్రియలు పూర్తి చేసి తుది నిర్ణయం తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. 22ఏ కు సంబంధించిన కేసులలో కోర్టు ఆదేశాలను పరిగణనలోకి తీసుకొని పరిష్కరించాలని ప్రజలకు న్యాయం జరిగేలా వ్యవహరించాలని సూచించారు. ప్రభుత్వ భూములను పరిరక్షించడం ప్రభుత్వ ప్రథమ బాధ్యత అని మంత్రి స్పష్టం చేశారు. ప్రభుత్వ భూములపై అక్రమ లావాదేవీలు, అక్రమ రిజిస్ట్రేషన్లు, ఆక్రమణలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. 22ఏ జాబితాలో ఉన్న భూములపై సమగ్ర పరిశీలన చేసి తుది నిర్ణయం తీసుకునే అధికారం జిల్లా కలెక్టర్లకు ఉందని గుర్తుచేస్తూ, ప్రజల హక్కులు ? ప్రభుత్వ ప్రయోజనాలు రెండింటినీ సమతుల్యం చేస్తూ పారదర్శకంగా నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు.

# ప్రాజెక్టుల అనుమతులు రద్దు చేసే కుట్ర

- గోదావరి రివర్ బోర్డు ఎజెండాలో ఏపీకి అనుకూల నిర్ణయాలు
- 18న జరిగే భేటీ ఉన్నా ఎందుకు నోరు మెదపడం లేదు
- కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన మాజీమంత్రి హరీష్ రావు




**హైదరాబాద్, ఆగస్టు 5:** తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులకు ఇప్పటికే లభించిన అనుమతులను పునఃసమీక్షించి రద్దు చేసే కుట్ర జరుగుతోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ఆరోపించారు. గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (జీఆర్ఎంబీ) ఈ నెల 18న నిర్వహించనున్న సమావేశం ఎజెండాలో తెలంగాణ ప్రాజెక్టుల అంశాలు చేర్చడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కేసీఆర్ ప్రభుత్వ హయాంలో అనుమతులు పొందిన కాళేశ్వరం, సీతారామ, సమ్మక్క సాగర్ సహా ఏడు ప్రాజెక్టుల అనుమతులను సమీక్షించాలని ఆంధ్రప్రదేశ్ కోరగా, అదే అంశాన్ని జీఆర్ఎంబీ ఎజెండాలో చేర్చడం ఆందోళన కలిగిస్తోందన్నారు. ఇప్పటికే అనుమతులు పొందిన ప్రాజెక్టులను రద్దు చేసిన చరిత్ర దేశంలో ఎక్కడా లేదని పేర్కొన్నారు. 18న జరిగే బోర్డు సమావేశానికి సంబంధించిన ఎజెండా విడుదలై వారం రోజులు గడిచినా రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం ఆశ్చర్యకరమని హరీశ్‌రావు విమర్శించారు. తెలంగాణకు చెందిన ఇంజినీర్లు బోర్డులో ఉన్నప్పటికీ ఈ అంశం ఎజెండాలోకి ఎలా వచ్చిందని ప్రశ్నించారు. ఒకవేళ ప్రభుత్వం ముందుగానే తెలుసుకుని కూడా స్పందించకపోతే అది మరింత ఆందోళనకరమని అన్నారు. తెలంగాణ ఏర్పాటుకు తర్వాత గోదావరి జలాల్లో రాష్ట్రానికి 383 టీఎంసీల వినియోగానికి అవసరమైన అనుమతులు బీఆర్ఎస్ ప్రభుత్వం సాధించిందని గుర్తు చేసిన ఆయన, ఇప్పుడు వాటినే రద్దు చేయాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క కొత్త ప్రాజెక్టుకు కూడా అనుమతులు తీసుకురాలేదని, పైగా ఇప్పటికే పొందిన అనుమతులు కూడా ప్రమాదంలో పడుతున్నాయని విమర్శించారు. సమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు 2022లో సాధించిన అనుమతులను కూడా రద్దు చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని హరీశ్‌రావు ఆరోపించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన నీరు హుజూ-ర్‌నగర్ ప్రాంతానికి ఉపయోగపడుతుందని, అయినప్పటికీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. తాము ఈ అంశాన్ని లేవనెత్తిన తర్వాతే ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాయడం తమ విమర్శలకు నిదర్శనమని అన్నారు. గోదావరి-బనకచర్ల అంశంపై కూడా రాష్ట్ర ప్రభుత్వం లోపాయికారీ ఒప్పందాలతో వ్యవహరిస్తోందని ఆరోపించిన హరీశ్‌రావు, తెలంగాణకు చట్టబద్ధంగా ఉన్న 960 టీఎంసీల గోదావరి జలాల హక్కులను ప్రభుత్వం సమర్థంగా కాపాడలేకపోతోందన్నారు. కృష్ణా జలాల వినియోగంలోనూ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. తెలంగాణ ప్రాజెక్టులకు సంబంధించిన ఏడు అనుమతులను సమీక్షించే ప్రతిపాదనపై బీజేపీ నేతలు కూడా స్పందించకపోవడం దురదృష్టకరమని పేర్కొన్న ఆయన, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని జీఆర్ఎంబీ ఎజెండా నుంచి తెలంగాణ ప్రాజెక్టులకు సంబంధించిన అంశాలను తొలగించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఎంపీలు కూడా పార్లమెంట్‌లో ఈ అంశాన్ని బలంగా లేవనెత్తాలని కోరారు. తెలంగాణ నీటి హక్కులకు భంగం కలిగించే ఎలాంటి చర్యలనైనా రాష్ట్ర ప్రజలు సహించరని హెచ్చరించిన హరీశ్‌రావు, కాళేశ్వరం ప్రాజెక్టు అనుమతులను రద్దు చేయడం అంటే సగం తెలంగాణ రైతాంగానికి అన్యాయం చేయడమేనని వ్యాఖ్యానించారు. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో ప్రభుత్వం వెంటనే స్పష్టమైన వైఖరి వెల్లడించాలని డిమాండ్ చేశారు.

# హరీష్ రావు తప్పుడు ప్రచారం మానుకోవాలి

- నీటి హక్కుల విషయంలో రాజీ లేదు
- కాళేశ్వరం ముడుపుల లెక్కలు తేల్చాలి
- మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి డిమాండ్



**హైదరాబాద్, ఆగస్టు 5 :** ఏపీ ప్రభుత్వం గత పన్నెండేళ్లుగా ప్రతి బోర్డు సమావేశంలో తెలంగాణ ప్రాజెక్టులను వ్యతిరేకిస్తూనే ఉందని, ఇందులో కొత్తేమీ లేదని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఏపీ ప్రాజెక్టులకు పరోక్షంగా సహకరించిన బీఆర్ఎస్ నాయకులు, అధికారం కోల్పోయాక ప్రభుత్వంపై నిరాధారమైన నిందలు వేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ రైతాంగ నీటి ప్రయోజనాలను కాపాడే విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి రాజీ పడదని తేల్చి చెప్పారు. బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తొమ్మిదిన్నరేళ్ల పాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్ర హక్కులను ఏనాడూ కాపాడలేదని, రాయలసీమ ఎత్తిపోతల పథకం, పోలవరం-బనకచర్ల, పట్టిసీమ ప్రాజెక్టుల నిర్మాణాలు వారి హయాంలోనే జరిగాయని మంత్రి గుర్తుచేశారు. ఈ నెల 18న జరగనున్న జీఆర్ఎంబీ సమావేశ అజెండాలోని అంశాలన్నీ పాతవేనని, గతంలో కూడా ఏపీ ప్రభుత్వం సీతారామ, సమ్మక్క, చిన్న కాళేశ్వరం వంటి ఏడు ప్రాజెక్టులను అడ్డుకునే ప్రయత్నం చేసిందని తెలిపారు. అయితే తమ ప్రభుత్వం సీడబ్ల్యూసీ, జీఆర్ఎంబీల వద్ద దీటుగా స్పందించి, సుదీర్ఘ పోరాటం ద్వారా సీతమ్మ సాగర్-సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు విజయవంతంగా టీఏసీ క్లియరెన్స్ సాధించిందని వివరించారు. అలాగే సమ్మక్క సాగర్ ప్రాజెక్టు ఎన్‌వోసీ కోసం ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రితో మాట్లాడామని, ఈ నెలాఖరులోగా నిరభ్యంతర పత్రం లభిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఏపీ ప్రతిపాదించిన కృష్ణా వాటా ట్రిబ్యునల్ ఏర్పాటు అడ్డుకోవడంలో తమ ప్రభుత్వం సమయస్ఫూర్తిగా వ్యవహరించిందని స్పష్టం చేశారు. పోతిరెడ్డిపాడు, ఇతర అంశాలపై సీఎం, నీటిపారుదల శాఖ, అధికారులు నిరంతరం కేంద్ర ప్రభుత్వంతో, బోర్డులతో సంప్రదింపులు జరుపుతున్నారని, సుప్రీంకోర్టులో ఒరిజినల్ సూట్ దాఖలు చేసి న్యాయపోరాటం చేస్తున్నామని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో ఏపీ కాంట్రాక్టర్ల నుంచి ముడుపులు అందాయని సొంత చెల్లెలు కవిత చేసిన ఆరోపణలపై హరీష్‌రావు ముందుగా సమాధానం చెప్పాలని, లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరాన్ని కూల్చివేసే స్థితికి తెచ్చిన బీఆర్ఎస్ నేతలకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కు లేదని దుయ్యబట్టారు.

# డయల్ 112 సేవలు ప్రారంభం

## పోలీస్,ఫైర్, అంబులెన్స్‌కు ఇక ఒక్కటే నంబర్

## సేవలను ప్రారంభించిన డిజిపి సివి ఆనంద్

**హైదరాబాద్,ఆగస్ట్5 :** తెలంగాణలో డయల్ 112 సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఏ ఫిర్యాదుకైనా ఇక 112 ద్వారా సమాధానం వస్తుంది. రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ.. డయల్ 112 ద్వారా 18 రకాల సేవలు అందుబాటులోకి వస్తాయని వెల్లడించారు. న్యాయసాయం, వైద్యసాయం, సైబర్‌సాయం అనేక సమస్యల పరిష్కారాలకు డయల్ 112 పరిష్కార మార్గమని వ్యాఖ్యానించారు. డయల్ 112కు ఫోన్ చేసినప్పుడు పోలీసులు దానిని ఎట్టి పరిస్థితుల్లోనూ తిరస్కరించడానికి వీల్లేదని స్పష్టం చేశారు. ఒకే వ్యవస్థలోకి పోలీస్, ఫైర్, అంబులెన్స్ సేవలు, టిజిఐసిసి నుంచి డయల్ 112 సేవలను పర్యవేక్షిస్తామని డీజీపీ తెలిపారు. ప్రజల భద్రత, అత్యవసర స్పందన సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేయడమే తమ లక్ష్యమని వెల్లడించారు. డయల్ 112 ఫోన్ రాగానే కాలర్ లొకేషన్ కోసం అడ్వాన్స్ ఆల్స్ వాడుతున్నామని పేర్కొన్నారు. డ్రోన్ బెస్ట్ టెక్నికల్ సిస్టంను త్వరలోనే తెలంగాణ పోలీసులు ఉపయోగిస్తారని వివరించారు. డ్రోన్ టీమ్‌ను సైతం ఏర్పాటు చేయబోతున్నామని చెప్పుకొచ్చారు. డయల్ 112 అనేది 3.0 వర్షన్‌గా ఉంటుందని తెలిపారు. యువ ఏపీఎస్‌లు, ఏఐ టెక్నాలజీ వాడే వారిని ఇందులో భాగస్వామ్యం చేయబోతున్నామని డీజీపీ ఆనంద్ పేర్కొన్నారు. బేసిక్ పోలీసింగ్ లాగా టెక్నాలజీ పోలీసింగ్‌ను అమల్లోకి తీసుకువస్తున్నామని వ్యాఖ్యానించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ టవర్‌లో రెండు ఫ్లోర్‌లను డయల్ 112కి కేటాయించామని తెలిపారు. డయల్ 100ను 2013లో కొంపల్లిలో జివికె వారి సాయంతో ప్రారంభించామని ప్రస్తావించారు. వివిధ అత్యవసరాలకు ఒకే నంబర్ ఉండాలని గతంలో కేంద్రప్రభుత్వం సూచించిందని వెల్లడించారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత టెక్నికల్ డెవలప్‌మెంట్ చేస్తూ వచ్చామని అన్నారు. ఇటీవల ఏఐ వచ్చాక అనేక పనులు సులువుగా అయిపోతున్నాయని డీజీపీ ఆనంద్ వెల్లడించారు.






# భద్రాచలం వద్ద రెండో బ్రిడ్జి నిర్మాణం

## పనులను పరిశీలించిన మంత్రి తుమ్మల

**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్ట్ 5:** భద్రాచలం రామాలయం దర్శనానికి వచ్చే భక్తుల సౌకర్యం కోసం రెండో బ్రిడ్జి నిర్మిస్తున్నట్లు తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. 2015లో గోదావరి పుష్కరాల సందర్భంగా వచ్చిన లక్షలాది మంది భక్తులకు ఒకే బ్రిడ్జి ఉండటంతో ట్రాఫిక్ ఇబ్బందులు వచ్చాయని ప్రస్తావించారు. భద్రాచలం వద్ద గోదావరి నదిపై నిర్మిస్తున్న రెండో బ్రిడ్జి పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా బ్రిడ్జి పనుల గురించి అధికారులకు మంత్రి పలు సూచనలు చేశారు. అనంతరం మంత్రి తుమ్మల మీడియాతో మాట్లాడారు. అమరావతి టూ జగదల్‌పూర్ జాతీయ రహదారిని భద్రాచలం మీదుగా ప్లాన్ చేసి రెండో బ్రిడ్జిని నిర్మిస్తున్నట్లు మంత్రి తుమ్మల వెల్లడించారు. ఈ బ్రిడ్జి అప్రోచ్ వరద కోతకు గురవకుండా రిటైనింగ్ వాల్ నిర్మిస్తున్నట్లు వివరించారు. ఈ నెలలో గోదావరి రెండో బ్రిడ్జిపై రాకపోకలు కొనసాగుతాయని చెప్పుకొచ్చారు. వచ్చే ఏడాది జరగనున్న గోదావరి పుష్కరాల సందర్భంగా భక్తులకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా అందుబాటులోకి ఈ బ్రిడ్జిని తీసుకువస్తామని తెలిపారు. కేసీఆర్ హయాంలో ఈ బ్రిడ్జి నిర్మాణ పనులు నత్తనడకన సాగాయని అన్నారు. ఏపీ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా వయా భద్రాచలం వెళ్లే ప్రయాణికులకు ఈ రెండో బ్రిడ్జి ఎంతో సౌకర్యంగా ఉంటుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.



# విద్యార్థులకు వీసాలు పెంచాలి

## అమెరికా రాయబారి సెర్జియో గోర్‌ను కోరిన సీఎం రేవంత్ రెడ్డి

**న్యూఢిల్లీ, ఆగస్టు 5:** ఉన్నత విద్య కోసం అమెరికాకు వెళ్లే తెలంగాణ విద్యార్థులకు మరిన్ని వీసాలు మంజూరు చేయడంతో పాటు వీసా అపాయింట్‌మెంట్లు సకాలంలో లభించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి భారత్‌లోని అమెరికా రాయబారి సెర్జియో గోర్‌ను కోరారు. బుధవారం ఢిల్లీలో మర్యాదపూర్వకంగా జరిగిన భేటీలో ఈ అంశాలతో పాటు విద్య, పెట్టుబడులు, సాంకేతికత, ఉపాధి, పరిశోధన రంగాల్లో పరస్పర సహకారంపై విస్తృతంగా చర్చించారు. సుమారు అరగంటకు పైగా సాగిన సమావేశంలో తెలంగాణ విద్యార్థులకు వీసా ఇంటర్వ్యూ స్లాట్లను పెంచాలని, దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. అమెరికాలో ఉద్యోగాలు చేస్తున్న తెలంగాణకు చెందిన నిపుణులు ఎదుర్కొంటున్న సమస్యలను కూడా రాయబారి దృష్టికి తీసుకెళ్లారు. హెచ్-1బీ వీసాల ప్రాసెసింగ్, రెన్యువల్, వీసా స్టాంపింగ్ ప్రక్రియను మరింత సరళీకరించాలని, వీసా నిబంధనల్లో మార్పులు జరిగే ముందు ముందస్తు సమాచారం అందించాలని కోరారు. అమెరికాలో చదువుతున్న తెలంగాణ విద్యార్థుల భద్రత, సంక్షేమంపై ప్రత్యేకంగా చర్చించిన ముఖ్యమంత్రి, రాష్ట్రంలో అమెరికా కంపెనీలకు విస్తృత పెట్టుబడి అవకాశాలు ఉన్నాయని వివరించారు. సమాచార సాంకేతికత, కృత్రిమ మేధ, జీవ విజ్ఞాన శాస్త్రాలు, ఔషధ పరిశ్రమ, స్టార్టప్‌లు, పరిశోధన, ఆధునిక సాంకేతిక రంగాల్లో భాగస్వామ్యానికి తెలంగాణ సిద్ధంగా ఉందని తెలిపారు. అమెరికా విశ్వవిద్యాలయాలు తెలంగాణ విద్యాసంస్థలతో కలిసి పరిశోధన, విద్యార్థుల మార్పిడి, ఆవిష్కరణలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను విస్తరించేలా సహకరించాలని ముఖ్యమంత్రి కోరారు. అమెరికాలో అత్యంత వేగంగా విస్తరిస్తున్న భారతీయ భాషల్లో తెలుగు ఒకటని గుర్తు చేశారు. భారత చరిత్ర, సంస్కృతిపై అమెరికా రాయబారి సెర్జియో గోర్‌కు ఉన్న అవగాహన తనను ఆకట్టుకుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, వంటకాలు, రాష్ట్ర అభివృద్ధి అవకాశాలపై రాయబారి చూపిన ఆసక్తిని అభినందించారు. తెలంగాణ--అమెరికా మధ్య వ్యాపారం, పెట్టుబడులు, విద్య, సాంకేతిక సహకారం, సాంస్కృతిక మార్పిడి, ప్రజల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేసేందుకు సంపూర్ణ సహకారం అందిస్తామని అమెరికా రాయబారి సెర్జియో గోర్ హామీ ఇచ్చినట్లు వెల్లడించారు.

# సీఎం రేవంత్ విదేశీ పర్యటన

## షరతులతో అనుమతిచ్చిన ఏసీబీ కోర్టు

**హైదరాబాద్, ఆగస్ట్ 5:** సీఎం రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనకు ఏసీబీ ప్రత్యేక కోర్టు షరతులతో కూడిన అనుమతి ఇచ్చింది. ఓటుకు నోటు కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న రేవంత్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానం, ఈ నెల 17 నుంచి సెప్టెంబర్ 10 వరకు యూకే, అమెరికా, జర్మనీ, చైనా దేశాల్లో పర్యటించేందుకు అనుమతించింది. ఇందుకోసం కోర్టు కస్టడీలో ఉన్న ఆయన పాస్-పోర్టులను తాత్కాలికంగా విడుదల చేయాలని ఆదేశించింది. రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించే లక్ష్యంతో విదేశీ పర్యటన చేపడుతున్నట్లు రేవంత్ రెడ్డి తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. పాస్‌పోర్టులను తాత్కాలిక కస్టడీకి ఇవ్వడంతో పాటు విదేశీ ప్రయాణానికి అనుమతి ఇవ్వాలని కోరారు. దీనిపై విచారణ జరిపిన ఏసీబీ కోర్టు పిటిషన్‌ను పాక్షికంగా అనుమతించింది. విదేశీ పర్యటనకు అనుమతి ఇస్తూనే కోర్టు పలు షరతులు విధించింది. లక్ష వ్యక్తిగత బాండ్‌తో పాటు ఒక ష్యూరిటీ సమర్పించాలని ఆదేశించింది. విదేశీ పర్యటనకు సంబంధించిన పూర్తి ప్రయాణ వివరాలు, అక్కడ బస చేసే చిరునామాలు, సంప్రదింపు ఫోన్ నంబర్లు కోర్టుకు అందజేయాలని పేర్కొంది. అలాగే, సెప్టెంబర్ 18లోగా పాస్‌పోర్టులను తిరిగి కోర్టులో జమ చేస్తానని అఫిడవిట్ దాఖలు చేయాలని రేవంత్ రెడ్డిని ఆదేశించింది. ఆ అఫిడవిట్ సమర్పించిన అనంతరం ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారికి లేఖ రాసి పాస్-పోర్టులను తాత్కాలికంగా అప్పగించాలని కోర్టు ఆదేశాల్లో పేర్కొంది.

# నేడు 'సామాజిక న్యాయ తెలంగాణ' సంకల్ప సభ

## సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో విస్తృత ఏర్పాట్లు

## సామాజిక వైతాళికుల చిత్రపటాలతో సభా ప్రాంగణం సిద్ధం

**హైదరాబాద్, ఆగస్టు 5:** తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో 'సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభ' గురువారం సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో జరగనుంది. సబ్బండ వర్గాల సాధికారత, సామాజిక న్యాయం లక్ష్యంగా నిర్వహిస్తున్న ఈ సభకు భారీ ఏర్పాట్లు పూర్తి చేశారు. సాధించుకున్న భౌగోళిక తెలంగాణను సామాజిక న్యాయ తెలంగాణగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఈ సభ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సమాజంలోని అన్ని వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించే దిశగా కొత్త రాజకీయ ఆలోచనలకు ఈ సభ వేదిక కానుందని పేర్కొన్నారు. సభా ప్రాంగణంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, తెలంగాణ భావజాల నిర్మాత ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్, మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే, భాగ్యరెడ్డి వర్మ చిత్రపటాలను ఏర్పాటు చేశారు. అలాగే చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్, కాన్షీరామ్, కొమురం భీమ్, కొండా లక్ష్మణ్ బాపూజీ, కర్పూరి ఠాకూర్ చిత్రాలను కూడా ప్రదర్శనలో ఉంచుతున్నారు. అదేవిధంగా తొలి తరం తెలంగాణ ఉద్యమకారిణి టి.ఎన్. సదాలక్ష్మి, పండుగ సాయన్న, వడ్డెర ఓబన్న, సంత్ సేవాలాల్ మహరాజ్, సంగం లక్ష్మీబాయి, షోయబుల్లాఖాన్, మారోజు వీరన్న, మఖ్దూం మొహియుద్దీన్ వంటి సామాజిక, ఉద్యమ, స్వాతంత్ర్య పోరాట యోధుల చిత్రపటాలతో సభా ప్రాంగణాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, సబ్బండ వర్గాల అభ్యున్నతి, సాధికారత అంశాలపై ఈ సంకల్ప సభలో కీలక తీర్మానాలు, భవిష్యత్ కార్యాచరణను ప్రకటించే అవకాశం ఉన్నట్లు నిర్వాహక వర్గాలు వెల్లడించాయి.

## సంపాదకీయం



# తెలంగాణ భావజాల వైతాళికుడు

**తెలంగాణ స్వరాష్ట్ర స్వప్నానికి ప్రాణవాయువు అందించి, భావజాలాన్ని ప్రతి గుండెకూ వ్యాపింపజేసిన దిశానిర్దేశకుడు**

## నేడు ఆచార్య జయశంకర్ జయంతి

తెలంగాణ అనగానే ప్రతి ఒక్కరి మనోఫలకంపై మెదిలే రూపం, తెలంగాణ స్వరాష్ట్ర ఆకాంక్షను ప్రతి అక్షరంలోనూ, ప్రతి మాటలోనూ ప్రతిధ్వనింపజేసిన సిద్ధాంతకర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్. "తెలంగాణ రాష్ట్ర సాధనే నా శ్వాస.. నా ధ్యాస.. నా అంతిమ లక్ష్యం" అని జీవితాంతం తపించి, తన జీవితాన్ని, జ్ఞానాన్ని పూర్తిగా మాతృభూమి విముక్తికే అంకితం చేసిన దార్శనికుడు ఆయన. ఆగస్టు 6న ఆచార్య జయశంకర్ జయంతి సందర్భంగా, తెలంగాణ సమాజం ఆయన అమూల్యమైన సేవలను, ఉద్యమ ప్రస్థానాన్ని సగర్వంగా స్మరించుకుంటోంది.

### తొలినాటి చైతన్యం.. చిన్నతనంలోనే ఉద్యమ విత్తనం

ఉమ్మడి వరంగల్ జిల్లా ఆత్మకూరు మండలం అక్కంపేట గ్రామంలో 1934 ఆగస్టు 6న లక్ష్మీకాంతరావు, మహాలక్ష్మమ్మ దంపతులకు జన్మించిన జయశంకర్ గారు, బాల్యం నుంచే అన్యాయాలను సహించని తత్వాన్ని పుణికిపుచ్చుకున్నారు. 1952 నాటి నాన్-ముల్కీ ఉద్యమంలో పాఠశాల విద్యార్థిగానే చురుగ్గా పాల్గొన్నారు. ఆ తర్వాత విశాలాంధ్ర ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకిస్తూ పాఠశాల రోజుల్లోనే నిరసన గళం విప్పారు. తెలంగాణ ప్రాంత భౌగోళిక, సాంస్కృతిక, ఆర్థిక స్వభావంపై ఆయనకు ఉన్న స్పష్టమైన అవగాహన, చిన్ననాటే ఆయనను ఉద్యమబాట వైపు నడిపించింది.

### విద్యారంగంలో అత్యున్నత శిఖరాలు.. ప్రాచార్యుడిగా చారిత్రాత్మక పాత్ర

జయశంకర్ కేవలం ఉద్యమకారుడే కాదు, అరుదైన విద్యావేత్త మరియు ఆర్థికవేత్త. ఆలీగఢ్ ముస్లిం యూనివర్సిటీ నుంచి ఆర్థికశాస్త్రంలో పిహెచ్‌డి పట్టా పొందిన ఆయన, అధ్యాపకుడిగా తన వృత్తి జీవితాన్ని ప్రారంభించి, సీకేఎం కళాశాల ప్రిన్సిపాల్‌గా, కాకతీయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా, చివరికి అదే విశ్వవిద్యాలయానికి వైస్ ఛాన్సలర్‌గా అత్యున్నత బాధ్యతలను నిర్వర్తించారు. కేంద్ర పాఠశాల విద్యారంగం బోర్డు సభ్యుడిగా కూడా ఆయన సేవలందించారు. విద్యావేత్తగా ఎన్నో శిఖరాలను అధిరోహించినప్పటికీ, ఆయన ఆలోచనలన్నీ నిరంతరం తెలంగాణ ప్రయోజనాల చుట్టూనే తిరిగేవి.

### గణాంకాలే ఆయుధాలుగా బహుజన జాగృతి

ఉమ్మడి పాలనలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయాలను ఊహాగానాలతో కాకుండా, పక్కా గణాంకాలతో ససాక్ష్యంగా ప్రపంచం ముందుంచిన ఘనత జయశంకర్ గారికే దక్కుతుంది. నీటి కేటాయింపుల్లో వివక్ష, నిధుల మళ్లింపు, ఉద్యోగ నియామకాలలో ఉల్లంఘనలు వంటి అంశాలపై ఆయన విస్తృతమైన పరిశోధన చేశారు. ఆయన రాసిన "తెలంగాణ రాష్ట్రం - ఒక పరిశీలన" వంటి గ్రంథాలు మరియు వ్యాసాలు ఉద్యమానికి గ్రంథాలుగా మారాయి. పల్లె పల్లెనా పర్యటిస్తూ విద్యార్థులు, యువత, ఉద్యోగులను చైతన్యవంతం చేస్తూ, "మన నీళ్లు, మన నిధులు, మన నియామకాలు మనకే దక్కాలి" అనే మూల సూత్రాన్ని ప్రజాక్షేత్రంలోకి బలంగా తీసుకెళ్లారు.

### మలిదశ ఉద్యమానికి దిక్సూచి, సిద్ధాంతకర్త

1969 తొలిదశ ఉద్యమం నీరసించిన తర్వాత, తెలంగాణ ఆకాంక్ష చల్లారిపోకుండా దశాబ్దాల పాటు నిలబెట్టిన ఘనత ఆయనదే. 1990ల కాలంలో తెలంగాణ ఐక్యవేదిక, తెలంగాణ మహాసభ వంటి అనేక వేదికల నిర్మాణంలో కీలక పాత్ర పోషించారు. రాజకీయ వ్యూహాలు ఎలా ఉన్నప్పటికీ, ఉద్యమానికి కావలసిన స్పష్టతను నిరంతరం అందిస్తూ వచ్చారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో రాజకీయ రంగులకు అతీతంగా, సకల జనులను ఒకే వేదికపైకి తేడానికి ఆయన అందించిన మార్గదర్శకత్వం అపారమైనది. ఉద్యమ నాయకులకు, ప్రజాసంఘాలకు, విద్యార్థి లోకానికి ఆయన ప్రతిక్షణం దిక్సూచిగా నిలిచారు.

### నెరవేరిన ఆశయం.. చిరస్మరణీయ భావజాలం

తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర అవతరణను కళ్లజూడాలని చివరి క్షణం వరకు తపించినప్పటికీ, 2011 జూన్ 21న ఆయన కన్నుమూశారు. ఆయన భౌతికంగా మన మధ్య లేకపోయినప్పటికీ, ఆయన రగిల్చిన చైతన్య జ్వాలలే చివరికి స్వరాష్ట్ర స్వప్నాన్ని సాకారం చేశాయి. ఈనాడు స్వపరిపాలనలో పురోగమిస్తున్న తెలంగాణ రాష్ట్రానికి ఆనాడు ఆచార్య జయశంకర్ గారు వేసిన భావజాల పునాదే మూలాధారం. తెలంగాణ ఉన్నంత కాలం ఆచార్య జయశంకర్ సార్ జ్ఞాపకాలు, ఆయన చూపిన బాట ప్రతి తెలంగాణ బిడ్డకు అనునిత్యం స్ఫూర్తినిస్తూనే ఉంటాయి.

# ఎట్టకేలకు దిగివచ్చిన మెటా

- ప్రధాని మోడీకి జుకర్ బర్గ్ క్షమాపణలు
- కంటెంట్‌ల బూస్ట్‌కు డబ్బులు తీసుకున్నట్లు అంగీకారం






**న్యూఢిల్లీ, ఆగస్ట్ 5:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి సంబంధించిన వీడియో తొలగింపుపై మెటా దిగొచ్చింది. ఈ మేరకు మెటా సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్.. ప్రధాని మోదీకి బహిరంగ క్షమాపణలు చెప్పారు. సీఎస్ఏఎమ్, డీప్‌ఫేక్ కంటెంట్ వ్యాప్తిపై విచారం వ్యక్తం చేసిన మెటా.. కొన్ని రకాల కంటెంట్‌ను బూస్ట్ చేయడానికి భారీగా డబ్బులు తీసుకున్నట్టు అంగీకరించింది. అంతే కాకుండా తమ ప్లాట్‌ఫామ్ నిర్వహణలో జరిగిన పొరపాట్లను కూడా అంగీకరించింది. ప్రధాని మోదీకి సంబంధించిన జులై 23 నాటి వీడియోను తొలగించడానికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని మెటాను పార్లమెంటరీ కమిటీ బుధవారం ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ ఘటనకు సంబంధించి బాధ్యులపై చర్యలు తీసుకోవడం సహా బహిరంగంగా క్షమాపణ చెప్పాలని మూడు రోజుల అల్టిమేటం జారీ చేసింది. ఈ మేరకు దిగొచ్చిన మెటా.. మోదీకి క్షమాపణలు చెప్పింది. ప్రధాని నరేంద్ర మోదీ ఫేస్‌బుక్ పోస్టు తాత్కాలికంగా తొలగించిన వ్యవహారం మెటాకు తీవ్ర ఇబ్బందులు తెచ్చిపెట్టింది. ఈ ఘటనపై వివరణ ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం సమన్లు జారీ చేయడంతో మెటా గ్లోబల్ బృందం బుధవారం కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక శాఖ ఉన్నతాధికారులతో సమావేశమైంది. దాదాపు 45 నిమిషాల పాటు జరిగిన ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించినట్లు తెలుస్తోంది. మెటా గ్లోబల్ వ్యవహారాల అధికారి జోయెల్ కాప్లన్ నేతృత్వంలోని బృందం ఐటీ శాఖ కార్యదర్శి ఎస్. కృష్ణన్‌తో సమావేశమైంది. అలాగే కేంద్ర ఐటీ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కూడా మెటా బృందం కలిసింది. జూలై 23న ప్రధాని నరేంద్ర మోదీ యువతను ఉద్దేశించి పరీక్షల ప్రశ్నాపత్రాల లీకేజీలపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పిన వీడియోను ఫేస్‌బుక్ కొంతసేపు పరిమితం చేసింది. అనంతరం అది సాంకేతిక లోపం వల్ల జరిగిందని మెటా వివరణ ఇచ్చి పోస్టును పునరుద్ధరించింది. అయితే ఈ వివరణను కేంద్ర ప్రభుత్వం సరిపోదని స్పష్టం చేసింది. సమావేశంలో ప్రధాని పోస్టు వ్యవహారంతో పాటు ఇన్‌స్టాగ్రామ్‌లో పిల్లలపై లైంగిక దుర్వినియోగానికి సంబంధించిన కంటెంట్, ప్రకటనలు, కృత్రిమ మేధతో రూపొందించిన తప్పుడు సమాచార నియంత్రణ వంటి అంశాలపై కూడా కేంద్రం ప్రశ్నలు సంధించింది. ప్రముఖ వ్యక్తుల ధృవీకరించిన ఖాతాల్లోని పోస్టులను తొలగించే ముందు మరింత భద్రతా వ్యవస్థ ఉండాలని అధికారులు స్పష్టం చేశారు. మెటా అల్గోరిథమ్ ఎలా పనిచేస్తోంది? పోస్టులు ఏ ప్రాతిపదికన తొలగించబడుతున్నాయి? భారత చట్టాలకు అనుగుణంగా వ్యవస్థ ఎలా పనిచేస్తుంది? వంటి అంశాలపై కూడా ప్రభుత్వం వివరణ కోరింది. దేశ భద్రత, ప్రజా శాంతి వంటి అంశాలకు సంబంధించిన విషయాల్లో సోషల్ మీడియా వేదికలు అత్యంత బాధ్యతతో వ్యవహరించాలని స్పష్టం చేసింది. ఇదిలా ఉండగా, ప్రధాని మోదీ వీడియో తొలగింపును తీవ్రంగా పరిగణించిన పార్లమెంటరీ స్థాయి సంఘం మెటా సీఈవో మార్క్ జుకర్‌బర్గ్ మూడు రోజుల్లో బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసింది. నిర్దేశిత గడువులో స్పందించకపోతే భారతదేశంలో మెటాకు లభిస్తున్న 'సేఫ్ హార్బర్' రక్షణను పునఃపరిశీలించే అవకాశం ఉందని హెచ్చరించింది. సోషల్ మీడియా సంస్థలు భారత చట్టాలను పూర్తిగా పాటించాల్సిందేనని కేంద్ర ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేశాయి. ఇప్పటికే అమల్లో ఉన్న నిబంధనలను కచ్చితంగా అమలు చేయడంతో పాటు, ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా మెటా తగిన చర్యలు తీసుకోవాలని కేంద్రం ఆదేశించినట్లు సమాచారం.

# హర్మూజ్ తెరవకుంటే అంతే సంగతులు

**మరోమారు ఇరాన్‌కు ట్రంప్ ఘాటు హెచ్చరిక**



**వాషింగ్టన్, ఆగస్ట్ 5:** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇరాన్‌కు మరోసారి తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. హర్మూజ్ జలసంధిని సాధ్యమైనంత త్వరగా తెరవాలని, లేదంటే తీవ్రమైన దాడులు ఎదుర్కోవాల్సి ఉంటుందని వార్నింగ్ ఇచ్చారు. ఇరాన్‌తో తమ చర్చలు సానుకూలంగా సాగుతున్నా.. వాటిని ఆ దేశం బహిరంగంగా ఖండించడం ఆశ్చర్యకరంగా ఉందన్నారు. ఈసారి చర్చల నుంచి వెనక్కి తగ్గితే పరిణామాలు అత్యంత తీవ్రంగా ఉంటాయని టెహ్రాన్‌ను హెచ్చరించారు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత అతిపెద్ద దాడికి అమెరికా సిద్ధమవుతున్న సమయంలో ఇరాన్ తమను సంప్రదించి చర్చలకు రావాలని కోరిందని ట్రంప్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఇరాన్ విషయంలో ఎలాంటి చర్యలు తీసుకోవాలనే దానిపై మరో 48 గంటల్లో స్పష్టత వస్తుందని తెలిపారు. టెహ్రాన్ అణ్వాయుధాలు కలిగి ఉండేందుకు అమెరికా ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోదని అధ్యక్షుడు పునరుద్ఘాటించారు. హర్మూజ్ జలసంధిలో నౌకల స్వేచ్ఛాయుత రాకపోకలకు సంబంధించి ఇరాన్, ఒమన్‌తో కలిసి తాము చర్చలు జరుపుతున్నామని అగ్రరాజ్యం వెల్లడించింది. దీనిపై ఒకట్రెండు రోజుల్లో ఒప్పందం కుదిరే అవకాశం ఉందని అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ తెలిపారు. అయితే ఈ ప్రకటనను ఇరాన్ ఖండించింది. ఒమన్‌తో తాము జరుపుతున్న చర్చల్లో అమెరికా భాగస్వామ్యం ఏమాత్రం లేదని తెలిపింది. తమ సార్వభౌమాధికారాన్ని, భద్రతా ప్రయోజనాలను కాపాడే కొత్త సముద్ర రవాణా విధానాన్ని ఏర్పాటు చేయడంపైనే ఈ చర్చలు సాగుతున్నాయని పేర్కొంది. ఈ పరిణామాల నేపథ్యంలో ట్రంప్ తాజా హెచ్చరికలు చేయడం చర్చనీయాంశంగా మారింది. దీంతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు ఏ మలుపు తిరుగుతాయన్న దానిపై ఉత్కంఠ నెలకొంది.

# జార్ఖండ్ నిరుద్యోగులకు సీజేపీ మద్దతు

**అవసరమైతే రాంచీకి వెళ్లి ఆందోళనలో పాల్గొంటాం**

**రాజకీయ పార్టీగా మారే ఆలోచన లేదన్న అభిజిత్ దీప్కే**



**ముంబై, ఆగస్టు 5:** జార్ఖండ్‌లో ఉద్యోగ నియామక పరీక్షల్లో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ ఆందోళన చేస్తున్న నిరుద్యోగ అభ్యర్థులకు కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) మద్దతు ప్రకటించింది. అవసరమైతే రాంచీకి వెళ్లి విద్యార్థుల ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొంటామని సీజేపీ చీఫ్ అభిజిత్ దీప్కే వెల్లడించారు. మహారాష్ట్రలోని ఛత్రపతి సంభాజీనగర్‌లో బుధవారం మీడియాతో మాట్లాడిన ఆయన, జూలై 29 నుంచి రాంచీలో కొనసాగుతున్న నిరవధిక నిరసనకు తమ పూర్తి సంఘీభావం ఉంటుందని తెలిపారు. జార్ఖండ్ నిరుద్యోగుల న్యాయమైన డిమాండ్లకు అండగా నిలుస్తామని, అవసరమైతే ఉద్యమంలో నేరుగా పాల్గొంటామని స్పష్టం చేశారు. సీజేపీ ప్రస్తుతం రాజకీయ పార్టీగా కాకుండా దేశవ్యాప్తంగా ప్రజా సమస్యలపై ఒత్తిడి తీసుకొచ్చే ప్రెజర్ గ్రూప్‌గా పనిచేస్తోందని అభిజిత్ దీప్కే చెప్పారు. న్యాయవ్యవస్థ, రాజకీయ వ్యవస్థ, మీడియా, ఎన్నికల సంఘం వంటి ప్రజాస్వామ్య సంస్థలపై ప్రజల విశ్వాసం తగ్గుతోందని, వాటిలో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించడమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌తో పాటు ఇతర ప్రభుత్వ నియామక పరీక్షల్లో జరిగినట్లు ఆరోపణలు వస్తున్న అక్రమాలపై రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తులతో స్వతంత్ర దర్యాప్తు జరిపించాలని నిరుద్యోగ అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు. ఈ డిమాండ్‌కు సీజేపీ మద్దతు ప్రకటించడంతో ఉద్యమానికి మరింత ఊతం లభించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# 15 ఏళ్ల బాలికతో బలవంతంగా క్షమాపణలు

**నిరసనకారుల ఇళ్లపైకి గూండాలను పంపారు**

**మీడియా సమావేశంలో రాహుల్ ఆరోపణలు**



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 5:** నీట్ పేపర్ లీక్ వివాదంపై ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద యువత నిరసనలు తెలిపారు. అయితే, విద్యార్థుల్ని బలప్రయోగం, బెదిరింపులతో కేంద్రం అణచివేసిందని లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ ఆరోపించారు. నిరసనల్లో పాల్గొన్న విద్యార్థులతో కలిసి ఆయన బుధవారం మీడియాతో మాట్లాడారు. విద్యార్థుల ఇళ్లకు గుండాలను పంపించారని, 15 ఏళ్ల బాలికతో బలవంతంగా క్షమాపణలు చెప్పించారని రాహుల్ గాంధీ ఆరోపించారు. నిరసనకారులు రాజ్యాంగ పరిరక్షకులని, కుప్పకూలుతున్న పనికిరాని విద్యా వ్యవస్థను ప్రశ్నిచడంలో ఎలాంటి తప్పు లేదని అన్నారు. నిరసనల్లో పాల్గొన్న వారి ఇళ్లకు గుండాలను పంపించారని, ఆ తర్వాత 15 ఏళ్ల బాలికతో బలవంతంగా క్షమాపణలు చెప్పించి, ఆ క్షమాపణలు అంగీకరించారని, ఇది పూర్తిగా అర్థరహితం, దీనిని తాము అంగీకరించమని రాహుల్ గాంధీ అన్నారు. విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేశారని, వారిని వేధించారని ఆరోపించారు. దేశంలో పారదర్శకంగా పనిచేసే విద్యా వ్యవస్థ అవసరమని అన్నారు. విద్యార్థులు ఎలాంటి హింసకు పాల్పడలేదని, వారిపై లాఠీచార్జ్ చేయడం, వేధించడం సరికాదని అన్నారు. తమ భవిష్యత్తు కోసం పోరాడుతున్న విద్యార్థులపై గర్వంగా ఉందని పేర్కొన్నారు.

# జమ్మూకశ్మీర్, లద్దాఖ్ అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉంది

**వికసిత్ భారత్ నిర్మాణంలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలి**

**డా. శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా ప్రధాని మోదీ నివాళి**



**న్యూఢిల్లీ, ఆగస్టు 5:** జమ్మూకశ్మీర్, లద్దాఖ్ సమగ్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. వికసిత్ భారత్ నిర్మాణంలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని ఆయన పిలుపునిచ్చారు. డా. శ్యామా ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతి సందర్భంగా ఎక్స్ వేదికగా ఆయనకు నివాళులర్పించిన ప్రధాని మోదీ, ఆర్టికల్ 370, 35(ఏ) రద్దుతో జమ్మూకశ్మీర్, లద్దాఖ్ అభివృద్ధిలో కొత్త అధ్యాయం ప్రారంభమైందని పేర్కొన్నారు. జమ్మూకశ్మీర్, లద్దాఖ్ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల విస్తరణకు కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. విద్య, వైద్యం, క్రీడలు, పారిశ్రామిక రంగాల్లో కొత్త అవకాశాలు సృష్టిస్తున్నామని వెల్లడించారు. మహిళలు, అణగారిన వర్గాలకు రాజ్యాంగబద్ధమైన హక్కులు పూర్తిస్థాయిలో అందేలా చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. డా. శ్యామా ప్రసాద్ ముఖర్జీ దేశ సమైక్యత, జాతీయ సమగ్రత కోసం చేసిన సేవలు చిరస్మరణీయమని ప్రధాని మోదీ కొనియాడారు. ఆయన ఆశయాల స్ఫూర్తితో దేశాభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు.

# తైబజార్ వేలం నిర్ణయం ఉపసంహరించుకోవాలి

- పేదలపై భారం మోపే నిర్ణయాలను విరమించాలి: సీపీఎం ఆందోళన

**ఆలేరు, ఆగస్టు 5::**



ఆలేరు మున్సిపాలిటీ పాలకవర్గం ఇటీవల జరిగిన సాధారణ సమావేశంలో తీసుకున్న తైబజార్ వేలం, జేసీబీ కొనుగోలు వంటి నిర్ణయాలను వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఎం పార్టీ నాయకులు డిమాండ్ చేసారు. ఈ మేరకు బుధవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి, అనంతరం కమిషనర్ శ్రీనివాస్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ నాయకుడు మోరీగాడి రమేష్ మాట్లాడుతూ తైబజార్‌ను వేలం వేసి తోపుడు బండ్ల వ్యాపారులు, ఫుట్‌పాత్ వ్యాపారులు, ద్విచక్ర వాహనాలపై కూరగాయలు తదితర వస్తువులు విక్రయించే చిరు వ్యాపారుల నుంచి రుసుములు వసూలు చేయాలన్న నిర్ణయం పేదలపై అదనపు భారం మోపేదిగా ఉందని విమర్శించారు. మున్సిపాలిటీ ఆదాయాన్ని పెంచుకునేందుకు ఇతర మార్గాలు అనేకం ఉన్నప్పటికీ, వాటిని పక్కనబెట్టి పేదలపై భారం మోపే చర్యలకు పాల్పడడం సరికాదన్నారు. ప్రైవేటు పాఠశాలలు, ఫంక్షన్ హాళ్ల నుంచి మున్సిపల్ చట్టాల ప్రకారం పన్నులు పూర్తిస్థాయిలో వసూలు చేస్తే లక్షల రూపాయల ఆదాయం సమకూరుతుందని తెలిపారు.ఇటీవల వివాదాస్పదంగా మారిన ఓ ప్రైవేటు పాఠశాలకు ఉన్నతాధికారుల జోక్యంతో కొలతలు వేసి పన్నులు విధించడం ద్వారా ఒక్క పాఠశాల నుంచే రూ.2 లక్షల అదనపు ఆదాయం మున్సిపాలిటీకి వచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. మున్సిపాలిటీ ఏర్పడినప్పటి నుంచి వందలాది ఇళ్లను ఆన్‌లైన్ పన్ను వ్యవస్థలో నమోదు చేయడంలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా సుమారు 150 నుంచి 200 ఇళ్లకు ఇప్పటికీ పన్నులు విధించలేని పరిస్థితి నెలకొందని అన్నారు. దాదాపు 20 ఏళ్లుగా పన్నులు చెల్లిస్తున్నప్పటికీ తమ ఇళ్లను మున్సిపల్ రికార్డుల్లో నమోదు చేయాలని కోరినా అధికారులు స్పందించడం లేదని, దీనివల్ల ప్రజలు ఇళ్ల కొనుగోలు, అమ్మకాల సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఇదే నిర్లక్ష్యం మున్సిపాలిటీ ఆదాయానికి కూడా నష్టం కలిగిస్తోందన్నారు. కచ్చా కాలువలు, మురుగు కాలువల పూడిక తొలగింపు కోసం సుమారు రూ.50 లక్షలతో జేసీబీ కొనుగోలు చేయాలన్న ప్రతిపాదనపై కూడా అభ్యంతరం వ్యక్తం చేశారు. ముందుగా పట్టణంలో ఎంత మేరకు కచ్చా కాలువలు, జేసీబీ అవసరమయ్యే మురుగు కాలువలు ఉన్నాయో సమగ్రంగా పరిశీలించిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలని సూచించారు. ఆలేరు ప్రధాన రహదారిపై దుమ్ము, ధూళి కారణంగా ప్రజలు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వర్షాకాలంలో నీరు నిలిచి రహదారి చెరువును తలపిస్తోందన్నారు. దీనికి శాశ్వత పరిష్కారంగా ప్రధాన రహదారికి ఇరువైపులా ఫుట్‌పాత్‌లు నిర్మించి బీటీ రోడ్డు వేయాలని డిమాండ్ చేశారు.మున్సిపాలిటీ వద్ద ఉన్న నిధులను ముందుగా మురుగు కాలువలు, సీసీ రోడ్లు, ఇతర మౌలిక వసతుల అభివృద్ధికి వినియోగించి, ఆ తర్వాతే జేసీబీ వంటి యంత్రాల కొనుగోలుపై ఆలోచించాలని కోరారు. తైబజార్ వేలం నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోకపోతే పట్టణంలోని చిరు వ్యాపారులందరినీ సమీకరించి మున్సిపల్ కార్యాలయాన్ని దిగ్బంధనం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు వడ్డేమాన్ బాలరాజు, ఘనగాని మల్లేష్, మోరీగాడి అశోక్, మోరీగాడి అంజయ్య,

# ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

- ఆలేరులో మెగా వైద్య శిబిరం.. 480 మందికి ఆరోగ్య పరీక్షలు, 80 మందికి శస్త్రచికిత్సల కోసం రిఫరల్

**ఆలేరు, ఆగస్టు 5::**

గ్రామాలు, పట్టణాల్లో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని రాఘవ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు పులిపలుపుల మహేష్ అన్నారు. బుధవారం ఆలేరు పట్టణ కేంద్రంలో రాఘవ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో, మెడిసిటీ హాస్పిటల్స్ వైద్య బృందం సహకారంతో మెగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరానికి పట్టణంతో పాటు పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై వైద్య సేవలను వినియోగించుకున్నారు.ఈ సందర్భంగా వైద్యులు మొత్తం 480 మందికి వివిధ రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి వైద్య సలహాలు, మందులు అందజేశారు. పరీక్షల అనంతరం 80 మందిని తదుపరి చికిత్సలు, వివిధ రకాల శస్త్రచికిత్సల కోసం మెడిసిటీ హాస్పిటల్‌కు రిఫర్ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. శిబిరాన్ని ఉద్దేశించి పులిపలుపుల మహేష్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను నిరంతరం నిర్వహిస్తున్నామని చెప్పారు. వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స పొందడం ద్వారా తీవ్రమైన ఆరోగ్య సమస్యలను నివారించవచ్చని పేర్కొన్నారు. ప్రజలు ఉచిత వైద్య సేవలను నిర్లక్ష్యం చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మెడిసిటీ హాస్పిటల్స్ వైద్య బృందం, స్థానిక మూడో వార్డు కౌన్సిలర్



యాట శివ, నాలుగో వార్డు కౌన్సిలర్ బీజని కళ్యాణి మధు, మంగ నరసింహులు, పంతం కృష్ణ, ఖుర్షీద్ పాషా, రాఘవ

# మూడున్నర దశాబ్దాల దర్గా రోడ్ సమస్యకు శాశ్వత పరిష్కారం...

- రూ.80 లక్షల అభివృద్ధి పనులకు శ్రీకారం...విద్యుత్ ప్రమాద బాధిత కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం అందజేత
- అభివృద్ధిని అడ్డుకునే శక్తులను ప్రజలు తిరస్కరించాలి... ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

**కాజీపేట/హన్మకొండ, ఆగస్టు 5 : :**



పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా 48వ డివిజన్ పరిధిలో మూడు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న కాజీపేట దర్గా రోడ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతూ రూ.50 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి బుధవారం శంకుస్థాపన చేశారు. అనంతరం దర్గా ఉత్సవాల సమయంలో తాగునీటి సమస్య తలెత్తకుండా నియోజకవర్గ అభివృద్ధి నిధుల నుంచి రూ.30 లక్షలతో వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులకు కూడా ఆయన శంకుస్థాపన చేశారు.అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, కాజీపేట దర్గా రోడ్ సమస్య దశాబ్దాలుగా ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని తెలిపారు. బోడగుట్ట, కడిపికొండ, ఇందిరానగర్ తదితర ప్రాంతాలకు వెళ్లే వేలాది మంది ప్రజలు ఈ రహదారిపై ఆధారపడుతున్నారని, గతంలో ఈ సమస్యపై అనేక ధర్నాలు, ఆందోళనలు, పోలీసు బందోబస్తు వరకు పరిస్థితులు వెళ్లిన విషయాన్ని గుర్తు చేశారు.దర్గా పెద్దలు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడం సంతోషకరమని పేర్కొన్నారు. నెల రోజుల వ్యవధిలోనే సీసీ రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.అదేవిధంగా ఆర్‌ఈసీ రోడ్ నుంచి బయటకు వెళ్లే ప్రధాన రహదారి అభివృద్ధి కోసం సుమారు రూ.20 కోట్ల ప్రతిపాదనలు రాష్ట్ర ప్రభుత్వానికి పంపినట్లు వెల్లడించారు. ఈ ప్రతిపాదనలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తోందని, వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్యతో పాటు సంబంధిత మంత్రులతో కూడా ఈ అంశంపై చర్చించామన్నారు.నియోజకవర్గంలో ప్రతి కాలనీ, ప్రతి గల్లీలో రోడ్లు, డ్రైనేజీలు, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ ప్రజా సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అయితే ఈ అభివృద్ధిని చూసి ఓర్వలేని కొందరు ప్రతిపక్ష నాయకులు అసత్య ప్రచారాలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ప్రజల ప్రయోజనాల కోసం చేపడుతున్న అభివృద్ధి పనులపై కూడా నిరాధార ఆరోపణలు చేయడం దురదృష్టకరమన్నారు.దర్గా రోడ్, కాజీపేట బస్టాండ్, రైల్వే ఓవర్ బ్రిడ్జి వంటి దశాబ్దాల సమస్యలకు కాంగ్రెస్ ప్రభుత్వం పరిష్కార మార్గం చూపుతుంటే, కొందరు రాజకీయ ప్రయోజనాల కోసం అభివృద్ధికి ఆటంకాలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ పరిధిలోని పనులను సైతం రాష్ట్ర ప్రభుత్వంపై నెపం మోపే ప్రయత్నం చేయడం ప్రజలను తప్పుదోవ పట్టించడమేనని విమర్శించారు.ఇంటిగ్రేటెడ్ స్కూల్‌తో పాటు పలు అభివృద్ధి ప్రాజెక్టులను కూడా కొందరు కావాలనే అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని, ప్రజల సంక్షేమం కంటే రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తున్న ఇలాంటి అభివృద్ధి నిరోధకులను ప్రజలు గుర్తించి తిరస్కరించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.వరంగల్ నగర అభివృద్ధి పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని, గత రెండున్నర సంవత్సరాల్లో ఎన్నో కీలక సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపినట్లు తెలిపారు. మూడు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరిస్తున్న ప్రభుత్వ పనితీరును ప్రజలు గమనిస్తున్నారని, అభివృద్ధికి అడ్డంకులు సృష్టించే శక్తులను ప్రజలు తిరస్కరించి అభివృద్ధికి సహకరించాలని కోరారు.ప్రజా ప్రభుత్వానికి రోజురోజుకు పెరుగుతున్న ఆదరణను చూసి బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేస్తున్నారని ఎమ్మెల్యే మండిపడ్డారు.అనంతరం ఇటీవల విద్యుత్ ప్రమాదంలో మృతి చెందిన పోతురవేణ శివకుమార్ కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, విద్యుత్ శాఖ ద్వారా మంజూరైన రూ.5 లక్షల ఆర్థిక పరిహార చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు.

# గౌడ సంఘం బలోపేతమే లక్ష్యం.. కేసముద్రం డివిజన్ అధ్యక్షుడిగా సుధాకర్ గౌడ్ నియామకం

**మహబూబాబాద్/కేసముద్రం, ఆగస్టు 5 : :**

మండలంలోని కాట్రపల్లికి చెందిన సామాజిక సేవకుడు వడ్లకొండ సుధాకర్ గౌడ్ ను గౌడ జనహక్కుల పోరాట సమితి 'మోకు దెబ్బ' కేసముద్రం డివిజన్ అధ్యక్షుడిగా నియమించారు. ఈ మేరకు మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు ముంజాల రాజేందర్ గౌడ్ బుధవారం ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమానికి మోకు దెబ్బ రాష్ట్ర కార్యదర్శి గడ్డం సమ్మయ్య గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు వడ్లకొండ సుధాకర్ గౌడ్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి కేసముద్రం డివిజన్ అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించిన జాతీయ అధ్యక్షుడు అమరవేణి నర్సా గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేష్ గౌడ్, రాష్ట్ర కార్యదర్శి గడ్డం సమ్మయ్య గౌడ్, జిల్లా అధ్యక్షుడు ముంజాల రాజేందర్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి బూడిగె భద్రసేన గౌడ్, గౌరవ సలహాదారు గడ్డం విజయ్లుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ కేసముద్రం డివిజన్ పరిధిలో అన్ని కమిటీలను ఏర్పాటు చేసి గౌడ సంఘాన్ని మరింత బలోపేతం చేస్తానని తెలిపారు. గౌడ సామాజిక వర్గ సమస్యల పరిష్కారంతో పాటు యువత విద్య, ఉపాధి, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని, బహుజన ఐక్యతను చాటుతూ సమాజ సేవకు అంకితభావంతో పనిచేస్తానని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ముంజాల రాజేందర్ గౌడ్, విగ్రహ కమిటీ అధ్యక్షుడు జెరిపోతుల వెంకన్న గౌడ్, ఉపాధ్యక్షుడు పెద్ది



వెంకన్న గౌడ్, ఆర్గనైజేషన్ సెక్రటరీ గండి వీరేందర్ గౌడ్, రాష్ట్ర కార్యదర్శి గడ్డం సమ్మయ్య గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి బూడిగె భద్రసేన గౌడ్, అధికార ప్రతినిధి లింగాల వీరభద్రం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# సైదాబాద్ స్టీల్ బ్రిడ్జి త్వరలో ప్రారంభం

## మంత్రి పొన్నం ప్రభాకర్



**హైదరాబాద్, ఆగస్టు 5 :):**

నల్గొండ ఎక్స్ రోడ్డు స్టీల్ బ్రిడ్జి, మూసారాంబాగ్ బ్రిడ్జి పనులను మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రి మొహమ్మద్ అజహారుద్దీన్ పరిశీలించారు. రూ.680 కోట్లతో నల్గొండ ఎక్స్ రోడ్డు నుండి ఒవైసీ హాస్పిటల్ వరకు నిర్మించిన స్టీల్ బ్రిడ్జిని త్వరలో ముఖ్యమంత్రి ప్రారంభిస్తారని పొన్నం తెలిపారు. ఈ బ్రిడ్జిలతో ట్రాఫిక్ రద్దీ తగ్గి ప్రయాణ సమయం ఆదా అవుతుందని, నగరంలో అవసరమైన చోట్ల కొత్త ఫ్లైఓవర్ల నిర్మాణాన్ని కూడా ప్రభుత్వం చేపడుతోందని అజహారుద్దీన్ పేర్కొన్నారు.

# ఏడుగురికి కారుణ్య నియామక పత్రాలు అందించిన కలెక్టర్



**కరీంనగర్, ఆగస్టు 5 :):**

జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా బుధవారం కారుణ్య నియామకం కింద ఏడుగురికి నియామక పత్రాలు అందజేశారు. వివిధ శాఖల్లో ఐదుగురిని జూనియర్ అసిస్టెంట్లుగా, ఇద్దరిని ఆఫీస్ సబార్డినేట్లుగా నియమించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో నియామక పత్రాలు అందించిన కలెక్టర్, ఉద్యోగులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తూ తమ కుటుంబాలకు ఆసరాగా నిలవాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్ఓ స్వామి పాల్గొన్నారు.

# ఈవీఎం గోదాం వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు

## జిల్లా కలెక్టర్ ప్రియాంక.



**నారాయణపేట, ఆగస్టు,05:**

జిల్లా కేంద్రంలోని ఈవీఎంలు భద్రపరిచిన గోదాం భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య నిర్వహించబడుతోందని జిల్లా కలెక్టర్ ప్రియాంక తెలిపారు.బుధవారం నెలవారీ తనిఖీల్లో భాగంగా స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న ఈవీఎం గోదామును రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీనుతో కలిసి జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా గోదాం వద్ద అమలులో ఉన్న భద్రతా చర్యలు, సీసీ కెమెరాల నిఘా వ్యవస్థ, భద్రతా సిబ్బంది విధుల నిర్వహణ తదితర అంశాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ఈవీఎం గోదామును నిర్దిష్ట వ్యవధిలో తనిఖీ చేసి, భద్రతా ఏర్పాట్లపై సమగ్ర నివేదికను ఎన్నికల సంఘానికి క్రమం తప్పకుండా సమర్పిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శంకర్, డీటీ రామకృష్ణ, సీ సెక్షన్ అధికారి జయసుధ తదితర అధికారులు పాల్గొన్నారు.

# ప్రతి చిన్నారికి భద్రత, విద్య, సంరక్షణ కల్పించాలి: కలెక్టర్



**పెద్దపల్లి, ఆగస్టు 5 :):**

జిల్లాలో ప్రతి చిన్నారికి భద్రత, విద్య, సంరక్షణ అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. ICPS సమీక్ష సమావేశంలో ఆయన అనాథ పిల్లలను పూర్తిగా గుర్తించడం, చదువు మానేసిన పిల్లలను తిరిగి పాఠశాలల్లో చేర్పించడం, సీసీఐ హోమ్‌లలో అన్ని సౌకర్యాలు కల్పించడం, ఫోస్టర్ కేర్, స్పాన్సర్‌షిప్, బాలల భద్రత కార్యక్రమాలను సమర్థంగా అమలు చేయాలని సూచించారు. అలాగే ఫీల్డ్ విజిట్లు పెంచి, పెండింగ్ అంశాలను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

చురకలు



## ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

### కలెక్టర్ కోయ శ్రీహర్ష

**సుల్తానాబాద్, ఆగస్టు 5 :):**



ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రతి రోగికి నాణ్యమైన, సకాలంలో వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష వైద్యాధికారులను ఆదేశించారు. బుధవారం సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన ఓపీ, వార్డులు, ప్రసూతి విభాగం, ల్యాబ్, ఫార్మసీని పరిశీలించి సేవలపై సమీక్షించారు.వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని, ఓపీతో పాటు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి గర్భిణిని క్రమం తప్పకుండా ఫాలోఅప్ చేయడంతో పాటు హైరిస్క్ గర్భిణులను ప్రత్యేక పర్యవేక్షణలో ఉంచాలని ఆదేశించారు. ఆసుపత్రిలో పరిశుభ్రత, మందుల లభ్యత, అత్యవసర సేవలు నిరంతరం అందుబాటులో ఉండేలా చూడాలని, రోగుల ఫిర్యాదులను వెంటనే పరిష్కరించి రిఫరల్స్‌ను తగ్గించాలని కలెక్టర్ సూచించారు.

## విద్యార్థులకు నాణ్యమైన యూనిఫాంలు సకాలంలో అందించాలి: కలెక్టర్

**కామారెడ్డి, ఆగస్టు 5 ::**



జిల్లాలోని ప్రభుత్వ, సంక్షేమ, రెసిడెన్షియల్ విద్యాసంస్థల విద్యార్థులకు నాణ్యమైన యూనిఫాంలను సకాలంలో పంపిణీ చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. గాంధారి మండలంలోని యూనిఫాం కటింగ్ సెంటర్‌ను పరిశీలించిన ఆయన, నాణ్యతలో రాజీ లేకుండా సరైన కొలతలతో యూనిఫాంలను కుట్టించి త్వరగా పంపిణీ చేయాలని సూచించారు. జిల్లాలోని 959 విద్యాసంస్థలు, హాస్టళ్లలో 89,279 మంది విద్యార్థులకు యూనిఫాంల పంపిణీ కొనసాగుతోందని అధికారులు తెలిపారు.

## డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపులో పారదర్శకత తప్పనిసరి

**మహబూబ్ నగర్, ఆగస్టు 5 :**

డబుల్ బెడ్‌రూమ్, ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో పూర్తి పారదర్శకత పాటించి అర్హులైన పేదలకే ఇళ్లు ఇవ్వాలని ప్రత్యేక అధికారి వి.పి. గౌతమ్ ఆదేశించారు. పూర్తయిన ఇళ్లను వెంటనే లబ్ధిదారులకు కేటాయించాలని, రెండు పథకాల జాబితాలను AI ద్వారా సరిపోల్చి ఒకే వ్యక్తికి రెండుసార్లు లబ్ధి అందకుండా చూడాలని సూచించారు. గుడిసెల్లో నివసించే కుటుంబాలకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని, ఖాళీగా ఉన్న ఇళ్లను వినియోగంలోకి తీసుకురావాలని అధికారులకు ఆదేశించారు.

## 50 ఏళ్ల నిరీక్షణకు ముగింపు..

### రైతు కుటుంబానికి 4 ఎకరాల భూమి కేటాయింపు

**ఆదిలాబాద్, ఆగస్టు 5 :**



అర్ధ శతాబ్ద కాలంగా భూమి హక్కుల సమస్యతో ఇబ్బందులు పడుతున్న రైతు కుటుంబానికి జిల్లా కలెక్టర్ రాజర్షి షా ప్రత్యేక చొరవతో న్యాయం జరిగింది. మేడిగూడకు చెందిన భావనే పార్వతీబాయికి గతంలో కేటాయించిన పట్టా భూమి క్షేత్రస్థాయిలో స్వాధీనం కాకపోవడంతో సమస్య కొనసాగుతోంది.ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా అధికారులు సమగ్ర సర్వే నిర్వహించి వాస్తవాలను పరిశీలించారు. అనంతరం పాత 35 సర్వే నంబరులోని పట్టాను రద్దు చేసి, ప్రస్తుతం సాగులో ఉన్న 59 సర్వే నంబరులోని 4 ఎకరాల భూమినే అధికారికంగా కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.దీంతో 50 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యకు పరిష్కారం లభించింది. బుధవారం లబ్ధిదారు కుటుంబ సభ్యులు జిల్లా కలెక్టర్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సాత్నాల మండల తహసీల్దార్ రామారావు, లబ్ధిదారు కుమారుడు భావనే దత్తు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి: కలెక్టర్

**సిద్దిపేట, ఆగస్టు 5 ::**



దుబ్బాకలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ కె. హైమావతి, మధ్యాహ్న భోజనం నాణ్యతపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కామన్ డైట్ మెనూ ప్రకారం నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలని, వంటగది పరిశుభ్రంగా ఉంచి సీజనల్ వ్యాధుల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బియ్యం నాణ్యతపై ఫిర్యాదు రావడంతో వెంటనే నాణ్యమైన బియ్యం సరఫరా చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

## సైబర్ భద్రతపై అవగాహన పెంచుకోవాలి

- జిల్లా ఎస్పీ స్నేహా మెహ్రా ఐపీఎస్

**తాండూరు మున్సిపల్,(మం)ఆగస్టు,05:**

సైబర్ భద్రతపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రతి నెల మొదటి బుధవారాన్ని భారత ప్రభుత్వం 'సైబర్ జాగ్రూకత దివస్' గా నిర్వహిస్తుందని జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా అన్నారు.బుధవారం తాండూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన సైబర్ అవగాహన కార్యక్రమంలో పాల్గొని, తాండూర్ చౌరస్తా నుండి సెయింట్ మార్క్ స్కూల్ వరకు నిర్వహించిన భారీ సైబర్ అవగాహన ర్యాలీలో పాల్గొన్న అనంతరం సెయింట్ మార్క్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన సైబర్ అవగాహన సభలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ... ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాల నుండి ఇంటర్నెట్ వినియోగ దారులను రక్షించడంపై దృష్టి సాధించడం జరిగిందన్నారు. సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న కొద్దీ సైబర్ నేరాలు కూడా కొత్త రూపాల్లో పెరుగుతున్నాయని, ప్రతి ఒక్కరూ డిజిటల్ ప్రపంచంలో అప్రమత్తంగా వ్యవహరించడం అత్యంత అవసరమన్నారు. తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, సందేశాలు,







అనుమానాస్పద లింకులు, నకిలీ పెట్టుబడి ఆఫర్లు, పార్ట్‌టైమ్ ఉద్యోగాల పేరుతో వచ్చే మోసాలను నమ్మవద్దని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ OTP, బ్యాంక్ ఖాతా వివరాలు, ATM PIN, CVV, UPI PIN వంటి వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికీ తెలియజేయవద్దని అన్నారు. సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు ప్రచారాలు, ఫేక్ అకౌంట్లు, ఫిషింగ్ లింకులు, స్టాక్ ఇన్వెస్ట్‌మెంట్ మోసాలు వంటి సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ మోసానికి గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్కు కాల్ చేయడం లేదా National Cyber Crime Portalలో ఫిర్యాదు నమోదు చేయాలని తెలిపారు. విద్యార్థులు సైబర్ భద్రతపై అవగాహన పెంపొందించుకొని, తమ కుటుంబ సభ్యులు, స్నేహితులకు కూడా ఈ విషయాలను తెలియజేయాలని, ప్రతి పౌరుడు బాధ్యతాయుతమైన డిజిటల్ పౌరుడిగా వ్యవహరిస్తేనే "సైబర్ స్వతంత్ర తెలంగాణ" లక్ష్యం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తాండూర్ మున్సిపల్ ఛైర్మెన్ నీరజ బాల్ రెడ్డి మాట్లాడుతూ... సైబర్ నేరాలు ప్రతి కుటుంబాన్నీ ప్రభావితం చేసే స్థాయికి చేరుకున్న నేపథ్యంలో ఇలాంటి అవగాహన కార్యక్రమాలు సమాజానికి ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. విద్యార్థులు, యువత, మహిళలు డిజిటల్ లావాదేవీలు చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలని, మోసపూరిత కాల్స్, నకిలీ పెట్టుబడి పథకాలు, అనుమానాస్పద లింకులను నమ్మవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో తాండూర్ డీఎస్పీ యాదయ్య, తాండూర్ ఇన్‌స్పెక్టర్ పరమేశ్వర్, రూరల్ సీఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి , డివిజన్ SI's, పట్టణంలోని వివిధ స్కూల్స్ కి చెందిన స్టూడెంట్స్ ,వైస్ ఛైర్మెన్ అబ్దుల్ రజాక్, మున్సిపల్ కౌన్సిలర్లు, పోలీసు అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పారిశుధ్య కార్మికుల సేవలు ఎనలేనివి..

- ప్రజారోగ్య పరిరక్షణలో వారి పాత్ర కీలకం
- తాత్కాలిక పారిశుధ్య సిబ్బందికి తొలి నెల జీతాల చెక్కులు అందజేసి ఘనంగా సన్మానించిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

**వర్ధన్నపేట/వరంగల్, ఆగస్టు 5 : :**

మున్సిపాలిటీలో పారిశుధ్య సిబ్బంది కొరతను దృష్టిలో ఉంచుకుని, వరంగల్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తాత్కాలిక ప్రాతిపదికన నియమితులైన ఎనిమిది మంది పారిశుధ్య కార్మికులకు తొలి నెల వేతనాల చెక్కులను వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్



నాగరాజు బుధవారం అందజేశారు. అనంతరం వారిని శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందించారు.వర్ధన్నపేట మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, పట్టణ పరిశుభ్రత, ప్రజారోగ్య పరిరక్షణలో మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సేవలు అత్యంత విలువైనవని అన్నారు. ఎండనక, వాననక ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణాన్ని అందించేందుకు వారు నిరంతరం అంకితభావంతో విధులు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు.ప్రజలకు మెరుగైన పారిశుధ్య సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం అవసరమైన సిబ్బందిని నియమిస్తూ మున్సిపల్ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పారిశుధ్య కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బెజ్జం పాపారావు, మలోతు దేవేందర్, తిరుపేల్లి వాణి, మార్కెట్ కమిటీ చైర్మన్ నరకుడు వెంకటయ్య, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఈగ దామోదర్, మండల పార్టీ అధ్యక్షుడు పోశాల వెంకన్న, మాజీ మండల అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అబ్బిడి రాజిరెడ్డి, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు భాను ప్రసాద్, సీనియర్ నాయకులు కీమా నాయక్, బక్కతట్ల

## ఆరోగ్యవంతమైన భావితరానికి తల్లిపాలే తొలి రక్షణ కవచం...

- పెండెం శ్రీలక్ష్మి రామానంద్
- అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవాల్లో తల్లులకు అవగాహన.. బాలింతలకు పండ్ల పంపిణీ
- అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రిలో అవగాహన కార్యక్రమం

**నర్సంపేట/వరంగల్, ఆగస్టు 5 : :**

అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవాల (ఆగస్టు 1–7) సందర్భంగా నర్సంపేట పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నర్సంపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ మధురిమ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆసుపత్రిలోని బాలింతలను కలిసి తల్లిపాల ప్రాధాన్యత, శిశు ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ చైర్‌పర్సన్ పెండెం శ్రీలక్ష్మి రామానంద్ మాట్లాడుతూ, బిడ్డ పుట్టిన తొలి ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, ఈ కాలంలో నీరు కూడా ఇవ్వాల్సిన అవసరం లేదని తెలిపారు.ప్రసవం అనంతరం వచ్చే ముర్రుపాలు (కొలస్ట్రం) శిశువుకు తొలి వ్యాధి నిరోధక టీకాలా పనిచేస్తాయని, వాటిని తప్పనిసరిగా బిడ్డకు పట్టించాలని సూచించారు. తల్లిపాలు ఇవ్వడం వల్ల తల్లి–బిడ్డల మధ్య అనుబంధం మరింత బలపడటంతో పాటు శిశువు శారీరక, మానసిక ఎదుగుదలకు ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు.ఆగస్టు 1 నుంచి 7 వరకు నిర్వహిస్తున్న తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలు, ఆరోగ్య కేంద్రాల ద్వారా మహిళలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని కోరారు. ఐసీడీఎస్ శాఖ చేపడుతున్న కార్యక్రమాలను ప్రతి తల్లి సద్వినియోగం చేసుకొని ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.అనంతరం సీడీపీఓ మధురిమ మాట్లాడుతూ, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో వారం రోజుల పాటు తల్లిపాల ప్రాముఖ్యతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గర్భిణులు, బాలింతలకు ఆరోగ్య సంరక్షణ, పోషకాహారం, శిశు సంరక్షణపై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు.బిడ్డ పుట్టిన గంటలోపే ముర్రుపాలను తప్పనిసరిగా పట్టించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ శిశువులకు సీసా పాలు ఇవ్వకూడదని



సూచించారు. తల్లిపాలు శిశువుకు మొదటి రోగనిరోధక శక్తిని అందించడమే కాకుండా, మేధో వికాసం, శారీరక ఎదుగుదలకు ఎంతో దోహదపడతాయని తెలిపారు.అలాగే తల్లిపాలు ఇవ్వడం వల్ల తల్లుల్లో రొమ్ము క్యాన్సర్, అండాశయ క్యాన్సర్ వంటి వ్యాధుల ప్రమాదం తగ్గుతుందని వివరించారు. ఈ సందర్భంగా బాలింతలకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేసి ఆరోగ్య సూచనలు అందించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు శ్రీరామోజు రోజారాణి, బాణాల ప్రసన్న శ్రీనివాస్, పొన్నాల మనీషా ప్రకాష్, ఏసీడీపీఓ జ్యోతి, అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు నల్లా భారతి, ఆర్ఎంఓ వైద్యులు, నర్సింగ్ సూపరింటెండెంట్ ఆనంద అర్పణ, సూపర్‌వైజర్లు అరుణ, రమ, ప్రాజెక్టు అధ్యక్షురాలు, ప్రధాన కార్యదర్శులు గొర్రె రాధ, బతిని శిరీష, అంగన్‌వాడీ టీచర్లు,

## గ్రామీణ పేదలకు ఉచిత వైద్య సేవలు అభినందనీయం

- లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మెగా హెల్త్ క్యాంపును ప్రారంభించిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు
- ప్రజలు ఉచిత ఆరోగ్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**వర్ధన్నపేట/వరంగల్, ఆగస్టు 5 : :**

గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించడం గొప్ప సామాజిక సేవ అని వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అన్నారు. బుధవారం వర్ధన్నపేట మండలం కట్ర్యాల గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సహృదయ సేవా ట్రస్ట్ మరియు లయన్స్ క్లబ్ ఆఫ్ వరంగల్ ట్రైసిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా ఉచిత ఆరోగ్య శిబిరాన్ని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మహ్మద్ మహబూబ్ అలీ (చోటు) ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పట్టణాలకు వెళ్లి ఖరీదైన వైద్యం



చేయించుకోలేని పేద ప్రజలకు ఇటువంటి ఉచిత ఆరోగ్య శిబిరాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను ఉచితంగా అందించడం లయన్స్ క్లబ్ చేస్తున్న అభినందనీయమైన సేవా కార్యక్రమమని కొనియాడారు.ఇలాంటి ఆరోగ్య శిబిరాలు ప్రజల్లో ఆరోగ్య చైతన్యాన్ని పెంపొందించడంతో పాటు వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి సకాలంలో చికిత్స అందించేందుకు దోహదపడతాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.ప్రజారోగ్య పరిరక్షణకు విశేష సేవలందిస్తున్న లయన్స్ క్లబ్ ఆఫ్ వరంగల్ ట్రైసిటీ ప్రతినిధులను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు.అనంతరం గ్రామ ప్రజలతో కలిసి ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు కంటి, రక్త పరీక్షలు చేయించుకున్నారు. ఆరోగ్య పరీక్షలు చేయించుకున్న వారికి మందులను పంపిణీ చేయడంతో పాటు రక్తదానం చేసిన యువకులకు ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పోశాల వెంకన్న, మార్కెట్ కమిటీ చైర్మన్ నరకుడు వెంకటయ్య, మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి, ఐనవోలు దేవస్థానం చైర్మన్ ప్రభాకర్ గౌడ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఈగ దామోదర్, మాజీ మండల అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ, మండల బ్లాక్ మాజీ అధ్యక్షుడు అబ్బిడి రాజిరెడ్డి, మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అరుణ, మండల మహిళా బ్లాక్ అధ్యక్షురాలు సునీత, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు భాను ప్రసాద్, గ్రామ ఉపసర్పంచ్ రవీందర్, గ్రామశాఖ మాజీ అధ్యక్షుడు సతీష్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు దామెర ప్రశాంత్, నియోజకవర్గ, మండల, గ్రామస్థాయి ముఖ్య నాయకులు, సర్పంచులు, కార్యకర్తలు, వైద్య బృందం సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

చురకలు



# కొడంగల్ వ్యవసాయాభివృద్ధికి నిపుణుల బృందం క్షేత్ర పర్యటన

- **KFSPC పనితీరుపై ప్రశంసలు, విలువ ఆధారిత వ్యవసాయానికి ప్రోత్సాహం**





**కొడంగల్ మున్సిపల్,(మం) ఆగస్టు,05:**

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు, కొడంగల్ శాసనసభ నియోజకవర్గానికి సమగ్ర వ్యవసాయ మరియు ఉద్యానవన అభివృద్ధి ప్రణాళిక రూపొందించేందుకు దేశంలోని ప్రముఖ పరిశోధనా సంస్థలు,రాష్ట్ర ప్రభుత్వ శాఖలు, భారత ప్రభుత్వ సంస్థలు మరియు అభివృద్ధి సంస్థలకు చెందిన శాస్త్రవేత్తలు, నిపుణులతో కూడిన బహుళ–విభాగ నిపుణుల కమిటీ 2026 ఆగస్టు 5 మరియు 6 తేదీలలో కొడంగల్ నియోజకవర్గంలో విస్తృత స్థాయి క్షేత్ర పర్యటన చేపట్టింది.ఈ సందర్భంగా నిపుణుల బృందం కొడంగల్ ఫార్మర్స్ సర్వీసెస్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ (KFSPC) ప్యాలమద్ది గ్రామంలోని కార్యాలయం మరియు వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించింది. సంస్థ స్థాపన నుంచి ఇప్పటివరకు సాధించిన ప్రగతి, రైతులకు అందిస్తున్న సేవలు,మహిళా నాయకత్వంలో సంస్థ సాధించిన విజయాలను పాలకవర్గ సభ్యులు వివరించారు. అలాగే సంస్థ అభివృద్ధికి ఆర్థిక సహకారం అందించిన SFAC మరియు సాంకేతిక మార్గదర్శకత్వం అందించిన Access Livelihoods సంస్థల పాత్రను కూడా నిపుణుల బృందానికి వివరించారు.సంస్థను మహిళా రైతులు సమర్థవంతంగా ముందుకు నడిపిస్తూ ఆదర్శవంతమైన అభివృద్ధిని సాధించడం అభినందనీయమని నిపుణుల బృందం ప్రశంసించింది.భవిష్యత్తులో సంస్థ మరింత అభివృద్ధి చెందేందుకు అవసరమైన సహకారాన్ని సంబంధిత ప్రభుత్వ శాఖలు, భాగస్వామ్య సంస్థలు అందించేందుకు కట్టుబడి ఉంటాయని సభ్యులు హామీ ఇచ్చారు.ముఖ్యంగా సేంద్రియ పద్ధతిలో ఉత్పత్తి చేస్తున్న వ్యవసాయ ఉత్పత్తులను కేవలం ముడి రూపంలో విక్రయించకుండా, విలువ ఆధారిత ఉత్పత్తులుగా (Value Addition) మార్చి మార్కెట్లో ప్రవేశపెట్టడం ద్వారా రైతులకు అధిక ఆదాయం లభించే అవకాశాలు ఉన్నాయని సూచించారు. ఇందుకు అవసరమైన సాంకేతిక సహాయం, మార్కెటింగ్ అనుసంధానం, ఫుడ్ ప్రాసెసింగ్ మరియు ఇతర రంగాల్లో పూర్తి సహకారం అందించేందుకు కృషి చేస్తామని నిపుణుల బృందం తెలిపింది.ఈ బృందం పంటల ఉత్పత్తి వ్యవస్థలు, ఉద్యానవనం, సహజ వనరుల నిర్వహణ, సాగునీటి వనరులు, మార్కెట్ అనుసంధానం, విలువ ఆధారిత ఉత్పత్తులు, ఆహార ప్రాసెసింగ్, రైతు సంస్థలు, జీవనోపాధి అవకాశాలు మరియు ఇతర అనుబంధ రంగాలపై సమగ్ర క్షేత్రస్థాయి అధ్యయనం నిర్వహించింది.క్షేత్ర పరిశీలనలు, రైతులు మరియు సంబంధిత భాగస్వాములతో జరిగిన చర్చల ఆధారంగా కొడంగల్ శాసనసభ నియోజకవర్గ వ్యవసాయ మరియు ఉద్యానవన రంగాల సమగ్రాభివృద్ధికి అవసరమైన స్వల్పకాలిక, మధ్యకాలిక మరియు దీర్ఘకాలిక కార్యాచరణ ప్రణాళికలతో కూడిన సమగ్ర నివేదికను తెలంగాణ ప్రభుత్వానికి సమర్పించనుంది.

**పర్యటనలో పాల్గొన్న ప్రముఖులు:**

–డా. హరి కిషన్ సుదిని – ప్రిన్సిపల్ సైంటిస్ట్, ICRISAT
– కె. వెంకట్ రెడ్డి – స్పెషల్ ఆఫీసర్, KADA
– డా. చి. సుధాకర్ – అసోసియేట్ డీన్, వ్యవసాయమ్, కొడంగల్ (PJTAU)
– డా. భగవాన్ – రిజిస్ట్రార్, SKLTHU
– మేరీ రేఖ – డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ (ప్లానింగ్)
– బాబు – జాయింట్ డైరెక్టర్ (MIDH), ఉద్యానవన శాఖ
– ఆర్. సుకేష్ – APEDA
– డి. సుష్మ – తెలంగాణ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ
– రాజిత – చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్, SERP
– రవి తేజ – NABCONS
– నాగమ్మ – ఛైర్‌పర్సన్, KFSPC
– అమూర్తమ్మ – బోర్డు డైరెక్టర్, KFSPC
– భీమమ్మ – బోర్డు డైరెక్టర్, KFSPC
– మొహమ్మద్ వసీమ్ – జనరల్ మేనేజర్, KFSPC
– KFSPC సిబ్బంది పాల్గొన్నారు

# సైబర్ నేరాల నివారణకు ప్రజల్లో అవగాహనే ప్రధాన ఆయుధం

- **సైబర్ నేరాలపై అప్రమత్తతతోనే ప్రజల ఆస్తులు, ప్రాణాలను కాపాడుకోవచ్చు**
- **జిల్లా కలెక్టర్ సీహెచ్. ప్రియాంక**
- **జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్**

**నారాయణపేట, ఆగస్టు,05:**

సైబర్ నేరాలు జరిగిన తర్వాత చర్యలు తీసుకోవడం కంటే, అవి జరగకుండా ముందుగానే ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడమే అత్యంత ప్రభావవంతమైన మార్గమని జిల్లా కలెక్టర్ సీహెచ్. ప్రియాంక, జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS పేర్కొన్నారు."సురక్ష కా తిరంగా – సైబర్ జాగృత్ దివస్" సందర్భంగా జిల్లా పోలీసు శాఖ డిస్ట్రిక్ట్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ (D4C) ఆధ్వర్యంలో నారాయణపేట జిల్లా కేంద్రంలోని అభినందన్ గార్డెన్స్‌లో నిర్వహించిన భారీ సైబర్ అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్, ఎస్పీ లు పాల్గొని ప్రసంగించారు.అంతకుముందు వివిధ రకాలుగా సైబర్ నేరాల బారిన పడిన బాధితులు స్వయంగా మాట్లాడి సైబర్ నేరాల వలలో ఎలా చిక్కుకున్నారో స్వయంగా వారి మాటల్లో వివరించి ఓటీపీలు ఎవరికి చెప్పొద్దని, అనవసర లింక్స్ ఓపెన్ చేయరాదని, తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చు అనే ఆశకు గురికా వద్దని అలాంటి చిన్న చిన్న తప్పులు చేయొద్దని ఎవరికైనా డబ్బులు పంపించే ముందు ఒకసారి ఆలోచించి పంపాలని స్వయంగా తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.... జిల్లాలోని ప్రతి గ్రామంలో సైబర్ భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించడం ప్రజాప్రతినిధుల సామాజిక బాధ్యత అని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి గ్రామపంచాయతీ సమావేశంలో సైబర్ నేరాలపై ప్రత్యేక అజెండా చేర్చి ప్రజలకు అవగాహన కల్పించాలని సర్పంచులకు సూచించారు. అలాగే మహిళా సంఘాలు, వీఓలు, స్వయం సహాయక సంఘాల సమావేశాల్లో కూడా సైబర్ భద్రత అంశాన్ని తప్పనిసరిగా చర్చించాలని కోరారు.విద్యార్థులు ఈ కార్యక్రమంలో నేర్చుకున్న విషయాలను తమ కుటుంబ సభ్యులకు, ముఖ్యంగా తల్లిదండ్రులకు తెలియజేసి సైబర్ భద్రతపై అవగాహన పెంచాలని పిలుపునిచ్చారు.విధి నిర్వహణలో తాను చూసిన అనేక సైబర్ మోసాల ఘటనలను ప్రస్తావిస్తూ, "డిజిటల్ అరెస్ట్" పేరుతో ఓ రిటైర్డ్ ఉపాధ్యాయుడి నుంచి రూ.75 లక్షలు కాజేసిన ఘటనను ఉదాహరణగా వివరించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ పోలీసుల సమన్వయంతో ప్రత్యేక బృందాలు చర్యలు చేపట్టినా, నిందితులు డబ్బును దేశవ్యాప్తంగా వందలాది బ్యాంకు ఖాతాలకు బదిలీ చేయడంతో మొత్తం సొమ్మును తిరిగి రాబట్టడం క్లిష్టంగా మారిందన్నారు. సైబర్ నేరాల వెనుక అత్యంత పటిష్ఠమైన నెట్‌వర్క్‌లు పనిచేస్తున్నందున ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు.సైబర్ మోసానికి గురైన వారు భయం, సిగ్గు లేదా అపోహలతో ఫిర్యాదు చేయకుండా ఉండరాదని, వెంటనే కుటుంబ సభ్యులకు తెలియజేసి పోలీసులను సంప్రదించాలని కలెక్టర్ సూచించారు. సమయానికి ఫిర్యాదు చేస్తే డబ్బు తిరిగి వచ్చే అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు.సోషల్ మీడియా, మొబైల్ యాప్‌లు, నకిలీ ప్రకటనలు, ఫ్రీ గిఫ్ట్‌లు, లక్కీ డ్రాలు, తక్షణ నగదు ఆఫర్ల పేరుతో వచ్చే సందేశాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, "ఎవరూ ఉచితంగా డబ్బు ఇవ్వరు" అనే విషయాన్ని గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. ఈ అవగాహనను ప్రతి కుటుంబం, ప్రతి గ్రామానికి తీసుకెళ్లాలని ప్రజలకు పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ... సైబర్ నేరాలు కేవలం ఆర్థిక నష్టానికే పరిమితం కావని, కొన్నిసార్లు బాధితుల జీవితాలను తీవ్రంగా దెబ్బతీసే పరిస్థితులు ఏర్పడుతున్నాయని తెలిపారు.సైబర్ నేరగాళ్లు ప్రజలను భయం, ఆశ అనే రెండు ప్రధాన ఆయుధాలతో మోసం చేస్తున్నారని పేర్కొన్నారు. ఉద్యోగాల పేరుతో నకిలీ లింకులు పంపడం, వ్యక్తిగత ఫోటోలను మార్ఫింగ్ చేసి బ్లాక్‌మెయిల్ చేయడం, డిజిటల్ కరెన్సీ (బిట్‌కాయిన్) ద్వారా డబ్బులు డిమాండ్ చేయడం వంటి పద్ధతులతో అమాయకులను లక్ష్యంగా చేసుకుంటున్నారని వివరించారు.తాను కొత్తగూడెంలో విధులు నిర్వహించిన సమయంలో ఉద్యోగం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన ఓ గిరిజన యువతి సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కుకుని, ఆమె ఫోటోలను మార్ఫింగ్ చేసి కుటుంబ సభ్యులకు పంపిస్తామని బెదిరించి డబ్బులు డిమాండ్ చేసిన ఘటనను గుర్తుచేశారు. సకాలంలో పోలీసుల జోక్యంతో ఆమెను రక్షించగలిగామని, అయితే ఇటువంటి ఘటనలు యువత మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మాదాపూర్‌లో విధులు నిర్వహించిన సమయంలో ఓ ప్రముఖ సినీ నటుడి పేరుతో జరిగిన సైబర్ మోసంలో ఓటీపీ పొందడం ద్వారా కోట్ల రూపాయలు కాజేసిన ఘటనను ప్రస్తావిస్తూ, ఎంత చదువుకున్న వారైనా ఒక్క క్షణం నిర్లక్ష్యం చేస్తే సైబర్ నేరాలకు బలయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు.నారాయణపేట జిల్లాలో రైతు బీమా, ప్రైవేట్ బీమా సొమ్ము అందుకున్న ఓ కుటుంబం బ్యాంకు ఖాతా నుంచి లక్షల రూపాయలు సైబర్ నేరగాళ్లు కాజేసిన ఘటనను గుర్తుచేస్తూ, కుటుంబ భవిష్యత్తుకు ఆధారమైన సొమ్మును కోల్పోవడం ఎంతటి విషాదమో ప్రజలు అర్థం చేసుకోవాలని సూచించారు.దేశవ్యాప్తంగా సాధారణ నేరాల కంటే సైబర్ నేరాల ద్వారా జరుగుతున్న ఆర్థిక నష్టం అనేక రెట్లు ఎక్కువగా ఉందని పేర్కొంటూ, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ పిలుపునిచ్చారు.




యువతలో పెరుగుతున్న ఆన్‌లైన్ గేమింగ్ వ్యసనాన్ని మోసగాళ్లు దుర్వినియోగం చేస్తున్నారని, గతంలో ప్రాణాంతకంగా మారిన "బ్లూ వేల్" వంటి గేమ్‌లను ఉదాహరణగా ప్రస్తావిస్తూ తల్లిదండ్రులు పిల్లల మొబైల్ వినియోగాన్ని పర్యవేక్షించాలని సూచించారు."ఈ రోజుల్లో దొంగలు ఇంటి తలుపులు పగులగొట్టి రావడం కాదు... మన మొబైల్ ఫోన్ ద్వారానే మన జీవితాల్లోకి ప్రవేశిస్తున్నారు. ప్రతి సందేశం, ప్రతి లింక్, ప్రతి కాల్ పట్ల అప్రమత్తంగా ఉండాలి" అని ఎస్పీ పేర్కొన్నారు.సైబర్ మోసానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 హెల్ప్‌లైన్కు కాల్ చేయాలని లేదా సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు. బాధితుల వివరాలను గోప్యంగా ఉంచుతూ అవసరమైన సహాయాన్ని అందించేందుకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉందన్నారు.గ్రామస్థాయిలో పోలీసు సేవలను మరింత చేరువ చేసేందుకు మన ఊరు – మన పోలీస్ కార్యక్రమంలో భాగంగా గ్రామపంచాయతీల్లో పోలీసు సమాచార గోడలు, ఫిర్యాదు పెట్టెలు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. కేసుల పురోగతి, అత్యవసర హెల్ప్‌లైన్ నంబర్లు, సైబర్ భద్రతకు సంబంధించిన సమాచారాన్ని గ్రామస్థాయిలోనే ప్రజలకు అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు.సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు గ్రామ పరిపాలనలో భాగంగా సైబర్ భద్రతపై నిరంతర అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అనంతరం సురక్ష కా తీరంగ్, సైబర్ అవగాహన వాల్ పోస్టర్లను ఆవిష్కరించి తదుపరి సైబర్ నేరాల పైన ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండి సైబర్ నేరాల బారిన పడకుండా ఉంటామని ప్రతిజ్ఞ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో డీఎస్పీలు మహేష్, నల్లపు లింగయ్య, డీఎంహెచ్‌వో జయచంద్రమోహన్, సీఐలు శివశంకర్, రామ్‌లాల్, భగవంత్‌రెడ్డి, సైదులు, ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, జిల్లా పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ప్రభుత్వ అధికారులు,ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, విద్యార్థులు, మహిళా సంఘాల ప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు. సుమారు 05 వేల మంది ఈ అవగాహన సదస్సుకు హాజరయ్యారు.

# ప్రతి కుటుంబ ఆర్థికాభివృద్ధే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యం...

- **ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి**
- **కట్టమల్లన్న ఆలయ అభివృద్ధికి శ్రీకారం...15, 16, 17వ డివిజన్లలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన**

**పరకాల, ఆగస్టు 5 : :**

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 15, 16, 17 డివిజన్లలో పలు అభివృద్ధి పనులకు పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి శంకుస్థాపన చేశారు. మాజీ మేయర్ గుండు సుధారాణితో కలిసి శ్రీ కట్టమల్లన్న దేవాలయ అభివృద్ధి పనులు, 17వ డివిజన్ పరిధిలోని దూపకుంట గ్రామంలో మహిళా కమ్యూనిటీ భవనం, గాడిపెల్లి గ్రామంలో సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు.అంతకుముందు శ్రీ కట్టమల్లన్న దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి, ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.ఈ సందర్భంగా



ఎమ్మెల్యే మాట్లాడుతూ, శ్రీ కట్టమల్లన్న ఆలయానికి ప్రత్యేక గుర్తింపు తీసుకురావడంతో పాటు ఆలయ ప్రాంగణ అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, భక్తులకు అవసరమైన సౌకర్యాల ఏర్పాటుకు సమగ్ర కార్యాచరణ చేపడుతున్నట్లు వెల్లడించారు. ఆలయ అభివృద్ధితో భక్తులకు మరింత మెరుగైన వసతులు అందుబాటులోకి వస్తాయని అన్నారు.ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని, అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందిస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి శిలాఫలకాలకు మాత్రమే పరిమితమైందని, రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారని విమర్శించారు.కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల వాస్తవాలను ప్రజలు గుర్తించి అర్థం చేసుకోవాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. పార్టీలకు అతీతంగా ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్), కళ్యాణలక్ష్మి వంటి పథకాల ద్వారా అర్హులకు ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు. అలాగే అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రాధాన్యత క్రమంలో దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నామని చెప్పారు.డివిజన్ల పరిధిలోని ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు రుణమాఫీ, సన్న వడ్లకు బోనస్, సన్న బియ్యం పంపిణీ, హాస్టల్ విద్యార్థులకు డైట్ ఛార్జీల పెంపు, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వంటి పలు సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేస్తోందని వివరించారు.

## రీజినల్ ట్రైనింగ్ మేనేజర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానం

**హైదరాబాద్, ఆగస్టు 5 :**

హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలకు సంబంధించిన లక్డీకాపూల్‌లోని రీజినల్ సెంటర్ ఫర్ ట్రైనింగ్స్‌లో కన్సల్టెన్సీ ప్రాతిపదికన రీజినల్ ట్రైనింగ్ మేనేజర్ పోస్టు భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు హైదరాబాద్ జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా తెలిపారు.ఈ పోస్టుకు రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ (ఆర్‌డీఓ), ప్రాజెక్ట్ డైరెక్టర్ (పీడీ), జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి (డీఆర్‌డీఓ), డిప్యూటీ డైరెక్టర్ (డీడీ) హోదాలకు తగ్గకుండా పనిచేసి ఇటీవల పదవీ విరమణ పొందిన అధికారులకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కంప్యూటర్ పరిజ్ఞానం, బోధన, శిక్షణపై ఆసక్తి ఉండటంతో పాటు సంబంధిత జిల్లాలో శాశ్వత నివాసితులై ఉండాలని తెలిపారు.ఆసక్తి గల అభ్యర్థులు తమ పూర్తి బయోడేటాతో కూడిన దరఖాస్తులను జిల్లా కలెక్టర్ మరియు శిక్షణ కమిషనర్, హైదరాబాద్ జిల్లా పేరున పోస్టు ద్వారా పంపించవచ్చని లేదా లక్డీకాపూల్‌లోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నేరుగా సమర్పించవచ్చని వెల్లడించారు. దరఖాస్తుల స్వీకరణకు ఆగస్టు 14, 2026 సాయంత్రం 5 గంటల వరకు గడువు ఉంటుందని కలెక్టర్ తెలిపారు.

## అంగన్ వాడీ కేంద్రంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు.




**వలిగొండ ఆగస్టు 05 :**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం గోపరాజుపల్లి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో బుధ వారం రోజు ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను అంగన్వాడీ టీచర్ ఎన్ మణెమ్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. బిడ్డ పుట్టిన వెంటనే ఇచ్చే ముర్రుపాలు అమృతంతో సమానమని అన్నారు. ఇవి శిశువుకు రోగనిరోధక శక్తిని అందిస్తాయని తెలిపారు. మొదటి ఆరు నెలల వరకు పసిబిడ్డకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, కనీసం రెండేళ్ల వరకు తల్లిపాలు పట్టించడం వల్ల పిల్లలు శారీరకంగా,మానసికంగా ఆరోగ్యంగా ఎదుగుతారని వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సలిగంజి పృథ్వి ఉప సర్పంచ్ పోలబోయిన లింగస్వామి ఉపాధ్యాయులు రేవతి ,పంచాయతీ కార్యదర్శి నవనీత అంగన్‌వాడీ టీచర్ గుంటోజు మంజుల ఆశ కార్యకర్త నీలం నీరజ , ఆయా దేవేంద్రమ్మ తల్లులు,గర్భిణులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక సహాయం అందజేసిన మత్సగిరిగుట్ట మాజీ చైర్మన్. ముద్దసాని.



**వలిగొండ ఆగస్టు 05 :**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం మొగిలిపాక గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు శ్యామల నరేష్ తల్లి శ్యామల బుచ్చమ్మ అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకొని వారి పార్థివ దేహానికి పూలమాల వేసి వారి కుటుంబానీ పరామర్శించి 10,000 రూపాయలు ఆర్థిక సహాయం చేసిన శ్రీ మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన మాజీ చైర్మన్ ముద్దసాని కిరణ్ రెడ్డి. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు బిక్షపతి, గ్రామ సర్పంచ్ జడిగే బుచ్చయ్య యాదవ్,ఉప సర్పంచ్ షేక్ సైదులు,వార్డు సభ్యులు పబ్బు వెంకటేష్,మచ్చ సునీత స్వామి,మాజీ సర్పంచ్ జక్కుల శంకరయ్య మాజీ ఉప సర్పంచ్ భీమనబోయిన నరసింహ,మాజీ ఉప సర్పంచ్ విష్ణు చారి,పాల సంఘం డైరెక్టర్ సింగం మహేష్,మాజీ పాలసంగం చైర్మన్లు జక్క ఇంద్ర రెడ్డి,పబ్బు సత్తయ్య ,మద్ది పాండు రంగ రెడ్డి,మాజీ వార్డు సభ్యులు జడిగే సత్యరాములు,ముద్దసాని శేఖర్ రెడ్డి,మరియు బిఆర్ఎస్ పార్టీ నాయకులు జక్క శ్రీనివాస్ రెడ్డి,మచ్చ నవీన్,సింగం శంకరయ్య,జడిగే గోపాల్,ఉక్కుర్తి బిక్షపతి,మొగిలిపాక దుర్గయ్య,పబ్బు మల్లయ్య, పబ్బు నరసింహ, పబ్బు బాలకృష్ణ,చలిచీమల కృష్ణ,బీమనబోయిన మచ్చేందర్,గుండెపురి ఉపేందర్,జడిగే స్వామి,రాపోతుల శ్రీకాంత్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందాలి: మంత్రి వివేకానంద

**మంచిర్యాల, ఆగస్టు 5 :**



ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి అందేలా అధికారులు క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర మంత్రి గడ్డం వివేకానంద ఆదేశించారు. చెన్నూర్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అమృత్ 2.0, ఇందిరమ్మ ఇళ్లు, తాగునీరు, రోడ్లు, మురుగు కాలువలు, సోలార్ లైటింగ్ వంటి అభివృద్ధి పనులను గడువులోగా నాణ్యతతో పూర్తి చేయాలని సూచించారు. వచ్చే ఏడాది గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు.

# ఈవీఎం గోడౌన్‌ను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



**ఖమ్మం, ఆగస్టు 5 :**

సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని ఈవీఎం గోడౌన్‌ను జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ బుధవారం అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డితో కలిసి తనిఖీ చేశారు. నెలవారీ తనిఖీల్లో భాగంగా గోడౌన్ సీల్, సీసీ కెమెరాల పనితీరును పరిశీలించి తనిఖీ రిజిస్టర్‌లో సంతకం చేశారు. భద్రతా సిబ్బంది షిఫ్టుల వారీగా సమయపాలన పాటించాలని, ఎల్లప్పుడూ అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పరాస్ కుమార్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రాజు, డీటీ అన్సారీ, ఆర్‌అండ్‌బీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు: కలెక్టర్ అంకిత్




**కొత్తగూడెం, ఆగస్టు 5 :**

జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి బాధితులకు సత్వర న్యాయం అందించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. 2014 నుంచి 2026 జూలై వరకు 1,104 కేసులు నమోదుకాగా, ప్రస్తుతం 49 కేసులు దర్యాప్తు దశలో ఉన్నాయని తెలిపారు. పెండింగ్ కేసులను వేగంగా పూర్తి చేసి, బాధితులకు పరిహారం, పునరావాసం సకాలంలో అందించాలని సూచించారు. ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ, అట్రాసిటీ, పోక్సో కేసుల దర్యాప్తుకు ప్రత్యేక చర్యలు చేపట్టామని, సైబర్ మోసాలపై ప్రజలు 1930 హెల్ప్‌లైన్‌ను సంప్రదించాలని కోరారు.

# దుప్పల్లి అంగన్వాడి కేంద్రలలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు.




**వలిగొండ ఆగస్టు 05 :**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం దుప్పల్లి గ్రామ పంచాయతీ ఆవరణలో, దుప్పల్లి లో ఉన్న ముగ్గురు అంగన్వాడీ కేంద్రాలు టీచర్స్ మరియు దుప్పల్లి ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో తల్లి పాల వారోత్సవాలు అవగాహనా కార్యక్రమం ఘనంగా ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం లో గ్రామ సర్పంచ్ జావీద్ పాషా, వేములకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ సూపరవైజర్ రేణుకదేవి లు పాల్గొని, వాళ్ళు మాట్లాడుతు శిశువు పుట్టిన గంటలోపు తల్లి ముర్రు పాలు త్రాగించడం వలన పిల్లలకు వ్యాధినిరోధక శక్తి పెరుగుతున్నదని చెప్పారు, తల్లిపాలలో పిల్లలకు అవసరం అయినా అన్ని పోషకాలు అంది, ఆరోగ్యవంతమైన ఎదుగుదల కు దోహద పడతాయాని అన్నారు. ఈ కార్యక్రమం లో గ్రామ కార్యదర్శి మాంహాద్, ఆరోగ్య కార్యకర్తలు జె సత్తయ్య,ఎన్ అనిత, అంగన్వాడీ టీచర్లు ప్రేమలత, యాదమ్మ, సుగుణ, ఆశ కార్యకర్తలు కవిత, సుజాత, యాదమ్మ, గర్భిణీ స్త్రీలు, బాలింతలు, తల్లులు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# ములుగులో కేంద్ర బృందం గ్రామీణ పారిశుద్ధ్య సేవల అధ్యయనం



**ములుగు, ఆగస్టు 5 ::**

గ్రామీణ పారిశుద్ధ్య సేవల బలోపేతం, భవిష్యత్ నిధుల అవసరాల అంచనా కోసం కేంద్ర ప్రభుత్వ ఐఈజీ, యూనిసెఫ్ బృందం ఆగస్టు 5, 6 తేదీల్లో ములుగు జిల్లాలోని చల్వాయి, మేడారం గ్రామాల్లో క్షేత్రస్థాయిలో అధ్యయనం నిర్వహించనుంది. స్వచ్ఛ భారత్ మిషన్ (గ్రామీణ) కింద జరుగుతున్న ఈ అధ్యయనానికి సంబంధిత శాఖలు పూర్తి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అధికారులను ఆదేశించారు.

# ఆగస్టు 15లోపు బూత్, విలేజ్, మండల కమిటీల నియామకం పూర్తి చేయాలి...

- **సామాజిక న్యాయం, మహిళలకు 30 శాతం ప్రాతినిధ్యంతో కమిటీల ఏర్పాటు – డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి**

**హన్మకొండ, ఆగస్టు 5 : :**

టీపీసీసీ ఆదేశాల మేరకు బూత్, విలేజ్, మండల స్థాయి కమిటీల నియామక ప్రక్రియను వేగవంతం చేసేందుకు హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం హనుమకొండలోని డీసీసీ కార్యాలయంలో మండల అధ్యక్షులు, ఇంచార్జ్ కమిటీ సభ్యులతో కీలక సమీక్షా సమావేశం నిర్వహించారు.జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి టీపీసీసీ జనరల్ సెక్రటరీ, వరంగల్ పార్లమెంట్ ఇంచార్జి పల్లె శ్రీనివాస్ గౌడ్, టీపీసీసీ అధికార ప్రతినిధి, వర్ధన్నపేట నియోజకవర్గ ఇంచార్జి కూచన రవళి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. హుస్నాబాద్, స్టేషన్ ఘనపూర్, వర్ధన్నపేట, పరకాల, హుజూరాబాద్, భూపాలపల్లి నియోజకవరాల పరిధిలోని మండల అధ్యక్షులు, డీసీసీ ఇంచార్జ్ కమిటీ సభ్యులు సమావేశంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీకి అసలైన బలం గ్రామ, బూత్ స్థాయిలో పనిచేసే కార్యకర్తలేనని పేర్కొన్నారు. పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్లడంలో బూత్, విలేజ్, మండల కమిటీల పాత్ర అత్యంత కీలకమని అన్నారు.అధిష్టానం నిర్దేశించిన గడువు స్వల్పంగా ఉన్నందున ప్రతి ఒక్కరూ పూర్తి బాధ్యతతో పనిచేసి ఆగస్టు 15లోపు కమిటీల నియామక ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ప్రతి మండల కమిటీలో సభ్యుల సంఖ్య 21 మందికి మించరాదని, డీసీసీ అధ్యక్షుడి కోటా కింద కనీసం ఐదుగురు సభ్యులను నామినేట్ చేసే అవకాశం, అలాగే ఒక ఉపాధ్యక్షుడిని నియమించే వెసులుబాటు ఉన్నందున మండల అధ్యక్షులు ఈ విషయంలో తనతో సమన్వయం చేసుకోవాలని కోరారు.కమిటీల ఏర్పాటులో సామాజిక న్యాయానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రతి కమిటీలో కనీసం 30 శాతం మహిళలకు తప్పనిసరిగా ప్రాతినిధ్యం కల్పించాలని ఏఐసీసీ కార్యదర్శి మీనాక్షి నటరాజన్ స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారని తెలిపారు. మహిళలకు ప్రాతినిధ్యం లేని కమిటీలను అధిష్టానం ఎట్టి పరిస్థితుల్లోనూ ఆమోదించదని పేర్కొన్నారు. అదేవిధంగా ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీ వర్గాలకు సముచిత భాగస్వామ్యం కల్పిస్తూ అన్ని వర్గాల సమన్వయంతో సమతుల్య కమిటీలను రూపొందించాలని సూచించారు.కమిటీల నియామకం పూర్తయిన వెంటనే ఆగస్టు 15 నుంచి 31వ తేదీ మధ్య ఆయా మండలాల్లో తొలి అధికారిక మండల కమిటీ సమావేశాలను విజయవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. నియామక ప్రక్రియలో మండల అధ్యక్షులు, ఇంచార్జ్ కమిటీ సభ్యులు సంబంధిత నియోజకవర్గ ఎమ్మెల్యేల సూచనలు తీసుకుంటూ పరస్పర సమన్వయంతో ముందుకు సాగాలని, ఎలాంటి విభేదాలకు తావులేకుండా అర్హత, కృషి, పార్టీ పట్ల నిబద్ధత కలిగిన నాయకులకు కమిటీల్లో అవకాశం కల్పించాలని కోరారు.ఏఐసీసీ నిర్దేశించిన మార్గదర్శకాలు, ప్రమాణాలకు అనుగుణంగా రూపొందిన కమిటీలకే డీసీసీ ఆమోదం ఉంటుందని, నిబంధనలకు విరుద్ధంగా రూపొందిన కమిటీలను ఆమోదించే ప్రసక్తే లేదని డీసీసీ



# భూ సేకరణలో భూములు కోల్పోయిన రైతులకు ఇండ్ల పట్టాల పంపిణీ చేసిన

## జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ

**కొడంగల్ మున్సిపల్, ఆగస్టు,05:**

కొడంగల్ నియోజకవర్గం టి.జి.ఐ.సి. ఇండస్ట్రియల్ కారిడార్ భూ సేకరణలో భూములు కోల్పోయిన రైతులకు ఇండ్ల పట్టాల పంపిణీ ...టి.జి.ఐ.సి. ఇండస్ట్రియల్ కారిడార్ భూ సేకరణలో భాగంగా భూములు కోల్పోయిన లగచెర్ల, హకీంపేట్, పోలెపల్లి గ్రామాలకు చెందిన అర్హులైన రైతులకు ప్రభుత్వం మంజూరు చేసిన ఇండ్ల స్థలాల పట్టాలను కొడంగల్ పట్టణ కేంద్రంలోని రెడ్డి బసి రెడ్డి ఫంక్షన్ హాలు నందు జిల్లా కలెక్టర్ దీపక్ తివారి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పారిశ్రామిక అభివృద్ధితో పాటు భూములు కోల్పోయిన రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి పారదర్శకంగా ఇండ్ల స్థలాల పట్టాలు అందజేయడం జరిగిందని తెలిపారు.ఇండ్ల స్థలాల పట్టాలు పొందిన రైతులు ప్రభుత్వం కల్పిస్తున్న సంక్షేమ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.భూ సేకరణకు సంబంధించి ప్రభుత్వం ప్రకటించిన పునరావాస, పునర్నిర్మాణ చర్యలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు.టి.జి.ఐ.సి. ఇండస్ట్రియల్ కారిడార్ భూ సేకరణలో భాగంగా భూములు కోల్పోయిన కొడంగల్ నియోజకవర్గంలోని లగచెర్ల, హకీంపేట్, పోలెపల్లి గ్రామాలకు చెందిన అర్హులైన రైతులకు ప్రభుత్వం మంజూరు చేసిన ఇండ్ల స్థలాల పట్టాల పంపిణీ




కార్యక్రమం నిర్వహించడం జరిగిందని జిల్లా కలెక్టర్ అన్నారు.

**ఈ సందర్భంగా ఇండ్ల స్థలాల కేటాయింపునకు డ్రా నిర్వహించారు.గ్రామాల వారీగా వివరాలు ఇలా ఉన్నాయి:**

- హకీంపేట్ (అసైన్డ్ భూములు): 175 మంది లబ్ధిదారులకు 17 సార్లు డ్రా నిర్వహించారు.
- హకీంపేట్ (పట్టా భూములు): 113 మంది లబ్ధిదారులకు 16 సార్లు డ్రా నిర్వహించారు.
- లగచెర్ల (అసైన్డ్ భూములు): 54 మంది లబ్ధిదారులకు 7 సార్లు డ్రా నిర్వహించారు.
- లగచెర్ల (పట్టా భూములు): 173 మంది లబ్ధిదారులకు 31 సార్లు డ్రా నిర్వహించారు.
- పోలెపల్లి (అసైన్డ్ భూములు): 38 మంది లబ్ధిదారులకు 6 సార్లు డ్రా నిర్వహించారు.

మొత్తంగా 432 మంది లబ్ధిదారులకు డ్రా ఆఫ్ లాట్స్ ద్వారా, 121 మంది లబ్ధిదారులకు నేరుగా (డైరెక్ట్ అలాట్‌మెంట్) ద్వారా ఇండ్ల స్థలాలు కేటాయించబడ్డాయన్నారు.మొత్తం 553 మంది లబ్ధిదారులకు ఇండ్ల స్థలాలు మంజూరు చేయగా, ఇందుకోసం మొత్తం 77 సార్లు డ్రా నిర్వహించారు, భూములు కోల్పోయిన రైతుల పునరావాసానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, అర్హులైన ప్రతి లబ్ధిదారునికి పారదర్శక విధానంలో ఇండ్ల స్థలాలు కేటాయిస్తున్నట్లు తెలిపారు.ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. లగ చెర్ల, హకీంపేట్, పోలె పల్లి, రోటి బండ తండా రైతుల సహకారం తో 553 పట్టాల పంపిణీ కార్యక్రమం పారదర్శ కంగా నిర్వహించడం జరిగిందన్నారు.అందరి సహకారం తో 230 ఎకరాలలో ఇంటిగ్రెటెడ్ స్కూల్ ఎడుకేషన్ హబ్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. త్వరలోనే ఇండస్ట్రీయల్ పార్క్ వస్తుందని, 501 లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించిన పట్టాలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. హైదరాబాద్ నుండి కొడంగల్ వరకు రేడియల్ రోడ్డు ఏర్పాటు కు మీ అందరి సహకారమందించాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పి స్నేహ మెహ్రా, ప్రజా ప్రతి నిధి తిరుపతి రెడ్డి,అదనపు కలెక్టర్ వెంకటాచారి, అదనపు ఎస్పీ రాజేష్ మీనా, తాండూర్ ఆర్ డి ఓ అనిత,మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంపయ్య గౌడ్,హకీంపేట్, లగ చెర్ల, పోలె పల్లి సర్పంచ్ లు, రవీంద్ర, చంద్రయ్య, వెంకట్రాములు గౌడ్,కృష్ణం రాజు,సంబంధిత శాఖల అధికారులు,ప్రజాప్రతినిధులు, రైతులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# విద్యార్థిని, విద్యార్థులకు అవగాహన కల్పించిన పరిగి "షీ" టీమ్ పోలీసులు

- **జిల్లా ఎస్పీ స్నేహా మెహ్రా (IPS) మరియు పరిగి డీఎస్పీ శ్రీనివాస్ ఆదేశానుసారం**

**పరిగి మండలం,ఆగస్టు,05:**

వికారాబాద్ జిల్లా పరిగి పోలీస్ స్టేషన్ పరిధి లోని తుంకుల్ గడ్డ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరిగి సబ్ డివిజన్ "షీ" టీమ్ ఇంచార్జ్ నర్సిములు మహిళలపై జరుగుతున్న నెరలపై విద్యార్థిని,విద్యార్థులకు అవగాహన కార్యక్రమము నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం.మహిళ పై జరుగుతున్న నేరాలు.నిర్భయ చట్టం, POCSO Act గురించి.100డయాల్, "షీ" టీమ్ నం –181. సీసీ కెమెరాలు.బాల్య వివాహాలు.బాల కార్మిక వ్యవస్థ.కమ్యూనిటీ పోలిసింగ్.మానవ అక్రమ రవాణా.మద్యపాన నిషేధం.బ్యాంకింగ్ ఆన్లైన్ మోసాలు.గంజాయి నిర్మూలన, డ్రగ్స్ నిషేధం.Cyber crimes No:1930 పై అవగాహన.వివిధ అంశాలపై విద్యార్థిని లకు అవగాహన కల్పించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్,ఏఎస్సై గోపాల్,కాళాబృం ఇంచార్జి




అశోక్,మరియు టీమ్, అధ్యాపక బృందం,కాలేజి విద్యార్థులు,విద్యార్థినిలు,మరియు "షీ" టీమ్ సభ్యులు బి.సావిత్రి,శోభ పాల్గొన్నారు.

# పక్కా ఓటర్ల జాబితా సిద్ధం చేయడమే లక్ష్యం

## కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**సూర్యాపేట, ఆగస్టు 5 (సమయం న్యూస్)):**

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేసి, ఎలాంటి తప్పుల్లేని పక్కా ఓటర్ల జాబితా సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు.బీఎల్ఓలు సమర్పించిన ఎన్యూమరేషన్ ఫారాలపై క్షేత్రస్థాయిలో రీ–వెరిఫికేషన్ నిర్వహించాలని, ఆబ్సెంట్, షిఫ్టెడ్, డెడ్



కేటగిరీల వివరాలను ఖచ్చితంగా నిర్ధారించాలని సూచించారు. డూప్లికేట్ ఓట్లు, తప్పుడు వివరాలను వెంటనే గుర్తించి సరిచేయాలని ఆదేశించారు.సవరణ ప్రక్రియకు గడువు పొడిగించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, ఏ ఒక్క అర్హుడి ఓటు కూడా మిస్ కాకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కావాలని డూప్లికేట్ ఫారాలు సమర్పించినా లేదా తప్పుడు సమాచారం ఇచ్చినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఆర్డీఓ వేణుమాధవ్ రావు, తహసీల్దార్ సాయి గౌడ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆలేరు ఎస్‌హెచ్ఓగా జి ఉదయ్ కిరణ్ బాధ్యతల స్వీకరణ

**ఆలేరు, ఆగస్టు 5::**

ఆలేరు పోలీస్ స్టేషన్ నూతన స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌ఓ)గా జి ఉదయ్ కిరణ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు ఆలేరు ఎస్‌హెచ్‌ఓగా విధులు నిర్వహించిన డి. యాలాద్రి బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో జి. ఉదయ్ కిరణ్‌ను నియమించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం పోలీస్ స్టేషన్‌లో అధికారులు, సిబ్బంది నూతన ఎస్‌హెచ్‌ఓకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఉదయ్ కిరణ్ మాట్లాడుతూ ప్రజలకు స్నేహపూర్వక పోలీసింగ్ అందించడమే తన ప్రధాన లక్ష్యమని చెప్పారు. శాంతిభద్రతల పరిరక్షణకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తూ చట్టవ్యతిరేక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేస్తానని, పోలీస్–ప్రజల మధ్య మరింత సత్సంబంధాలు పెంపొందేలా చర్యలు చేపడతానని ఆయన తెలిపారు. ప్రజల సహకారంతో ఆలేరు పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతిభద్రతలను మరింత పటిష్ఠంగా అమలు చేస్తామని పేర్కొన్నారు.



# తల్లిపాలే శిశువుకు తొలి హక్కు తొలి సహజ టీకా

- ఐసీడీఎస్ ఆలేరు ప్రాజెక్టు కార్యాలయంలో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు




**ఆలేరు, ఆగస్టు 5::**

తల్లిపాలే ప్రతి శిశువుకు తొలి హక్కు, సంపూర్ణ పోషకాహారం, తొలి సహజ టీకా అని ఐసీడీఎస్ ఆలేరు ప్రాజెక్టు సీడీపీఓ స్వరాజ్యం రేఖల పేర్కొన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా బుధవారం ఆలేరు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో గర్భిణులు, బాలింతలు, వారి భర్తల కోసం ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టిన ప్రతి శిశువుకు ప్రసవం జరిగిన తొలి గంటలోపే తల్లిపాలను ప్రారంభించడం అత్యంత కీలకమని చెప్పారు. పుట్టిన వెంటనే వచ్చే ముర్రుపాలు (కొలస్ట్రం) శిశువుకు తొలి సహజ టీకా వంటివని, ఇవి శిశువులో రోగనిరోధక శక్తిని పెంచి అనేక అంటువ్యాధుల నుంచి రక్షిస్తాయని వివరించారు. మొదటి ఆరు నెలల వరకు పూర్తిగా తల్లిపాలే ఇవ్వాలని, ఈ కాలంలో నీరు, జంతుపాలు లేదా ఇతర ఆహార పదార్థాలు ఇవ్వకూడదని సూచించారు. అనంతరం వయస్సుకు తగిన అనుబంధ పోషకాహారాన్ని ప్రారంభిస్తూ రెండు సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ కాలం వరకు తల్లిపాలను కొనసాగించడం శిశువు ఆరోగ్యకరమైన ఎదుగుదలకు ఎంతో అవసరమన్నారు. తల్లిపాలు శిశువుకు అవసరమైన అన్ని పోషకాలను అందించడమే కాకుండా మెదడు అభివృద్ధి, శారీరక ఎదుగుదల, రోగనిరోధక శక్తి పెంపునకు దోహదపడతాయని తెలిపారు. అలాగే తల్లులకు కూడా రొమ్ము క్యాన్సర్, అండాశయ క్యాన్సర్ వంటి వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించడంలో తల్లిపాలు కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు. తల్లి–శిశు మధ్య ఆప్యాయత, భావోద్వేగ బంధాన్ని బలోపేతం చేయడంలో కూడా తల్లిపాల ప్రాధాన్యం ఎంతో ఉందన్నారు. ప్రతి కుటుంబం తల్లిపాలను ప్రోత్సహించే వాతావరణాన్ని కల్పించాలని, గర్భిణులు, బాలింతలకు కుటుంబ సభ్యులు అన్ని విధాలా సహకరించాలని పిలుపునిచ్చారు. తల్లిపాలే ప్రతి బిడ్డకు తొలి హక్కు, ప్రతి తల్లికి మద్దతు ఇవ్వడం కుటుంబం, సమాజం బాధ్యత. ఆరోగ్యవంతమైన, పోషకాహార లోపం లేని తెలంగాణ నిర్మాణానికి అందరూ కలిసి కృషి చేయాలి" అని ఆమె పేర్కొన్నారు.ఈ సందర్భంగా అధికారులు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తూ పలు సూచనలు చేశారు. శిశువు పుట్టిన గంటలోపు తల్లిపాలు ప్రారంభించడం, తొలి ఆరు నెలలు పూర్తిగా తల్లిపాలే ఇవ్వడం, అనంతరం అనుబంధ పోషకాహారంతో పాటు తల్లిపాలను కొనసాగించడం వంటి అంశాలను వివరించారు. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ( ఎన్ ఎఫ్ హెచ్ ఎస్) గణాంకాల ప్రకారం, పుట్టిన గంటలోపు తల్లిపాలు ప్రారంభించే శాతం గత సర్వేతో పోలిస్తే పెరిగినప్పటికీ, తొలి ఆరు నెలలు పూర్తిగా తల్లిపాలు ఇచ్చే విషయంలో ఇంకా మరింత అవగాహన, కుటుంబ సహకారం అవసరమని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజర్లు దివ్య, ఉమారాణి, అండాలు, నజమున్నిసా, జ్యోతి, మనోహర, పోషణ అభియాన్ బ్లాక్ కోఆర్డినేటర్ ప్రతికంఠం రత్నం రాజు, గర్భిణులు, బాలింతలు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# మహిళా హక్కుల సాధనకు ఉద్యమాలే మార్గం

- ఎన్ఎఫ్ఐడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు సృజన
- ఆలేరులో ఘనంగా భారత జాతీయ మహిళా సమాఖ్య యాదాద్రి భువనగిరి జిల్లా 4వ మహాసభలు: నూతన జిల్లా కమిటీ ఎన్నిక

**ఆలేరు, ఆగస్టు 5::**

మహిళలపై జరుగుతున్న దాడులు, వేధింపులు, వివక్షను అరికట్టేందుకు ఉద్యమాలే మార్గమని రాష్ట్ర మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సృజన అన్నారు. భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) యాదాద్రి భువనగిరి జిల్లా 4వ మహాసభలు బుధవారం ఆలేరు పట్టణంలోని గౌడ సంఘం భవనంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. మహాసభల సందర్భంగా ఆలేరు బస్టాండ్ నుంచి గౌడ సంఘం భవనం వరకు మహిళలు, సీపీఐ నాయకులు, కార్యకర్తలతో భారీ ప్రదర్శన నిర్వహించారు. మాటూరు జానమ్మ, సుమన సబిత, గుర్రం రాజమణిల అధ్యక్షతన జరిగిన ఈ మహాసభకు భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు సృజన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. మహిళల హక్కుల పరిరక్షణ కోసం భారత జాతీయ మహిళా సమాఖ్య నిరంతరం పోరాటాలు చేస్తోందని పేర్కొన్నారు.మహిళలకు 33 శాతం రిజర్వేషన్‌ను తక్షణమే అమలు చేయాలని, మహిళల రక్షణకు సమగ్ర చట్టాలను పార్లమెంట్‌లో ఆమోదించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (సార్) ప్రక్రియలో అర్హులైన మహిళల పేర్లు తొలగించకుండా చూడాలని కోరారు. ప్రతి మహిళకు నాణ్యమైన విద్య, మెరుగైన వైద్య సేవలు అందేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి బొలగాని సత్యనారాయణ, రాష్ట్ర కమిటీ సభ్యులు గోద శ్రీరాములు, చెడి చంద్రయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు చెక్క వెంకటేష్, మండల కార్యదర్శి




చౌడబోయిన కనకయ్య, టౌన్ కార్యదర్శి గొట్టిపాముల శ్రీనివాసరాజు, మండల కార్యవర్గ సభ్యులు కందుల మధు తదితరులు పాల్గొన్నారు.అనంతరం భారత జాతీయ మహిళా సమాఖ్య యాదాద్రి భువనగిరి జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షురాలిగా గుర్రం రాజమణి, అధ్యక్షురాలిగా సుమన సబిత, ప్రధాన కార్యదర్శిగా బండి జంగమ్మ, ఉపాధ్యక్షులుగా మంచాల రాజమ్మ, మాటూరు జానమ్మ, సహాయ కార్యదర్శిగా కునుకుంట్ల నరసమ్మ ఎన్నికయ్యారు. నూతన కమిటీ

# పెద్ది సుదర్శన్ రెడ్డి సంస్మరణ సభకు ముమ్మర ఏర్పాట్లు...

- పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి
- ఈ నెల 9న పెద్ది కుటుంబ సభ్యులను పరామర్శించనున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్..

**నల్లబెల్లి/వరంగల్, ఆగస్టు 5 : :**

దివంగత బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి దశదిన కర్మ సందర్భంగా ఈ నెల 9, 10 తేదీల్లో నిర్వహించనున్న సంస్మరణ సభ ఏర్పాట్లను ఎమ్మెల్సీ, శాసనమండలి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి బుధవారం నల్లబెల్లి మండలంలో క్షుణ్ణంగా పరిశీలించారు.బీఆర్ఎస్ పార్టీ నిర్ణయం మేరకు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో భాగంగా, ఈ నెల 9వ తేదీన బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్) పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబ



సభ్యులను పరామర్శించి, అనంతరం నిర్వహించే సంస్మరణ సభలో పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో నల్లబెల్లి మండలంలోని పెద్ది సుదర్శన్ రెడ్డి నివాసం వద్ద కొనసాగుతున్న ఏర్పాట్లను పార్టీ నాయకులతో కలిసి సమీక్షించారు.ఈ సందర్భంగా సభా వేదిక, వాహనాల పార్కింగ్, ప్రజల రాకపోకలు, తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లపై అధికారులతో, పార్టీ నాయకులతో చర్చించి పలు సూచనలు చేశారు. కార్యక్రమానికి హాజరయ్యే నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని సంబంధిత బాధ్యులకు సూచించారు.అనంతరం దివంగత నేత పెద్ది సుదర్శన్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించిన పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, ఆయన పార్టీ అభివృద్ధికి, నర్సంపేట నియోజకవర్గ ప్రజలకు అందించిన సేవలను స్మరించుకున్నారు. ప్రజలతో మమేకమై పనిచేసిన నాయకుడిగా పెద్ది సుదర్శన్ రెడ్డి ఎప్పటికీ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని పేర్కొన్నారు. తదనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ క్లిష్ట సమయంలో పార్టీ అండగా ఉంటుందని వారికి భరోసా ఇచ్చారు.ఈ నెల 9, 10 తేదీల్లో నిర్వహించనున్న సంస్మరణ సభను విజయవంతం చేయాలని, పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై దివంగత నేతకు ఘన నివాళులు అర్పించాలని పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఉమ్మడి వరంగల్

# వరంగల్‌లో రైల్వే ప్రమాదాల నివారణకు శాశ్వత పరిష్కారం చూపాలి...

- ఎంపీ కడియం కావ్య
- పెండింగ్ ప్రాజెక్టులను వేగవంతం చేసి నిర్దిష్ట గడువులో పూర్తి చేయాలి... కేంద్ర రైల్వే శాఖకు ఎంపీ విజ్ఞప్తి

**వరంగల్, ఆగస్టు 5, : :**

జిల్లాలో రైల్వే లెవల్ క్రాసింగ్‌ల వద్ద తరచూ ఎదురవుతున్న ట్రాఫిక్ సమస్యలు, ప్రమాదాల నివారణకు చేపట్టిన రైల్వే ఓవర్ బ్రిడ్జిలు (ROBలు), రైల్వే అండర్ బ్రిడ్జిలు (RUBలు), లెవల్ క్రాసింగ్‌ల నిర్మూలన పనుల పురోగతిపై వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య లోక్‌సభలో కీలక ప్రశ్న లేవనెత్తారు.గత ఐదేళ్లలో వరంగల్ జిల్లాలో ఆమోదం పొందిన ROBలు, RUBలు, లెవల్ క్రాసింగ్‌ల తొలగింపు పనుల వివరాలు, వాటి అంచనా వ్యయం, నిధుల కేటాయింపు విధానం, ఇప్పటివరకు జరిగిన పనుల పురోగతి, ఖర్చు చేసిన నిధులు, పనులు పూర్తయ్యే గడువు వంటి అంశాలపై కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.ఈ ప్రశ్నకు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 2026 జూన్ 1 నాటికి వరంగల్ జిల్లాలో 3 రైల్వే ఓవర్ బ్రిడ్జిలు (ROBలు), 7 రైల్వే అండర్ బ్రిడ్జిలు (RUBలు), 8 లెవల్ క్రాసింగ్‌లు ఉన్నాయని, ప్రస్తుతం జిల్లాలో 4 ROB/RUB ప్రాజెక్టులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయని కేంద్రం వెల్లడించింది.వరంగల్–చింతలపల్లి మధ్య లెవల్ క్రాసింగ్ నెం.64 వద్ద రూ.77 కోట్ల వ్యయంతో నిర్మించనున్న రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులకు టెండర్ ఖరారైనట్లు కేంద్రం తెలిపింది. అలాగే కాజీపేట–వరంగల్ మధ్య లెవల్ క్రాసింగ్ నెం.60, ఎల్గూర్–నెక్కొండ మధ్య లెవల్ క్రాసింగ్ నెం.66, 67 వద్ద మరో మూడు ROBలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వమే తన స్వంత నిధులతో చేపట్టినట్లు వెల్లడించింది.అదేవిధంగా రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ.4,883 కోట్ల అంచనా వ్యయంతో 118 ROB/RUB ప్రాజెక్టులు వివిధ దశల్లో అమలులో ఉన్నట్లు కేంద్ర రైల్వే శాఖ తన సమాధానంలో పేర్కొంది.ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ, వరంగల్ జిల్లాలో రైల్వే లెవల్ క్రాసింగ్‌ల వద్ద ట్రాఫిక్ సమస్యలు, ప్రమాదాల ముప్పు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో పెండింగ్‌లో ఉన్న ROB, RUB ప్రాజెక్టులను వేగవంతంగా పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు.ముఖ్యంగా టెండర్ ప్రక్రియ పూర్తయిన పనులు, జనరల్ అరేంజ్‌మెంట్ డ్రాయింగ్ (GAD) దశలో ఉన్న ప్రాజెక్టులు అనవసర జాప్యం లేకుండా నిర్దిష్ట గడువులో పూర్తయ్యేలా కేంద్ర రైల్వే శాఖ చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మూడు ROBల నిర్మాణానికి కూడా రైల్వే శాఖ



సంపూర్ణ సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.వరంగల్ జిల్లా ప్రజలకు సురక్షితమైన, వేగవంతమైన, అంతరాయం లేని రవాణా సౌకర్యాలు కల్పించేందుకు పార్లమెంట్ వేదికగా తన ప్రయత్నాలను నిరంతరం కొనసాగిస్తానని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య స్పష్టం చేశారు.

## ఫామ్ పాండ్స్ నిర్మించుకుని వర్షా భావాన్ని ఎదుర్కోవాలి

**కలెక్టర్ రాహుల్ శర్మ**



**భూపాలపల్లి, ఆగస్టు 5 :**

ఎల్ నినో ప్రభావంతో ఏర్పడే వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు రైతులు తమ పొలాల్లో ఫామ్ పాండ్స్ నిర్మించుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు. రేగొండ మండలం గూడెపల్లి గ్రామంలో రైతు లింగంపల్లి సంతోష్‌రావు నిర్మించిన ఫామ్ పాండ్‌ను పరిశీలించిన ఆయన, ఇది ఇతర రైతులకు ఆదర్శమని అన్నారు.వర్షపు నీటిని నిల్వ చేయడం ద్వారా భూగర్భ జలాలు పెరిగి నీటి కొరతను అధిగమించవచ్చని, ఫామ్ పాండ్స్ ద్వారా చేపల పెంపకం చేపట్టి అదనపు ఆదాయం పొందవచ్చని తెలిపారు. విబిజి రాంజీ, ప్రధాన మంత్రి కృషి సించాయి యోజన పథకాల కింద రైతులు ఫామ్ పాండ్స్ ఏర్పాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు.జిల్లాకు పీఎంకేఎస్‌వై కింద 214 ఫామ్ పాండ్స్ మంజూరు కాగా, 170 పనులు ప్రారంభమై 131 పూర్తయ్యాయని, విబిజి రాంజీ కింద 372 ఫామ్ పాండ్స్ మంజూరై 78 గ్రౌండింగ్ దశలో ఉన్నాయని తెలిపారు. ఫామ్ పాండ్స్ నిర్మాణంలో జిల్లా రాష్ట్రంలో రెండో స్థానంలో ఉందని కలెక్టర్ వెల్లడించారు.

## మెగా లెదర్ పార్క్ ఆమోదాన్ని వేగవంతం చేయాలి

- రూల్-377 కింద లోక్ సభలో అంశాన్ని ప్రస్తావించిన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య
- ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు లెదర్ పార్క్ తో వేలాదిమందికి ఉపాధి.. కేంద్రానికి ఎంపీ విజ్ఞప్తి

**జనగామ, ఆగస్టు 5 : :**



స్టేషన్ ఘన్‌పూర్‌లో ప్రతిపాదిత మెగా లెదర్ పార్క్‌కు కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఆమోదం తెలపాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య కోరారు. బుధవారం లోక్‌సభలో రూల్–377 కింద ఈ అంశాన్ని ప్రస్తావించిన ఆమె, తెలంగాణ ప్రభుత్వం పంపిన ప్రతిపాదన చాలా కాలంగా కేంద్ర ప్రభుత్వ పరిశీలనలోనే ఉండటంతో వేలాది మందికి ఉపాధి కల్పించే కీలక ప్రాజెక్టు అమలు ఆలస్యమవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.స్టేషన్ ఘన్‌పూర్‌లో ప్రభుత్వ ఆధీనంలోని 120 ఎకరాల భూమిలో తెలంగాణ స్టేట్ లెదర్ ఇండస్ట్రీస్ ప్రమోషన్ కార్పొరేషన్ (TSLIPCO) ఆధ్వర్యంలో మెగా లెదర్ పార్క్‌ను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించినట్లు ఎంపీ తెలిపారు.తెలంగాణలో లెదర్ పరిశ్రమ అభివృద్ధికి అవసరమైన ముడి పదార్థాల లభ్యతతో పాటు ఎఫ్‌డీడీఐ (FDDI), నిఫ్ట్ (NIFT), గిల్ట్ (GILT) వంటి ప్రముఖ సంస్థల సాంకేతిక సహకారం కూడా అందుబాటులో ఉండటం ఈ ప్రాజెక్టుకు అదనపు బలమని ఆమె పేర్కొన్నారు.ఈ మెగా లెదర్ పార్క్ ఏర్పాటుతో ముఖ్యంగా ఎస్సీ వర్గాలకు చెందిన యువతకు పెద్ద ఎత్తున ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలు లభిస్తాయని డాక్టర్ కడియం కావ్య తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తన వంతు ఏర్పాట్లు పూర్తి చేసినప్పటికీ కేంద్ర ప్రభుత్వ ఆమోదం లేకపోవడంతో ప్రాజెక్టు అమలు ముందుకు సాగడం లేదని చెప్పారు.ఉపాధి కల్పన, పారిశ్రామికాభివృద్ధికి దోహదపడే ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం వెంటనే గ్రీన్ సిగ్నల్ ఇచ్చి ఆమోద ప్రక్రియను వేగవంతం చేయాలని కేంద్ర వాణిజ్య, పరిశ్రమలు, జౌళి శాఖను వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య లోక్‌సభ వేదికగా విజ్ఞప్తి చేశారు.

## ఆలయంలో అభివృద్ధి పనులు పరిశీలించిన కలెక్టర్ రాహుల్ శర్మ

**కొడవటంచ, ఆగస్టు 5 ::**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ బుధవారం కొడవటంచలోని శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు అందజేసి వేదాశీర్వచనం చేశారు.అనంతరం ఆలయంలో జరుగుతున్న ప్రధాన ఆర్చ్ నిర్మాణం, అతిథి గృహం తదితర అభివృద్ధి పనులను కలెక్టర్ పరిశీలించారు. రోజువారీ భక్తుల రాక, వసతి సౌకర్యాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దర్శన ఏర్పాట్లు, వసతి, మౌలిక సదుపాయాలు మెరుగ్గా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

## స్ఫూర్తి కార్యక్రమంతో విద్యార్థినుల్లో చైతన్యం: కలెక్టర్

**వరంగల్, ఆగస్టు 5 :):**



వర్ధన్నపేట గిరిజన బాలికల వసతి గృహాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, స్ఫూర్తి కార్యక్రమం ద్వారా విద్యార్థినుల్లో చైతన్యం పెంపొందించాలని సూచించారు. విద్య, ఆరోగ్యం, వసతి, ఆహార నాణ్యతపై ఆరా తీసిన ఆమె, వర్షాకాలంలో పరిశుభ్రత పాటించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి వారి సమస్యలు తెలుసుకున్నారు. సీనియర్ జర్నలిస్టు కృష్ణమోహన్ విద్యార్థినులు వార్తాపత్రికలు చదివే అలవాటు పెంచుకోవాలని సూచించారు.



# నడకతో ఆరోగ్యం.. నడకతో ఆయుష్షు..

**వాకింగ్ అత్యుత్తమైన ఆరోగ్య అలవాటు. పైసా ఖర్చు లేకుండా మన శరీరాన్ని బాగు చేసుకొనే ప్రక్రియ. క్రమం తప్పకుండా నడిస్తే రోగాలు దరి చేరవని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. వాకింగ్ వల్ల లాభాలేంటి? అసలు వాకింగ్ ఏ సమయంలో చేయాలి? ఎలా చేయాలి? అన్న విశేషాలు ఈ కథనంలో తెలుసుకుందాం. నడక వల్ల కలిగే ప్రయోజనాలు చాలా ఎక్కువ.**

**డిప్రెషన్ దూరమవుతుంది..!**

నడక వల్ల డిప్రెషన్ దూరమవుతుందని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. నడక వల్ల గుండె సంబంధిత వ్యాధులు కూడా తగ్గే ముప్పు తగ్గుందంటున్నారు. వేగంగా నడవడం వల్ల గుండెకు, శ్వాస వ్యవస్థకు ప్రయోజనం కలుగుతుంది. ఆంగ్జయిటీ లేదా డిప్రెషన్‌తో బాధపడేవారికి నడక మరింత మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. నడవడం వల్ల శరీరంలోని ఎముకలు పటిష్టంగా మారతాయి. ఎముకలు పెళుసుగా మారడాన్ని నడకతో నివారించవచ్చు. రోజూ నడిస్తే శరీరంలోని కండరాలు బలంగా మారతాయి. నడక శరీరాన్ని సమతుల్యంగా ఉంచుతుంది. శరీరానికి సరైన ఆకృతిని అందిస్తుంది. కండరాలను ఆరోగ్యంగా మార్చుతుంది. బరువు తగ్గించుకోవడానికి నడక ఒక మంచి మార్గం. నడక వల్ల శక్తిఖర్చు అవుతుంది. ఫలితంగా బరువు తగ్గవచ్చు. నడక వల్ల శరీరంలో చక్కెర స్థాయిలో అదుపులో ఉంటాయని అనేక అధ్యయనాల్లో తేలింది. నడక వల్ల కొవ్వు పేరుకోదు. గుండె జబ్బులు, డయాబెటిస్, కాలేయ వ్యాధులకు కొవ్వు పేరుకుపోవడమే కారణం. ఇన్సులిన్‌కు శరీరం స్పందించే తీరును కూడా నడక మెరుగుపరుస్తుంది.

**ఆయుష్షు ను పెంచుతుంది**

నడక, ఆయుష్షును పెంచుతుంది. నడక వల్ల 1620 సంవత్సరాలు అదనంగా జీవించవచ్చు. ఎంత ఎక్కువగా నడిస్తే, మరణాన్ని అంత దూరంగా తరిమేయవచ్చు. నడక కేవలం శరీర దారుఢ్యాన్ని పెంచడమే కాకుండా మానసిక ఆరోగ్యాన్ని కూడా మెరుగుపరుస్తుంది. డిప్రెషన్ విషయంలో నడక అనేది ఒక యాంటీ డిప్రెసెంట్‌గా పని చేస్తుంది. రోజూ వాకింగ్ చేయడం వల్ల క్రమశిక్షణ అలవడుతుంది. మానసిక స్థితి కూడా బాగుంటుంది. బహిరంగ ప్రదేశాల్లో నడవడం వల్ల శరీరంలో విటమిన్ 'డి' స్థాయిలు పెరుగుతాయి. శరీరానికి సూర్యరశ్మి తగలడం వల్ల శరీరంలో విటమిన్ డి ఉత్పత్తి అవుతుంది.

**ఎలా నడవాలి?**

తొలుత నెమ్మదిగా నడకను మొదలుపెట్టి క్రమక్రమంగా వేగాన్ని పెంచాలి. గంటకు 6.4 కి.మీ వేగంతో రోజూ 30 నిమిషాల పాటు నడవడం ప్రయోజనకరంగా ఉంటుంది. ఏదైనా వాకింగ్ గ్రూపులో చేరితే రోజూ నడవాలనే ఉత్సాహం కూడా వస్తుంది. ఒక్కసారి మీరు నడవాలని నిర్ణయించుకున్న తర్వాత అది మీ జీవితంలో భాగంగా మారుతుంది. ఇటీవలి కొన్ని పరిశోధనల ప్రకారం, మహిళలైతే ఉదయం 8 గంటల నుంచి 11 గంటల మధ్య నడిస్తే గుండె జబ్బులు వచ్చే ప్రమాదం తగ్గుతుంది. అన్నింటికంటే రోజంతా చురుగ్గా ఉండటానికి నడక మంచి మార్గం. నడక ఉత్సాహంగా ఉంచుతుంది

**ఏ వయసు వారు ప్రారంభించాలి..!**

వాకింగ్ ను ఎవరైనా.. ఎప్పుడైనా మొదలుపెట్టొచ్చు. 45 ఏళ్ల లోపు వారికి ఎలాంటి పరీక్షలు అవసరం లేదు. 45 ఏళ్లు దాటినవారు..నడిస్తే ఆయాసం, గుండెనొప్పి, అధిక రక్తపోటు వంటి సమస్యలున్న వారు ముందుగా డాక్టర్‌ను కన్సల్ట్ అయ్యి నిర్ణయం తీసుకోవాలి. ముఖ్యంగా చిన్నవయసు నుంచే డయాబెటిక్ టైప్ 1 ఉన్న వారు డాక్టర్ సూచన మేరకే వాకింగ్, వర్కవుట్స్ చేయాలి. ఎందుకంటే వీళ్లు ఇన్సులిన్ తీసుకుంటుంటారు కాబట్టి రక్తంలో గ్లూకోజు బాగా పడిపోయే అవకాశముంది.డయాబెటిక్ టైప్ 2 ఉన్న వారు అందిరిలాగే వాకింగ్ చేయొచ్చు. ముందుజాగ్రత్తగా గ్లూకోజు బిస్కట్లు పెట్టుకోవటం మంచిది. గ్లూకోజు పడిపోయినట్లనిపిస్తే వెంటనే తినటానికి ఉపయోగపడతాయి.

**ఈ పరిస్థితుల్లో నడవొద్దు..!**

ఫుల్లుగా తిని వాకింగ్ చేయడం మంచిది కాదు. రెండు మూడ్రోజులు బ్రేక్ ఇచ్చి నడవడం కంటే డైలీ వాకింగ్ చేస్తేనే ప్రయోజనం. వాకింగ్ ఆపేసిన మళ్లీ ప్రారంభించాలంటే నెమ్మదిగా స్టార్ట్ చేయాలి. డైలీ అరంగట వాకింగ్ కు టైమ్ కేటాయించాలి తక్కువ దూరంతో వాకింగ్ స్టార్ట్ చేసి రోజురోజుకు పెంచుకుంటూ వెళ్లాలి.



# చన్నీటి స్నానం మంచిదేనా?

చన్నీటితో స్నానం చేయాలా? వేడి నీటితో స్నానం చేయాలా? గోరువెచ్చటి నీటితో స్నానం చేస్తే బెటరా? చాలా మందిని ఈ సమస్యలు వేదిస్తుంటాయి. చలికాలం ఎలాగూ తప్పదు కాబట్టి చాలా మంది హాట్ వాటర్ తోనే స్నానం చేస్తారు. అయితే కొంతమంది కాలాలకు అతీతంగా ప్రతి సీజన్ లోనూ వేడినీటితోనే స్నాం చేస్తారు. అసలు నీటితో స్నానం మంచిది.. నిపుణులు ఏం చెప్తున్నారు? ఈ కథనంలో తెలుసుకుందాం..

చల్లటి నీటితో స్నానం చేయడమే ఆరోగ్యానికి మంచిదని నిపుణులు చెబుతుంటారు. చర్మ సంబంధిత సమస్యలు మొదలు ఎన్నో ఇతర సమస్యలకు చెక్ పెట్టొచ్చని అంటుంటారు. ఇక చల్లటి నీటితో స్నానం చేయడం వల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుందని కూడా చాలా మంది భావిస్తుంటారు. చల్లటి నీటితో స్నానం చేయడం వల్ల శరీరం వెంటనే రిఫ్రెష్ అవుతుంది. శరీరానికి ఇన్‌స్టంట్ ఎనర్జీ వస్తుంది. చల్లటి నీటితో స్నానం చేసిన వెంటనే ఉల్లాసంగా ఉంటారు. అలాగే చల్లని నీరు రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. ఇది మీ చర్మాన్ని మెరిసేలా, ఆరోగ్యంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తుంది. చల్లటి నీటితో స్నానం చేయడం వల్ల మానసిక ఆరోగ్యం కూడా మెరుగవుతుందని నిపుణులు అంటున్నారు. ముఖ్యంగా ఎంత టెన్షన్, ఒత్తిడి ఉన్నా బలదూర్ అవుతుందని చెబుతున్నారు. అయితే రోగ నిరోధక శక్తి బలపడుతుందా అంటే మాత్రం. కచ్చితంగా అవుననే సమాధానం చెప్పలేమని నిపుణులు అంటున్నారు. రోగనిరోధక శక్తిని బలోపేతం కావాలంటే చల్లటి నీటితో స్నానం చేస్తే సరిపోదని. తీసుకునే ఆహారంలో కూడా ఎన్నో జాగ్రత్తలు పాటించాలని చెబుతున్నారు. ముఖ్యంగా విటమిన్లు, ఖనిజాలు అధికంగా ఉండే సమతుల్య ఆహారాన్ని భాగం చేసుకోవాలని సూచిస్తున్నారు.



## జపనీస్ మచా ఫ్లేవర్ టీతో

# ఎన్నో ఆరోగ్యప్రయోజనాలు

మనదేశంలో టీ ఫ్యాన్స్ కు కొదవ లేదు. చాలా మందికి పొద్దునే ఓ కప్పు టీతాగితే డే స్టార్ట్ కాదు. ఇక ప్రస్తుతం మార్కెట్ లో రకరకాల టీ ఫ్లేవర్లు అందుబాటులోకి వస్తున్నాయి. అయితే లేటెస్ట్ గా జపనీస్ మచా ఫ్లేవర్ టీ ట్రెండ్ అవుతోంది. అసలు ఈ టీ ప్రయోజనం ఏమిటి? దీంతో లాభాలు ఏంటి? ఈ టీని ఎలా తయారుచేస్తారు? ఈ కథనంలో తెలుసుకుందాం..!

**మాచా ఫ్లేవర్ టీ ..**

భారత్ లో టీ ఎంత ప్రాచుర్యం పొందిందో జపాన్ లో మచా ఫ్లేవర్ టీ కూడా అంతే ప్రాధాన్యత కలిగి ఉంది. రుచి మాత్రమే కాదు ఆరోగ్యానికి సంబంధించిన ఎన్నో పోషకాలు ఇందులో ఉన్నాయి. జపాన్‌కు చెందిన ప్రసిద్ధ గ్రీన్ టీ 'మచ్చా', దీనిని జపనీస్ మచా అని కూడా పిలుస్తారు. ఈ టీ ప్రపంచవ్యాప్తంగా ప్రజాదరణ పొందుతోంది. 'మచా' గ్రీన్ టీ ఆకులను గ్రైండ్ చేసి పొడి తయారు చేస్తారు. ఈ టీలో అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు, ఎనర్జీ, డిటాక్సిఫికేషన్ లక్షణాలు పుష్కలంగా ఉన్నాయి. ప్రస్తుతం ఈ టీ తో కలిగే లాభాల కోసం ఇంకా అనేక ప్రయోగాలు కొనసాగుతున్నాయి.





# చుండ్రుకు చెక్ పెట్టండిలా..!

చుండ్రు ఈ సమస్య అందరినీ వేదిస్తోంది. అసలు చుండ్రును ఎలా పోగొట్టుకోవాలా.. ప్రస్తుత జీవనశైలి, ఆరోగ్య సమస్యలతో చాలా మందికి చుండ్రు సమస్యగా మారింది. ఇక నీటి కాలుష్యం, వాయు కాలుష్యం, కెమికల్స్‌తో కూడిన షాంపూలు వాడడం కూడా ఓ కారణమని చెబుతున్నారు. చుండ్రును తగ్గించుకోవడానికి మార్కెట్లో లభించే రకరకాల షాంపూలను, నూనెలను ఉపయోగిస్తుంటారు. అయితే ఎన్ని రకాల ప్రయత్నాలు చేసినా ఉపశమనం లభించకపోతే బిర్యానీ ఆకులతో నేచురల్ చిట్కా పాటిస్తే.. చుండ్రు ఇట్టే పరార్ అవుతుంది. బిర్యానీ ఆకులోని ఔషధ గుణాలు చుండ్రును తరిమేస్తాయని నిపుణులు చెబుతున్నారు. బిర్యానీ ఆకుల ద్వారా కేవలం చుండ్రు మాత్రమే కాకుండా.. తలపై ఉండే వాపు, దురద, దద్దుర్లు, పొడి బారడం వంటి సమస్యలను దూరం అవుతాయి. ఇంతకీ బిర్యానీ ఆకులతో హెయిర్ ప్యాక్‌ను ఎలా తయారు చేసుకోవాలో ఇప్పుడు తెలుసుకుందాం.

**ఇలా చేయండి..!**

బిరానీ ఆకులను తీసుకొని. కొని నీటు పొసుకొని బాగా మరిగించాలి. ఆకులు పూర్తిగా మరిగిన తర్వాత, చల్లార్చి బిర్యానీ ఆకులను మిక్సీ పట్టుకోవాలి. అలాగే అందులో.. కాస్త వేప ఆయిల్ లేదా అలోవెరా జెల్, ఉసిరి పొడి లాంటివి యాడ్ చేసి మిక్స్ చేయాలి. అనంతరం ఈ మిశ్రమాన్ని తలకు బాగా పట్టించాలి. ఇలా ఓ ఐదు నిమిషాలు మసాజ్ చేసిన తర్వాత పావుగంట పాటు ఆరబెట్టాలి. ఆ తర్వాత షాంపూతో తలను శుభ్రం చేసుకుంటే సరిపోతుంది. ఇలా వారంలో రెండు సార్లు చేస్తే మార్పు ఇట్టే



## అనధికారిక లీగ్‌లో ఆడిన పాక్ మాజీ క్రికెటర్లకు షాక్

# రెండేళ్ల నిషేధానికి పీసీబీ సిద్ధం



- **ఐసీసీ గుర్తింపు లేని టోర్నీలో పాల్గొనడంపై క్రమశిక్షణ చర్యలు**

**లాహోర్, ఆగస్టు 5:** పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) నిబంధనలను ఉల్లంఘించి అనధికారిక క్రికెట్ లీగ్‌లో పాల్గొన్న పలువురు మాజీ ఆటగాళ్లపై కఠిన చర్యలు తీసుకునేందుకు సిద్ధమైంది. ఐసీసీ లేదా జాంబియా క్రికెట్ యూనియన్ గుర్తింపు లేని టోర్నీలో ఆడినందుకు మాజీ ఫాస్ట్ బౌలర్ మహమ్మద్ ఇర్ఫాన్‌తో పాటు పలువురు మాజీ క్రికెటర్లపై రెండేళ్ల నిషేధం విధించే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. జాంబియా రాజధాని లుసాకాలో ఇటీవల నిర్వహించిన 'ఏషియన్ లెజెండ్స్ లీగ్'కు ఐసీసీ గుర్తింపు లేదని, జాంబియా క్రికెట్ యూనియన్ కూడా ఈ టోర్నీకి మద్దతు ఇవ్వలేదని పీసీబీ పేర్కొంది. బోర్డు నుంచి ముందస్తు అనుమతి (నో అబ్జెక్షన్ సర్టిఫికెట్) తీసుకోకుండా ఈ లీగ్‌లో పాల్గొనడం నిబంధనల ఉల్లంఘనేనని స్పష్టం చేసింది. ఈ నిషేధం అమల్లోకి వస్తే సంబంధిత ఆటగాళ్లు రెండేళ్లపాటు ఎలాంటి క్రికెట్ కార్యకలాపాల్లోనూ పాల్గొనలేరు. ఆటగాళ్లుగా మాత్రమే కాకుండా పీసీబీ లేదా పాకిస్తాన్ సూపర్ లీగ్ పరిధిలోని జట్లకు కోచ్, మెంటార్ లేదా సలహాదారులుగా కూడా వ్యవహరించలేని పరిస్థితి ఏర్పడుతుంది. క్రికెట్ సమగ్రతను కాపాడడం, ఐసీసీ నిబంధనలను అమలు చేయడం లక్ష్యంగానే ఈ చర్యలు తీసుకుంటున్నట్లు పీసీబీ తెలిపింది. టోర్నీలో 'పాకిస్తాన్ పాంథర్స్'తో పాటు మొత్తం ఆరు జట్లు పాల్గొన్నాయి. లీగ్ కోసం మహమ్మద్ హఫీజ్, సోహైల్ తన్వీర్, ఉమర్ అక్మల్ లుసాకా చేరుకున్నప్పటికీ, టోర్నీకి ఐసీసీ ఆమోదం లేదని తెలుసుకున్న తర్వాత చివరి నిమిషంలో వైదొలిగారు. అయితే మహమ్మద్ ఇర్ఫాన్, ఇమ్రాన్ నజీర్, తౌఫీక్ ఉమర్, రాహత్ అలీ, యాసిర్ షా, జాహిద్ మహమూద్, హసన్ రజా, ఇబ్రార్ హుస్సేన్ తదితరులు జూలై 31న జరిగిన మ్యాచ్‌లో పాల్గొన్నారు. ఈ టోర్నీలో భారత్, శ్రీలంక, బంగ్లాదేశ్, అఫ్గానిస్థాన్‌కు చెందిన జట్లు కూడా బరిలోకి దిగినప్పటికీ, ఇప్పటివరకు తమ ఆటగాళ్లపై బహిరంగంగా క్రమశిక్షణ చర్యలు ప్రకటించిన ఏకైక బోర్డుగా పాకిస్థాన్ క్రికెట్ బోర్డు నిలిచింది.



## కావ్య మారన్ జట్టులోకి

# మిచెల్ మార్ష్

**ఎస్ఏ20 ఛాంపియన్ సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్‌తో ఒప్పందం**

**రిషాద్ హుస్సేన్‌కూ చోటు.. మరో టైటిల్‌పై గురి**

**కేప్‌టౌన్, ఆగస్టు 5:** దక్షిణాఫ్రికా టీ20 లీగ్ (ఎస్ఏ20) ప్రస్తుత ఛాంపియన్ సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్ మరో కీలక ఆటగాడిని జట్టులోకి తీసుకుంది. సన్ గ్రూప్ సహ యజమాని కావ్య మారన్ ఆధ్వర్యంలోని ఈ ఫ్రాంచైజీ ఆస్ట్రేలియా స్టార్ ఆల్‌రౌండర్ మిచెల్ మార్ష్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. దీంతో రానున్న సీజన్‌లో జట్టు మరింత బలపడింది. మార్ష్‌కు ఎస్ఏ20లో ఆడటం ఇదే తొలిసారి కావడం విశేషం. ఇటీవల ముగిసిన ఐపీఎల్--2026లో లక్నో సూపర్ జెయింట్స్ తరఫున మిచెల్ మార్ష్ అద్భుత ప్రదర్శన కనబరిచాడు. 13 మ్యాచ్‌ల్లో 563 పరుగులు సాధించి జట్టులో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా నిలిచాడు. అతని దూకుడైన బ్యాటింగ్ సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్‌ను ఆకట్టుకోవడంతో అతడిని జట్టులోకి తీసుకుంది. మార్ష్ చేరికతో సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్ బ్యాటింగ్ విభాగం మరింత పటిష్టమైంది. ఇప్పటికే జట్టులో క్వింటన్ డి కాక్, ట్రిస్టన్ స్టబ్స్, మార్కో జాన్సెన్, ఆన్రిచ్ నార్ట్జే, ఆడమ్ మిల్నే వంటి స్టార్ ఆటగాళ్లు ఉండగా, ఇప్పుడు మార్ష్ రావడంతో బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో సమతూకం మరింత పెరిగింది. మిచెల్ మార్ష్‌తో పాటు బంగ్లాదేశ్ లెగ్ స్పిన్నర్ రిషాద్ హుస్సేన్‌ను కూడా ఫ్రాంచైజీ జట్టులోకి చేర్చుకుంది. 2024 టీ20 ప్రపంచకప్‌లో 14 వికెట్లు తీసి ఆకట్టుకున్న రిషాద్, ఆఫ్ఘనిస్తాన్ స్పిన్నర్ ఏఎం ఘజన్‌ఫర్ స్థానాన్ని భర్తీ చేయనున్నాడు. ఎస్ఏ20 చరిత్రలో అత్యంత విజయవంతమైన జట్టుగా సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్ నిలిచింది. ఇప్పటివరకు జరిగిన నాలుగు సీజన్లలో మూడు టైటిళ్లు గెలిచి తన ఆధిపత్యాన్ని చాటుకున్న ఈ జట్టు, మరోసారి ట్రోఫీపై కన్నేసింది. ఎస్ఏ20 కొత్త సీజన్ వచ్చే ఏడాది జనవరి 17 నుంచి ప్రారంభం కానుండగా, అక్టోబర్ 7న మినీ వేలం నిర్వహించనున్నారు. ఇప్పటికే ట్రిస్టన్ స్టబ్స్‌ను కెప్టెన్‌గా కొనసాగించిన సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్ జట్టులో వేలం ద్వారా భర్తీ చేయాల్సిన స్థానాలు కేవలం రెండే మిగిలి ఉండటంతో మరోసారి టైటిల్ ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది.

# బీసీసీఐ సమీక్షా సమావేశం వాయిదా

**కార్యదర్శి అస్వస్థతతో ఫ్యూచర్ ప్లాన్ ఆలస్యం**

**త్వరలో గంభీర్‌తో కీలక భేటీ.. జట్టు ప్రదర్శనపై సమీక్ష**

**ముంబై, ఆగస్టు 5:** ఐర్లాండ్, ఇంగ్లాండ్ పర్యటనల్లో భారత జట్టు వరుస పరాజయాలపై నిర్వహించాల్సిన బీసీసీఐ సమీక్షా సమావేశం వాయిదా పడింది. బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా అస్వస్థతకు గురికావడంతో ఈ సమావేశం ఆలస్యమైనట్లు సమాచారం. త్వరలోనే ఈ భేటీ నిర్వహించనుండగా, ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ వర్చువల్ విధానంలో పాల్గొననున్నట్లు తెలుస్తోంది. ఐర్లాండ్‌తో టీ20 సిరీస్‌ను క్లీన్‌స్వీప్‌గా కోల్పోయిన టీమిండియా, అనంతరం ఇంగ్లాండ్‌తో జరిగిన ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లోనూ 3--2తో ఓటమి చవిచూసింది. ఆ తర్వాత జరిగిన వన్డే సిరీస్‌లో కూడా పరాజయం ఎదురవడంతో జట్టు ప్రదర్శనపై తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో ఆటలోని లోపాలను విశ్లేషించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందించేందుకు బీసీసీఐ సమీక్షా సమావేశం ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇంగ్లాండ్ పర్యటన జూలై 19తో ముగిసినప్పటికీ, ప్రస్తుతం భారత జట్టు శ్రీలంకతో ఆగస్టు 15 నుంచి ప్రారంభమయ్యే రెండు టెస్టుల సిరీస్ కోసం సిద్ధమవుతోంది. అయినప్పటికీ ఇప్పటివరకు సమీక్షా సమావేశం జరగకపోవడం చర్చనీయాంశమైంది. టీ20 ప్రపంచకప్ విజేత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ స్థానంలో శ్రేయాస్ అయ్యర్‌కు బాధ్యతలు అప్పగించిన తర్వాత భారత్ వరుస సిరీస్‌లు కోల్పోవడం ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా ఇంగ్లాండ్‌తో మూడో టీ20లో 202 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో కేవలం 76 పరుగులకే ఆలౌటై 125 పరుగుల భారీ తేడాతో ఓడిపోవడం, నాలుగో మ్యాచ్‌లో 9 వికెట్ల తేడాతో పరాజయం పాలవడం తీవ్ర నిరాశకు గురిచేసింది. ఇక అంతకుముందు ఐర్లాండ్‌తో 2--0 తేడాతో సిరీస్ కోల్పోవడం భారత క్రికెట్ చరిత్రలోనే అతిపెద్ద షాకుల్లో ఒకటిగా నిలిచింది. అయితే ఈ పరాజయాలపై స్పందించిన బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా, ఇది తాత్కాలిక ప్రతికూల దశ మాత్రమేనని, అంతర్జాతీయ క్రికెట్‌లో ఇలాంటి హెచ్చుతగ్గులు సహజమని పేర్కొన్నారు. త్వరలో జరగనున్న సమీక్షా సమావేశంలో జట్టు ప్రదర్శన, భవిష్యత్తు ప్రణాళికలు, ఎంపికల విధానం, జట్టు బలోపేతంపై కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశముందని క్రికెట్ వర్గాలు భావిస్తున్నాయి.





# ఫుట్‌బాల్ మ్యాచ్‌లో పిడుగు బీభత్సం

**మైదానంలోనే 24 ఏళ్ల ఆటగాడు మృతి**

**మరో 12 మంది క్రీడాకారులకు గాయాలు**

**బ్యాంకాక్, ఆగస్టు 5:** థాయిలాండ్‌లో ఫుట్‌బాల్ మ్యాచ్ జరుగుతున్న సమయంలో మైదానంలో పిడుగు పడటంతో విషాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో 24 ఏళ్ల యువ ఫుట్‌బాలర్ సొఫ్వాన్ అవాయే మృతి చెందగా, మరో 12 మంది ఆటగాళ్లు గాయపడ్డారు. ఈ సంఘటన థాయిలాండ్‌లోని సుంగై గోలోక్‌లోని శాంతిపాప్ స్టేడియంలో నిర్వహిస్తున్న 'గోలోక్ ఎఫ్ఏ కప్' టోర్నీలో చోటుచేసుకుంది. సామ్ కోల్ట్స్, అబు ఎక్స్ నాంగ్ సిరిన్ జట్ల మధ్య మ్యాచ్ జరుగుతుండగా ఒక్కసారిగా భారీ శబ్దంతో పిడుగు మైదానంపై పడింది. దీంతో సామ్ కోల్ట్స్ జట్టుకు చెందిన వింగర్ సొఫ్వాన్ అవాయే తీవ్రంగా గాయపడి మైదానంలోనే కుప్పకూలాడు. వెంటనే సహచర ఆటగాళ్లు అతనికి సీపీఆర్ అందిస్తూ ప్రాణాలు కాపాడేందుకు ప్రయత్నించారు. అనంతరం అత్యవసర వైద్య సిబ్బంది ఆసుపత్రికి తరలించినప్పటికీ చికిత్స ఫలించక అతడు మృతి చెందినట్లు పోలీసులు ధృవీకరించారు. ఈ ప్రమాదంలో గాయపడిన 12 మంది ఆటగాళ్లలో ఒక మలేషియా ఫుట్‌బాలర్ కూడా ఉన్నట్లు స్థానిక పోలీస్ చీఫ్ థున్ సిరిఖుంట్ తెలిపారు. గాయపడిన వారంతా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని వెల్లడించారు. మరణించిన సొఫ్వాన్ అవాయే ఇటీవలే థాయ్ థర్డ్ డివిజన్ క్లబ్ 'యాలా ఎఫ్‌సీ'తో ఒప్పందం కుదుర్చుకున్నాడు. అతని ఆకస్మిక మృతిపై యాలా ఎఫ్‌సీ యాజమాన్యం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపింది. థాయిలాండ్‌లో పిడుగుపాటు ఘటనలు తరచూ చోటుచేసుకుంటున్నాయి. అక్కడి డిసీజ్ కంట్రోల్ డిపార్ట్‌మెంట్ గణాంకాల ప్రకారం 2020 నుంచి 2024 మధ్య దేశవ్యాప్తంగా 283 మంది పిడుగుపాటుకు గురయ్యారు. వారిలో అధిక సంఖ్యలో బాధితులు ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు తెలిపారు.



## విజేతలకు ఢిల్లీలో

# ఘన స్వాగతం

**కామన్వెల్త్ పతక విజేతలకు అభిమానుల ఘన సన్మానం**

**జూడో స్వర్ణ విజేత అస్మితకు ప్రత్యేక ఆదరణ**

**న్యూఢిల్లీ, ఆగస్టు 5:** కామన్వెల్త్ గేమ్స్–2026లో భారతదేశానికి పతకాల పంట పండించి స్వదేశానికి చేరుకున్న క్రీడాకారులకు ఢిల్లీలో ఘన స్వాగతం లభించింది. మంగళవారం ఢిల్లీ విమానాశ్రయానికి చేరుకున్న భారత బృందాన్ని వందలాది మంది అభిమానులు హర్షధ్వానాలతో ఆహ్వానించారు. ఏడు స్వర్ణ పతకాలు సాధించిన భారత బాక్సింగ్ జట్టుతో పాటు జూడోలో దేశానికి చారిత్రాత్మక స్వర్ణ పతకం అందించిన అస్మితకు అభిమానులు ప్రత్యేకంగా సన్మానం చేశారు. పూలమాలలతో పాటు రూ.50 నోట్లతో తయారుచేసిన దండలు వేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన అస్మిత తన ఆనందాన్ని వ్యక్తం చేసింది. జూడోలో భారత్‌కు స్వర్ణ పతకం సాధించాలనేది తన చిరకాల కల అని, గ్లాస్గోకు బయలుదేరినప్పటి నుంచే స్వర్ణంతోనే స్వదేశానికి తిరిగి రావాలని లక్ష్యంగా పెట్టుకున్నానని తెలిపింది. ఆ లక్ష్యాన్ని సాధించడం జీవితంలో మరపురాని ఘట్టమని పేర్కొంది. భారత క్రీడాకారుల విజయాలతో దేశవ్యాప్తంగా ఆనందోత్సాహాలు నెలకొన్నాయి. విమానాశ్రయంలో అభిమానులు, కుటుంబ సభ్యులు, క్రీడా సంఘాల ప్రతినిధులు ఘనంగా స్వాగతం పలుకుతూ విజేతలను అభినందించారు.

# ధుల్ ధాటికి సెంట్రల్ ఢిల్లీ కింగ్స్ ఘన విజయం

**న్యూఢిల్లీ, ఆగస్టు 5:** ఢిల్లీ ప్రీమియర్ లీగ్–2026లో సెంట్రల్ ఢిల్లీ కింగ్స్ ఓపెనర్ యష్ ధుల్ అద్భుత శతకంతో జట్టుకు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు. అరుణ్ జైట్లీ స్టేడియంలో పురానీ ఢిల్లీ–6తో జరిగిన మ్యాచ్‌లో 23 ఏళ్ల ధుల్ కేవలం 47 బంతుల్లో 6 ఫోర్లు, 9 సిక్సర్లతో అజేయంగా 100 పరుగులు సాధించాడు. డీపీఎల్‌లో అతనికి ఇది రెండో సెంచరీ. ఈ అద్భుత ఇన్నింగ్స్‌కు గాను 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. వర్షం కారణంగా 15 ఓవర్లకు కుదించిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన పురానీ ఢిల్లీ–6 జట్టు 7 వికెట్ల నష్టానికి 140 పరుగులు చేసింది. సెంట్రల్ ఢిల్లీ కింగ్స్ బౌలర్ మనీ గ్రేవాల్ మూడు వికెట్లు తీసి ప్రత్యర్థి టాప్ ఆర్డర్‌ను కుదేలు చేశాడు. ఒక దశలో 55 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయిన పురానీ ఢిల్లీని రోహన్ రాఠీ (46), అశ్విని చిల్లా (38) ఆరో వికెట్‌కు 85 పరుగుల భాగస్వామ్యంతో ఆదుకున్నారు. 141 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన సెంట్రల్ ఢిల్లీ కింగ్స్ 13.2 ఓవర్లలోనే ఒక్క వికెట్ మాత్రమే కోల్పోయి విజయాన్ని అందుకుంది. యష్ ధుల్ దూకుడైన బ్యాటింగ్‌తో మ్యాచ్‌ను ఏకపక్షంగా మార్చేశాడు. నాలుగో ఓవర్‌లో 23 పరుగులు, ఐదో ఓవర్‌లో మరో 23 పరుగులు రాబట్టి ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడ్డాడు. కేవలం 22 బంతుల్లోనే అర్ధశతకం పూర్తి చేసిన ధుల్, అనంతరం అదే జోరు కొనసాగించి శతకాన్ని అందుకున్నాడు. సిద్ధార్థ్ అవుటైన తర్వాత యుగళ్ సైనితో కలిసి రెండో వికెట్‌కు అజేయంగా 81 పరుగులు జోడించాడు. చివరకు దిగేష్ రాఠీ బౌలింగ్‌లో సింగిల్ తీసి



శతకంతో పాటు జట్టు విజయాన్ని కూడా ఖాయం చేశాడు. ఈ విజయంతో సెంట్రల్ ఢిల్లీ కింగ్స్ వరుసగా నాలుగో మ్యాచ్‌లోనూ గెలిచి పూర్తి ఆధిపత్యంతో పాయింట్ల పట్టికలో అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది.




# విడుదలకు సిద్ధమవుతున్న కొరియన్ కనకరాజు

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హీరోగా నటించిన ఇండో–కొరియన్ హారర్ కామెడీ 'కొరియన్ కనకరాజు' విడుదలకు సిద్ధమైంది. దర్శకుడు మేర్లపాక గాంధీ తెరకెక్కించిన ఈ చిత్రంలో రితికా నాయక్ హీరోయిన్‌గా నటించగా, ప్రముఖ కమెడియన్ సత్య కీలక పాత్ర పోషించారు. ఆగస్టు 7న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ సినిమా ఇప్పటికే సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుంది. ఈ నేపథ్యంలో సినిమా చూసిన వారి ఒపీనియన్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో ఆసక్తికరంగా మారాయి. ముఖ్యంగా కామెడీ, వరుణ్ తేజ్ నటన, థమన్ సంగీతం సినిమాకు ప్రధాన బలాలుగా నిలిచాయని టాక్ వినిపిస్తోంది. 'వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్', 'ఎక్స్‌ప్రెస్ రాజా' వంటి విజయవంతమైన కామెడీ చిత్రాలను తెరకెక్కించిన మేర్లపాక గాంధీ, మరోసారి తన మార్క్ కామెడీని ఈ చిత్రంలో చూపించినట్లు సమాచారం. సినిమా తొలి భాగం నుంచి రెండో భాగం వరకు పలు కామెడీ సన్నివేశాలు ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తాయని సెన్సార్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ముఖ్యంగా ఇంటర్వెల్ ముందు, తర్వాత వచ్చే ఎపిసోడ్లు బాగా వర్కవుట్ అయ్యాయని అంటున్నారు. అలాగే వరుణ్ తేజ్, సత్య మధ్య వచ్చే కామెడీ ట్రాక్‌తో పాటు బుల్లిరాజు పాత్ర చుట్టూ తిరిగే సన్నివేశాలు కూడా మంచి వినోదాన్ని అందిస్తాయని సమాచారం. సినిమాలో వరుణ్ తేజ్ రెండు విభిన్న కోణాలు ఉన్న పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది. అనంతపురం జిల్లా పెనుగొండకు చెందిన సాధారణ యువకుడు కనకరాజు పాత్రలో ఒకవైపు కనిపిస్తే, మరోవైపు కొరియన్ గ్యాంగ్‌స్టర్ ఆత్మ ఆవహించిన తర్వాత పూర్తిగా భిన్నమైన వ్యక్తిత్వంతో కనిపించనున్నారని టాక్. ఈ రెండు పాత్రల మధ్య బాడీ లాంగ్వేజ్, డైలాగ్ డెలివరీ, స్టైల్ పరంగా వరుణ్ తేజ్ మంచి వేరియేషన్ చూపించారని సినిమా చూసిన వారు చెబుతున్నారు. కంటెంట్‌కు ప్రాధాన్యం ఇచ్చే వరుణ్ తేజ్ ఈసారి కమర్షియల్ ఎంటర్‌టైనర్‌లో కూడా తన నటనతో ఆకట్టుకున్నారని సమాచారం. సినిమా కథ ఆసక్తికరమైన కాన్సెప్ట్‌తో రూపొందినట్లు తెలుస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లోని కియా కంపెనీలో ఉద్యోగం కోసం కొరియా నుంచి వచ్చిన యువతి పాత్రలో రితికా నాయక్ కనిపించనుంది. ఆమెను ప్రేమించే కనకరాజు జీవితంలో అనుకోని మలుపు తిరుగుతుంది. కొరియా నుంచి వచ్చిన ఓ బాటిల్‌లో బంధించబడిన గ్యాంగ్‌స్టర్ ఆత్మ బయటకు వచ్చి కనకరాజును ఆవహిస్తుంది. ఆ తర్వాత కనకరాజు జీవితం ఎలా మారింది? ఆ ఆత్మ కొరియాతో ఉన్న సంబంధం ఏమిటి? చివరకు కథ ఎలాంటి మలుపు తిరిగింది? అనే అంశాల చుట్టూనే సినిమా సాగుతుందని తెలుస్తోంది. సినిమాకు సంగీత దర్శకుడు ఎస్. థమన్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, పాటలు కథకు మరింత బలం చేకూర్చాయని సమాచారం. కామెడీ తర్వాత ఎక్కువ ప్రశంసలు సంగీతానికే వస్తాయని సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది.

# మిస్సింగ్ మేఘన.. ఫస్ట్ లుక్ విడుదల




రామ్ కార్తీక్ హీరోగా, అమ్ము అభిరామి, వైదిక సెంజాలియా, అంకిత్ కొయ్య ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా సస్పెన్స్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ చిత్రం 'మిస్సింగ్ మేఘన'. ఫస్ట్ కాపీ మూవీస్ మరియు కేడి అండ్ కో బ్యానర్లపై పంచుమర్తి నరేష్ బాబు నిర్మిస్తున్న ఈ చిత్రానికి వాచస్పతి దర్శకత్వం వహిస్తున్నారు. గోపరాజు రమణ, వెంప కాశి, కౌశిక్, మహిపాల్, రుచిత, నళిని, శ్రీనివాస్, అజీమ్, పండు తదితరులు ఇతర ముఖ్య పాత్ర ల్లో నటిస్తున్నారు. ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్ లుక్ మరియు టైటిల్ రివీలింగ్ పోస్టర్ లాంచ్ కార్యక్రమం టాలీవుడ్ ప్రముఖ టెక్నీషియన్లు, సినీ ప్రముఖుల సమక్షంలో అత్యంత వైభవంగా జరిగింది. టాలీవుడ్ ప్రముఖ దర్శకుడు వివి వినాయక్ ఈ చిత్ర పోస్టర్‌ను తన చేతుల మీదుగా విడుద ల చేసి సినిమా యూనిట్‌కు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్మాత బెక్కం వేణుగోపాల్‌తో పాటు చిత్ర బృందమంతా ఉత్సాహంగా పాల్గొంది. ఈ సందర్భంగా వివి వినాయక్ మాట్లాడుతూ, బెక్కం వేణుగోపాల్, శ్రీనివాస్ ల సహకారంతో దర్శకుడు వాచస్పతి ఈ చిత్రాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్నారని తెలిపారు. ఈ సినిమాతో హీరో రామ్ కార్తీక్, దర్శకుడు వాచస్పతిలకు మంచి పేరు రావాలని, అలాగే సంగీతంతో పాటు పాటలు కూడా అందించే ఆల్ రౌండర్ ధృవన్‌కు ఈ చిత్రం ద్వారా మంచి గుర్తింపు దక్కాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు చెప్పారు. ఈ చిత్ర యూనిట్ మొత్తానికి ప్రేక్షకుల నుంచి అద్భుతమైన ఆదరణ లభించాలని ఆకాంక్షించారు. దర్శకుడు వాచస్పతి మాట్లాడుతూ, వివి వినాయక్ గారిది గో÷–డలెన్ హ్యాండ్ అని, ఆయన చేతుల మీదుగా తమ సినిమా పోస్టర్ లాంచ్ కావడం ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు. మీడియా సహకారంతో ప్రేక్షకుల ముందుకు వస్తున్న ఈ చిత్రం ఒక చక్కటి సస్పెన్స్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌గా ఉంటుందని, ప్రేక్షకులను అలరించే అన్ని కమర్షియల్ హంగులు ఇందులో ఉన్నాయని తెలిపారు. అతి త్వరలోనే ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు ప్రకటించారు. హీరో రామ్ కార్తీక్ మాట్లాడుతూ, తమకు ఈ చిత్రంలో అవకాశం కల్పించిన దర్శకుడు వాచస్పతికి, నిర్మాత నరేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సినిమా ఖచ్చితంగా ప్రేక్షకులందరినీ అలరిస్తుందని నమ్మకం వ్యక్తం చేశారు. సంగీత దర్శకుడు ఆర్.ఆర్. ధృవన్ మాట్లాడుతూ, లెజెండ్రీ డైరెక్టర్ వి.వి. వినాయక్ చేతుల మీదుగా పోస్టర్ విడుదల కావడం తన కెరీర్‌లో మరువలేని క్షణమని, ఒక మంచి మ్యూజిషియన్‌కు కావాల్సిన అన్ని రకాల ఎమోషన్స్ ఈ సినిమాలో ఉన్నాయని వెల్లడించారు. ఈ చిత్రానికి శామ్ కె. నాయుడు సినిమాటోగ్రాఫర్‌గా వ్యవహరిస్తుండగా, వనరాజ్ కథ, స్క్రీన్‌ప్లే అందించారు.




# ప్యారడైజ్‌తో పోటీ పడనున్న డోరతి మూవీ




న్యాచురల్ స్టార్ నాని హీరోగా, కయాదు లోహర్ హీరోయిన్‌గా మాస్ డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో రూపొందుతున్న భారీ చిత్రం 'ది ప్యారడైజ్'. 'దసరా' వంటి బ్లాక్‌బస్టర్ విజయం తర్వాత ఈ క్రేజీ కాంబినేషన్‌లో సినిమా వస్తుండటంతో ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమాను సెప్టెంబర్ 25న విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. అయితే, సరిగ్గా అదే తేదీన నానితో పోటీ పడేందుకు ఆయన 'దసరా' సహనటి కీర్తి సురేష్ సిద్ధమవుతుండటం ప్రస్తుతం సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ప్రముఖ కోలీవుడ్ దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్ తెరకెక్కిస్తున్న 'డోరతి' చిత్రంలో కీర్తి సురేష్ ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. సంగీత మాంత్రికుడు ఇళయరాజా సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 25న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ ఇప్పటికే ప్రకటించింది. ప్రస్తుతానికి ఈ రిలీజ్ డేట్‌ను తమిళ వెర్షన్ కోసం లాక్ చేసినప్పటికీ, తెలుగులోనూ ఇదే తేదీకి వస్తే బాక్సాఫీస్ వద్ద నాని సినిమాతో కీర్తి సురేష్ నేరుగా పోటీ పడాల్సి వస్తుంది. మంచి స్నేహితులుగా ఉన్న నాని, కీర్తి సురేష్‌ల చిత్రాలు ఒకే తేదీన బరిలో నిలుస్తుండటంతో ఈ బాక్సాఫీస్ క్లాష్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. చివరికి ఈ సినిమాల విడుదల తేదీల్లో మార్పులు ఉంటాయా లేదా అనేదానిపై త్వరలోనే క్లారిటీ రానుంది.

# సందీప్ కిషన్ సరికొత్త చిత్రం కరికాల




యంగ్ హీరో సందీప్ కిషన్ తన కెరీర్‌లోనే అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌ను ప్రకటించారు. విభిన్న కథలను ఎంచుకుంటూ ప్రేక్షకులను అలరిస్తున్న ఆయన, ఇప్పుడు పీరియాడిక్ యాక్షన్ జానర్‌లోకి అడుగుపెడుతున్నారు. తాజాగా 'కరికాల' అనే భారీ చిత్రాన్ని అధికారికంగా ప్రకటిస్తూ మేకర్స్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. పోస్టర్ విడుదలైన వెంటనే సోషల్ మీడియాలో వైరల్‌గా మారి సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. ఇటీవలి కాలంలో పీరియాడిక్ కథలు, రాజుల చరిత్ర, యుద్ధ నేపథ్యంతో రూపొందుతున్న సినిమాలకు ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. అదే తరహాలో ఇప్పుడు సందీప్ కిషన్ కూడా ఓ భారీ పీరియాడిక్ కథతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. 'శంబాల' చిత్రంతో దర్శకుడిగా గుర్తింపు తెచ్చుకున్న యుగంధర్ ముని ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాను షైనింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై మహీధర్ రెడ్డి, రాజశేఖర్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. విడుదల చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్‌లో సందీప్ కిషన్ శక్తివంతమైన యోధుడి పాత్రలో కనిపిస్తున్నారు. చేతిలో కత్తి పట్టుకుని గుర్రంపై యుద్ధానికి దూసుకెళ్తున్న ఆయన లుక్ ఆకట్టుకుంటోంది. పోస్టర్‌లో ఆయన పక్కనే ఓ సింహం కనిపించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. యుద్ధభూమి వాతావరణం, భారీ విజువల్స్, పవర్‌ఫుల్ లుక్ సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతున్నాయి. పోస్టర్‌ను బట్టి చూస్తే, ఇది కేవలం యాక్షన్ సినిమా మాత్రమే కాకుండా చారిత్రక నేపథ్యంతో కూడిన ఎమోషనల్ సాగా కూడా కావచ్చని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ఈ ప్రాజెక్ట్‌ను రెండు భాగాలుగా తెరకెక్కించనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. విడుదల తేదీలను కూడా అధికారికంగా వెల్లడించారు. 'కరికాల చాప్టర్ 1' : 2027 జూలై 2, 'కరికాల చాప్టర్ 2' : 2027 అక్టోబర్ 28 అంటే కేవలం నాలుగు నెలల వ్యవధిలోనే రెండు భాగాలను విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేయడం విశేషం. ఇప్పటివరకు సందీప్ కిషన్ ఎక్కువగా యాక్షన్, థ్రిల్లర్, కామెడీ, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రాల్లో కనిపించారు. అయితే 'కరికాల' తో తొలిసారి భారీ పీరియాడిక్ యాక్షన్ కథలో నటిస్తున్నారు. అయితే సినిమా కథ, ఇతర నటీనటులు, సాంకేతిక బృందానికి సంబంధించిన పూర్తి వివరాలను మేకర్స్ త్వరలో వెల్లడించే అవకాశం ఉంది. ప్రస్తుతం 'సిగ్మా' విడుదల కోసం సందీప్ కిషన్ ఎదురు చూస్తున్నారు. విజయ్ కుమారుడు జేసన్ సంజయ్ ఈ సినిమాతో దర్శకుడిగా ఎంట్రీ ఇస్తున్నారు. జులై 31న 'సిగ్మా' విడుదల కావాల్సి ఉండగా కొన్ని కారణాల వల్ల ఇది వాయిదా పడింది.

This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com